FOR ADS....
ఆకాంక్ష
CONTACT :
8333818121

తొలి ఆకాంక్ష
TGTEL/25/A1964
తెలుగు సంచలన దిన పత్రిక

విలేకరులు కావలెను
ప్రజా సమస్యల పరిష్కార మార్గాలనే లక్ష్యంగా ఉన్నత ఆశయంతో ముందుకు పోతున్న తొలి ఆకాంక్ష దినపత్రికలో
భువనగిరి, జయశంకర్ భూపాలపల్లి, పెద్దపల్లి, జగిత్యాల, జనగాం, మహబూబ్ నగర్, నల్గొండ, ఖమ్మం, ఆదిలాబాద్, కామారెడ్డి, యాదాద్రి మేడ్చల్ మల్కాజిగిరి, వరంగల్, జోగులాంబ గద్వాల్ , సూర్యాపేట,
జిల్లా కేంద్రాలకు స్టాఫ్ రిపోర్టర్స్‌తో పాటు ...
అన్ని జిల్లాలోని నియోజక వర్గ కేంద్రాలకు విలేకరులు కావలెను ..
సంప్రదించండి...
8333818121
ఎడిటర్
పెనగొండ సతీష్
తొలి ఆకాంక్ష
akankshanews.com

ప్రచురణ : తెలంగాణ   సంపుటి : 01   సంచిక :161   ఎడిటర్ : పెనగొండ సతీష్   పేజిలు : 08,   వెల. 5రూ/   శనివారం- 31 - జనవరి - 2026

# తిరుమల కల్తీ నెయ్యి వ్యవహారంపై ప్రభుత్వానికి సిట్ లేఖ



**లేఖలో జరిగిన పరిణామాలు, దర్యాప్తులో తేలిన అంశాలు ప్రస్తావన**

**లడ్డూల్లో కల్తీ జరిగినట్లు నిర్ధారించడం సహా దిద్దుబాటు చర్యలు సూచించిన సిట్**

తిరుపతి : తిరుమల కల్తీ లడ్డు వ్యవహారంపై ప్రభుత్వానికి సిట్ లేఖ రాసినట్లు తెలుస్తోంది. లడ్డూ కల్తీ జరిగిన పరిణామాలు, దర్యాప్తులో తేలిన అంశాలు లేఖలో ప్రస్తావించినట్లు తెలుస్తోంది. 2019-24 మధ్య లడ్డూ ప్రసాదంలో అనేక తప్పిదాలను సిట్ లేఖలో ప్రస్తావించింది. లడ్డూలో కల్తీ జరిగిందని నిర్ధారించటంతో పాటు భవిష్యత్తు దిద్దుబాటు చర్యలను సూచించినట్లు సమాచారం. సిట్ లేఖను పూర్తిగా అధ్యయనం చేశాక స్పందించాలని ప్రభుత్వ భావిస్తోంది. సిట్ క్లీన్ చిట్ అంటూ ప్రజల్ని వైఎస్సార్సీపీ తప్పుదోవ పట్టించే యత్నాలపై ప్రభుత్వం సీరియస్ గా ఉంది. తప్పుడు ప్రచారాలను గట్టిగా తిప్పికొట్టడంతో పాటు కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం యోచిస్తోంది. భక్తుల విశ్వాసం, టీటీడీ ప్రయోజనాలు కాపాడే విషయంలో మిగతా..2లో

# మేడారం జనసంద్రం.. పోటెత్తిన భక్తజనం



- గద్దెలపై కొలువుదీరిన సమ్మక్క, సారలమ్మ
- వనదేవతల దర్శనానికి పోటెత్తిన భక్తజనం
- నేడు మేడారం వెళ్లనున్న తెలంగాణ గవర్నర్
- కరెంట్ కోతలతో ఉద్రిక్తత.. మంత్రి కారు ధ్వంసం
- వీఐపీలకే ప్రాధాన్యమంటూ పోలీసులపై విమర్శలు

హైదరాబాద్ : మేడారం మహా జాతరలో కీలక ఘట్టం ఆవిష్కృతమైంది. వన దేవతలు సమ్మక్క, సారలమ్మ గద్దెలపై కొలువుదీరడంతో శుక్రవారం భక్తులు పోటెత్తారు. దీంతో మేడారం పరిసరాలు జనసంద్రంగా మారాయి. మిగతా..2లో

# రేవంత్ ను తెలంగాణ సమాజం క్షమించదు




- తెలంగాణ జలాలను ఏపీకి దోచిపెడుతున్నారని హరీశ్ మండిపాటు
- కత్తి చంద్రబాబుది, పొడిచేది రేవంత్ రెడ్డి అని విమర్శ
- చంద్రబాబుకి గురుదక్షిణ చెల్లిస్తున్నాడని మండిపాటు

## ప్రపంచ దేశాలతో
# తెలంగాణ రాష్ట్రం పోటీ పడాలి

**రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క**

ప్రపంచ దేశాలతో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో పోటీ పడే విధంగా ఎదగాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు.


మిగతాది 2లో

హైదరాబాద్: ప్రపంచ దేశాలతో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో పోటీ పడే విధంగా ఎదగాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. రంగారెడ్డి జిల్లా మొగలిగిద్ద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 150 సంవత్సరాల ఉత్సవాలకు శుక్రవారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో భట్టి విక్రమార్క మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం సర్వతో ముఖంగా ఎదగాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యం, ఉపాధి పై ప్రత్యేక దృష్టిని పెట్టిందని తెలిపారు. రాష్ట్రంలో పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలనే సంకల్పంతో అత్యాధునిక సౌకర్యాలతో రూ. 22 వేల 500 కోట్ల రూపాయలతో 100 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలలను నిర్మిస్తున్నామని తెలిపారు.

**ప్రజలను అవసరాలను తీర్చే నాయకుని ఎన్నుకోవాలి: ఎంపీ ఈటెల రాజేందర్**

ప్రతి ఒక్క అసెంబ్లీ నియోజకవర్గంలో ఒక్కొక్క పాఠశాలను 25 ఎకరాల ప్రాంగణంలో రూ.200 కోట్ల రూపాయలతో అత్యాధునిక సౌకర్యాలతో రూపకల్పన చేసి నిర్మిస్తున్నామని పేర్కొన్నారు. మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా స్కిల్ డెవలప్మెంట్ సెంటర్లను ఏర్పాటు చేసి పరిశ్రమల యజమాన్యాలకు అవసరమైన విధంగా నిరుద్యోగ యువతకు శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిస్తామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు యూనిఫాం, పుస్తకాలు, సన్న బియ్యంతో మధ్యాహ్న భోజనాన్ని అందిస్తున్నామని, దేవుడు సహకరిస్తే ఆర్థిక పరిస్థితి బాగుపడితే ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు ఉదయం అల్పాహారాన్ని అందిస్తామని అన్నారు. ఇప్పటికే కొన్ని పాఠశాలలో పైలెట్ ప్రాజెక్టుగా మొదలుపెట్టామని

## ఫాంహౌస్ లో కేసీఆర్ తో
# సమావేశమైన కేటీఆర్

- ఎర్రవెల్లి ఫాంహౌస్ లో కొనసాగుతున్న భేటీ
- మున్సిపల్ ఎన్నికలు, సిట్ నోటీసులపై కొనసాగుతున్న చర్చ
- నిన్న కేసీఆర్ తో భేటీ అయిన హరీశ్ రావు



హైదరాబాద్: బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తో ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమావేశమయ్యారు. ఎర్రవెల్లి ఫాంహౌస్ లో వీరి భేటీ కొనసాగుతోంది. మున్సిపల్ ఎన్నికలు, ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ నోటీసులు తదితర అంశాలపై వీరు చర్చిస్తున్నట్టు సమాచారం. కేసీఆర్ తో నిన్న హరీశ్ రావు భేటీ అయిన సంగతి తెలిసిందే. సిట్ అడిగే ప్రశ్నలు, సమాధాలు ఇచ్చే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తదితర అంశాలపై వీరు చర్చించినట్టు తెలుస్తోంది. కేసీఆర్ కు అందిన నోటీసులను ఎలా ఎదుర్కోవాలి, ఈ విషయాన్ని పార్టీకి నష్టం కలగకుండా ప్రజల్లోకి ఎలా తీసుకెళ్లాలి అనే అంశంపై మిగతా..2లో

# భారతదేశ బడ్జెట్ చరిత్ర..



- ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సరికొత్త రికార్డును సృష్టించేందుకు సిద్ధమయ్యారు.
- ఫిబ్రవరి 1 బడ్జెట్‌తో వరుసగా 9 సార్లు బడ్జెట్ ప్రవేశపెట్టిన మంత్రిగా గుర్తింపు సొంతం చేసుకోనున్నారు.

ఢిల్లీ : ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చరిత్ర సృష్టించేందుకు సిద్ధమయ్యారు. ఫిబ్రవరి 1న ఆమె పార్లమెంటులో బడ్జెట్ ప్రవేశపెట్టనున్న విషయం తెలిసిందే. ఆర్థిక మంత్రిగా నిర్మలా సీతారామన్ వరుసగా ప్రవేశపెట్టనున్న 9వ బడ్జెట్ ఇది. పార్లమెంటులో 9 సార్లు బడ్జెట్ ప్రవేశపెట్టిన రికార్డు మాజీ మంత్రి పి.చిదంబరం సొంతం. మిగతా..2లో

## విద్యాసంస్థల్లో బాలికలకు ఉచితంగా శానిటరీ ప్యాడ్స్‌ను
# అందుబాటులో ఉంచాలి‘

- అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు సుప్రీంకోర్టు ఆదేశాలు
- రుతుక్రమ ఆరోగ్య హక్కు అనేది రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులోని భాగమని వ్యాఖ్య




ఢిల్లీ : విద్యాసంస్థల్లో చదువుతున్న బాలికల రుతుక్రమ ఆరోగ్యాన్ని ప్రాథమిక హక్కుగా గుర్తిస్తూ సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. దేశవ్యాప్తంగా ఉన్న అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదివే బాలికలకు ఉచితంగా బయోడిగ్రేడబుల్ శానిటరీ ప్యాడ్స్ అందుబాటులో ఉంచాలని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. బాలికల ఆరోగ్యం, గౌరవం, విద్యా హక్కుల పరిరక్షణకు ఇది తప్పనిసరి చర్య అని కోర్టు పేర్కొంది.

**బాలికలకు సరైన సౌకర్యాలు లేకపోవడం వల్ల!**

జస్టిస్ జేబీ. పార్దివాలా, జస్టిస్ ఆర్. మహదేవన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఈ మేరకు అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు స్పష్టమైన దిశానిర్దేశాలు ఇచ్చింది. "రుతుక్రమ ఆరోగ్య హక్కు అనేది రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 కింద వచ్చే జీవన హక్కులో భాగం" అని బెంచ్ వ్యాఖ్యానించింది. బాలికలకు సరైన సౌకర్యాలు లేకపోవడం వల్ల వారి చదువు, ఆరోగ్యం, గౌరవం దెబ్బతింటాయని, ఇది సమానత్వ హక్కుకు కూడా విరుద్ధమని న్యాయస్థానం అభిప్రాయపడింది.పరిశుభ్రత, భద్రత, గోప్యతకు ప్రాధాన్యం ఇచ్చే విధంగా!

## రాష్ట్రపతి ఇచ్చిన కండువాను రాహుల్
# ధరించకపోవడం అగౌరపరచడమే

- అసోం రాష్ట్ర సంస్కృతి సంప్రదాయాలను కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పట్టించుకోవడంలేదు
- రాష్ట్రపతి బహుకరించిన కండువాను ధరించడానికి నిరాకరించారు- అమిత్ షా




ఢిల్లీ: అసోం రాష్ట్ర సంస్కతి సంప్రదాయాలను కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పట్టించుకోలేదని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆరోపించారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నిర్వహించిన 'ఎట్ హోమ్' కార్యక్రమంలో ఆమె బహూకరించిన 'గమోసా' (కండువా)ను ధరించడానికి ఆయన నిరాకరించారని విమర్శించారు. అది ఈశాన్య ప్రాంతాన్ని అగౌరవపరచడమేనని ఆయన పేర్కొన్నారు. రాహుల్ గాంధీ తనకు నచ్చినట్లు ఉండవచ్చు కానీ, బీజేపీ అధికారంలో ఉన్నంత కాలం అసోం సంస్కృతి సంప్రదాయాలను అగౌరపరిస్తే సహించేదిలేదని ఆయన తేల్చి చెప్పారు.

**తుపాకులు, తూటాలు తప్ప ప్రజలకు ఏమిచ్చారు!**

# పక్కపక్కనే వందేభారత్ రైళ్లు




- విజయవాడ రైల్వేస్టేషన్ లో ప్రయాణికుడి తిప్పలు
- 6వ నంబరు ప్లాట్‌ఫాంలో ఉన్న రైలుకు బదులు 7వ నంబరు ప్లాట్‌ఫాంపై ఉన్న రైలు ఎక్కి, ప్రమాదకరంగా దిగిన ప్రయాణికుడు

ఢిల్లీ : ఎంత తొందరగా వెళ్లాల్సి వచ్చినా మనం ఎక్కాల్సిన రైలు గానీ, బస్సు గానీ, మరేదైనా వాహనమో ఎక్కితేనే గమ్యానికి చేరుకుంటాం. అలా కాకుండా ఏదో ఒక దాంట్లో, వచ్చిన దాంట్లో వెళ్దామంటే గమ్యం అగమ్యగోచరమవ్వడం ఖాయం. కొన్ని సార్లు ఇటువంటి ఘటనలు జరుగుతూనే ఉంటాయి. రైల్వే స్టేషన్లో అయితే ప్లాట్ ఫాం నెంబర్లతో గందరగోళంలో పడేవాళ్లు ఎందరో ఉన్నారు.

## బిగ్ షాక్.. కేసీఆర్ విజ్ఞప్తిని
# తిరస్కరించిన సిట్..

ఫోన్ ట్యాపింగ్ కేసులో కేసీఆర్‌ను ఎక్కడ విచారించాలనే అంశంపై సిట్ అధికారులు ఈ రోజు సమావేశం నిర్వహించి, న్యాయ నిపుణులతో చర్చించారు.

ఈ నేపథ్యంలోనే కేసీఆర్‌ను ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కాకుండా హైదరాబాద్‌లోనే విచారించాలని నిర్ణయించారు..



హైదరాబాద్, జనవరి 29: ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధించి తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు బిగ్ షాక్ తగిలింది. సిట్ అధికారులు శుక్రవారం మరోసారి ఆయనకు నోటీసులు ఇచ్చారు. ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కాకుండా హైదరాబాద్‌లోనే కేసీఆర్‌ను విచారించాలని నిర్ణయించారు. ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు విచారణకు అందుబాటులో ఉండాలని తెలిపారు. కాగా, నిన్న( గురువారం) సిట్ అధికారులు కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చిన సంగతి తెలిసిందే. నందినగర్‌లోని కేసీఆర్ నివాసానికి సిట్ అధికారులు వెళ్లి నోటీసులు అందజేశారు. శుక్రవారం మధ్యాహ్నం 3:00 గంటలకు విచారణకు అందుబాటులో ఉండాలని నోటీసులో స్పష్టం చేశారు. ఈ నోటీసులపై స్పందించిన కేసీఆర్.. ఈ మేరకు సిట్ అధికారులకు గురువారం లేఖ రాశారు. శుక్రవారం విచారణకు హాజరు కాలేనని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల కారణంగా విచారణను వాయిదా వేయాలని కోరారు. మరో రోజు విచారణకు పిలిస్తే తప్పకుండా హాజరవుతానని, విచారణ కోసం వేరే తేదీ నిర్ణయించాలని సిట్ అధికారులకు విజ్ఞప్తి చేశారు. కేసీఆర్‌ను ఎక్కడ విచారించాలనే దానిపై సిట్ అధికారులు ఈ రోజు సమావేశం నిర్వహించి, న్యాయ నిపుణులతో చర్చించారు. ఈ నేపథ్యంలోనే కేసీఆర్‌ను ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కాకుండా హైదరాబాద్‌లోనే విచారించాలని నిర్ణయించారు.

## కాకినాడ జేఎన్టీయూలో విద్యార్థులతో లోకేశ్
# ముఖాముఖి కార్యక్రమం

- అన్ని రంగాల్లో ఏపీని నెంబర్ వన్ గా నిలపడమే లక్ష్యమని స్పష్టీకరణ
- పాదయాత్ర అనుభవాలు ప్రభుత్వంలో అమలు చేస్తున్నామన్న యువనేత
- నైతిక విలువల కోసం చాగంటిని సలహాదారుగా నియమించామని వెల్లడి



అమరావతి : "ప్రభుత్వంలోకి రావడంతోనే మా పని పూర్తికాలేదు, అసలు పని ఇప్పుడే మొదలైంది" అంటూ రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. ఇచ్చిన హామీలను నెరవేర్చి, ఆంధ్రప్రదేశ్‌ను అన్ని రంగాల్లో నెంబర్ వన్ స్థానంలో నిలబెట్టడమే తమ ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. శుక్రవారం కాకినాడ జేఎన్టీయూలో 'హలో లోకేశ్' పేరిట నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో ఆయన విద్యార్థులతో మాట్లాడారు. ఈ కార్యక్రమానికి జేఎన్టీయూ ఈసీఈ మూడో సంవత్సరం విద్యార్థిని ప్రాప్తి యాంకర్ గా వ్యవహరించారు. జీవితంలో తీసుకునే కొన్ని నిర్ణయాలే భవిష్యత్తును నిర్దేశిస్తాయని, తన జీవితంలో పాదయాత్ర అలాంటి కీలక నిర్ణయమని లోకేశ్ అన్నారు. పాదయాత్ర ద్వారా కోట్లాది మంది ప్రజలు, యువత ఆశలు, ఆకాంక్షలు, సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకునే అవకాశం లభించిందని తెలిపారు. మిగతా..2లో

మొదటి పేజి తరువాయి

## కాకినాడ జేఎన్టీయూలో విద్యార్థులతో లోకేశ్ ముఖాముఖి కార్యక్రమం

ఆ యాత్రలో తాను ఎంతో నేర్చుకున్నానని, నాటి అనుభవాలనే ఇప్పుడు ప్రభుత్వంలో అమలు చేస్తున్నామని వివరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే యువతకు 4 లక్షల ఉద్యోగాలు కల్పించామని వెల్లడించారు. అభివృద్ధి వికేంద్రీకరణ, క్లస్టర్ ఆధారిత అభివృద్ధికి తమ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. విద్యార్థుల నుంచి సూచనలు స్వీకరించేందుకు, వారి మనోగతాన్ని తెలుసుకునేందుకు ఇకపై ప్రతినెలా విద్యార్థులతో సమావేశం కావాలని నిర్ణయించుకున్నట్లు చెప్పారు. విద్యార్థులు ఇచ్చే ఫీడ్‌బ్యాక్‌ను సీరియస్‌గా తీసుకుని, పాఠ్యప్రణాళిక మెరుగుదలకు ఉపయోగిస్తామని హామీ ఇచ్చారు. సీఎస్ఆర్ తరహాలో పరిశ్రమలు కూడా పరిశోధనలకు నిధులు కేటాయించాలని ఆయన సూచించారు. మనం ఏ స్థాయిలో ఉన్నా నైతిక విలువలను మరవద్దని విద్యార్థులకు హితవు పలికారు. పిల్లలను సోషల్ మీడియాకు దూరంగా ఉంచేలా చర్యలు తీసుకుంటున్నామని, అదే సమయంలో నైతిక విలువలు నేర్పించేందుకు ప్రముఖ ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావును ప్రభుత్వ సలహాదారుగా నియమించామని తెలిపారు. ఆయనకు కేబినెట్ ర్యాంకు ఇచ్చినా, ప్రభుత్వం నుంచి ఎలాంటి సదుపాయాలు తీసుకోవడం లేదని గుర్తుచేశారు. 'అమ్మకు చెప్పలేని పని మనం చేయకూడదు' అనే చాగంటి మాట ఎంతో శక్తిమంతమైనదని లోకేశ్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను అగ్రగామిగా నిలబెట్టాలన్న లక్ష్యంలో విద్యార్థులంతా భాగస్వాములు కావాలని, వారి భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని లోకేశ్ భరోసా ఇచ్చారు.

## పక్కపక్కనే వందేభారత్ రైళ్లు

దీనికి తోడు రైళ్ల సమయ పాలనకో తరచూ తేడాలు ఉండటం ప్రయాణికులకు మరింత ఇబ్బందికరంగా మారుతున్నాయి. కొన్ని సార్లు మనం ఎంత జాగ్రత్తగా ఉన్నప్పటికీ అనివార్య కారణాలతో ఏదో ఒక పొరపాటు జరుగుతూనే ఉంటుంది. ఇలాంటి ఘటనే తాజాగా విజయవాడ రైల్వే స్టేషన్ లో జరిగింది. 6వ ప్లాట్ ఫాంకు బదులు 7: ప్రతీ రోజు విశాఖ నుంచి సికింద్రాబాద్, సికింద్రాబాద్ నుంచి విశాఖ వెళ్లే వందేభారత్ రైళ్లు ఐదు నిముషాల తేడాతో విజయవాడ రైల్వేస్టేషన్‌లో ఆగుతాయి. దీంతో ప్రయాణికులు తికమక పడి ఒక రైలుకు బదులు మరో రైలు ఎక్కి ఇబ్బంది పడుతున్న సంఘటనలు తలెత్తుతున్నాయి. అయితే తాజాగా ఒక ప్రయాణికుడు సికింద్రాబాద్‌కు వెళ్లడానికి వందేభారత్ లో టికెట్ బుక్ చేసుకున్నాడు. ఆ క్రమంలోనే విజయవాడ రైల్వే స్టేషన్ కు వెళ్లాడు. అప్పటికే ప్లాట్ ఫాం మీద రైలు కదలడానికి సిద్ధంగా ఉండటాన్ని గమనించాడు. దీంతో తాను ఎక్కాల్సిన రైలు వెళ్లిపోతుందని భావించి, కంగారులో 6వ నంబరు ప్లాట్‌ఫాంలో ఉన్న రైలుకు బదులు 7వ నంబరు ప్లాట్‌ఫాంపై ఉన్న రైలు ఎక్కడానికి వచ్చారు.

## ప్రపంచ దేశాలతో తెలంగాణ రాష్ట్రం పోటీ పడాలి: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే 40% డైట్ చార్జీలను, 200 శాతం కాస్మోటిక్ చార్జీలను పెంచామని తెలిపారు.

### సమ్మక్క సారలమ్మలను దర్శించుకున్న ప్రముఖులు

బూర్గుల తీసుకువచ్చిన చట్టాలను ఇక్కడ ప్రదర్శన చేస్తే నేటి సమాజానికి తెలియజేసిన వారమవుతామని అన్నారు. అలాగే పాఠశాలలో గ్రంథాలయం ఏర్పాటుకు ప్రతిపాదనలను పంపిస్తే రాష్ట్ర ముఖ్యమంత్రి తో మాట్లాడి నిధులను మంజూరి చేయిస్తానని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క అన్నారు. అంతకుముందు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ గత ప్రధాన మంత్రులు జవహర్ లాల్ నెహ్రూ, ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ తీసుకువచ్చిన పంచవర్ష ప్రణాళికలతో నేడు దేశం అన్ని రంగాలలో అభివృద్ధి పథంలో దూసుకుపోతుందని అన్నారు. చరిత్ర ఎప్పుడు ప్రస్తుతానికి కులమానమని, భవిష్యత్తుకు మార్గదర్శకమని మొగిలిగిద్ద పాఠశాల 150వ వార్షికోత్సవంలో పాల్గొనడం ఆనందంగా ఉందని తెలిపారు. విద్యతోనే వ్యక్తికి, కుటుంబానికి సమాజంలో పేరు వస్తుందని, నేడు తల్లిదండ్రులు తమ పిల్లలకు స్థిర చరాస్తుల కంటే విద్యను అందించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు.

కస్తూరిబా పాఠశాలను పరిశీలించిన మంత్రులు..

మొగిలిగిద్ద ప్రభుత్వ పాఠశాల 150 వసంతాల కార్యక్రమానికి హాజరైన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్ శుక్రవారం అకస్మాత్తుగా మొగలిగిద్ద కస్తూరిబా గాంధీ బాలికల వసతిగృహాన్ని సందర్శించారు. పాఠశాలలో, వసతి గృహంలో సౌకర్యాలను విద్యార్థినీలను అడిగి మంత్రులు తెలుసుకున్నారు. విద్యార్థినీలతో కలిసి మంత్రులు వసతి గృహంలోనే మధ్యాహ్న భోజనం చేశారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క విద్యార్థినీలతో మాట్లాడుతూ పాఠశాల ఎలా ఉంది, భోజన వసతులు ఎలా ఉంది అంటూ విద్యార్థులకు అందుతున్న వసతులను అడిగి తెలుసుకున్నారు.

## మేడారం జనసంద్రం.. పోటెత్తిన భక్తజనం

భారీగా తరలివచ్చిన భక్తులను నియంత్రించడం అధికారులకు సవాలుగా మారింది. మరోవైపు తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ నేడు మేడారం సందర్శించి, వన దేవతలకు మొక్కులు చెల్లించుకోనున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు ఆయన పర్యటనకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. బుధవారం సారలమ్మ, గురువారం సమ్మక్క గద్దెలపైకి చేరడంతో గురువారం అర్ధరాత్రి నుంచే భక్తులు తమ మొక్కులు చెల్లించుకోవడం ప్రారంభించారు. అయితే, గురువారం రాత్రి జాతర ప్రాంగణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఆగ్రహానికి గురైన కొందరు భక్తులు, అక్కడే ఉన్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కారు అద్దాలను, సమీపంలోని దుకాణాలను ధ్వంసం చేశారు. ఈ నెల 28న ప్రారంభమైన ఈ జాతర 31న ముగియనుంది. జాతరకు వీఐపీలు, వీవీఐపీలు పెద్ద సంఖ్యలో తరలివస్తుండటంతో భద్రతను కట్టుదిట్టం చేశారు. ఐజీ చంద్రశేఖర్ రెడ్డి నేతృత్వంలో 25 మంది ఐపీఎస్ అధికారులు భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. అయితే, పోలీసులు వీవీఐపీలు, వారి కుటుంబాల సేవకే పరిమితమై సామాన్య భక్తుల రద్దీని నియంత్రించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, జువెల్ ఓరమ్ వన దేవతలను దర్శించుకున్నారు.

## ఫాంహౌస్ లో కేసీఆర్ తో సమావేశమైన కేటీఆర్

నిన్న హరీశ్ తో, కేటీఆర్ తో చర్చిస్తున్నట్టు సమాచారం. రాబోయే రోజుల్లో రాజకీయ పరంగా ఎలాంటి అడుగులు వేయాలి, ఎలాంటి ప్రజా ఉద్యమాలను నిర్మించాలి, మీడియా ముందుకు ఎలాంటి అంశాలను తీసుకెళ్లాలనే అంశాలపై చర్చ జరుగుతోంది. మున్సిపల్ ఎన్నికలను బీఆర్ఎస్ పార్టీ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. ఈ ఎన్నికల్లో విజయం సాధించి కాంగ్రెస్ పార్టీ దూకుడు తగ్గించాలనే పట్టుదలతో ఉంది.

## రేవంత్ ను తెలంగాణ సమాజం క్షమించదు

హైదరాబాద్ : తెలంగాణ జలాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆంధ్రకు దోచిపెడుతున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు విమర్శలు గుప్పించారు. ఈ ప్రాంతంవాడే తెలంగాణకు ద్రోహం చేస్తున్నాడని కాళోజీ ముందే చెప్పినట్టే... సీఎం హోదాలో రేవంత్ రెడ్డి తెలంగాణ నీటిని ఏపీకి దోచిపెడుతున్నారని అన్నారు. పక్కా పథకం ప్రకారం పోలవరం-నల్లమలసాగర్ కు ఏపీ ప్రభుత్వానికి రేవంత్ సర్కార్ సహకరిస్తోందని ఆరోపించారు. ఇందులో భాగంగానే సుప్రీంకోర్టులో చెల్లని రిట్ పిటిషన్ వేసి, వాపస్ తెచ్చుకున్నారని విమర్శించారు. తొలి నుంచి కూడా గోదావరి నదీ జలాల అక్రమ తరలింపుపై బీఆర్ఎస్ అప్రమత్తం చేస్తూనే ఉందని... అయినా కాంగ్రెస్ ప్రభుత్వం పెడచెవిన పెట్టిందని హరీశ్ అన్నారు. ముల్లు కర్రతో పొడుస్తూ మొద్దు నిద్ర లేపుతున్నా... కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం తప్పులు చేస్తూనే ఉందని దుయ్యబట్టారు. జలద్రోహం విషయంలో కత్తి చంద్రబాబుదని, పొడిచేది రేవంత్ రెడ్డి అని అన్నారు. చంద్రబాబుకు రేవంత్ రెడ్డి గురుదక్షిణ చెల్లిస్తున్నాడని విమర్శించారు. చంద్రబాబు కోసం రాష్ట్రానికి అన్యాయం చేస్తున్న రేవంత్ ను తెలంగాణ సమాజం క్షమించదని హరీశ్ అన్నారు. రేవంత్ దుర్మార్గాన్ని ప్రజాక్షేత్రంలో ఎండగడతామని, రాష్ట్ర నీటి హక్కుల కోసం మరో పోరాటం చేస్తామని ప్రకటించారు. తెలంగాణకు జరుగుతున్న దోపిడీపై కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ ఇప్పటికైనా నోరు విప్పాలని డిమాండ్ చేశారు.

## విద్యాసంస్థల్లో బాలికలకు ఉచితంగా శానిటరీ ప్యాడ్స్‌ను అందుబాటులో ఉంచాలి'

పాఠశాలల్లో కేవలం శానిటరీ ప్యాడ్స్ అందించడం మాత్రమే కాకుండా, మౌలిక వసతుల విషయంలో కూడా కోర్టు కఠిన ఆదేశాలు జారీ చేసింది. ప్రతి పాఠశాలలో బాలికలు, బాలురకు విడివిడిగా టాయిలెట్లు ఏర్పాటు చేయాలని తెలిపింది. అదేవిధంగా దివ్యాంగులకు అనుకూలంగా ప్రత్యేక టాయిలెట్లు తప్పనిసరిగా ఉండాలని పేర్కొంది. పరిశుభ్రత, భద్రత, గోప్యతకు ప్రాధాన్యం ఇచ్చే విధంగా సౌకర్యాలు కల్పించాలని రాష్ట్రాలకు సూచించింది.

ఆదేశాలను పాటించకపోతే గుర్తింపును రద్దు చేసే చర్యలు

ప్రభుత్వ పాఠశాలలతో పాటు ప్రైవేటు పాఠశాలలు కూడా ఈ నిబంధనలను తప్పనిసరిగా అమలు చేయాలని కోర్టు స్పష్టం చేసింది. ఒకవేళ ప్రైవేటు విద్యాసంస్థలు ఈ ఆదేశాలను పాటించకపోతే వాటి గుర్తింపును రద్దు చేసే చర్యలు తీసుకోవాలని హెచ్చరించింది. బాలికలకు కనీస సదుపాయాలు కల్పించకపోవడం తీవ్ర నిర్లక్ష్యంగా పరిగణించబడుతుందని తెలిపింది.

### రాష్ట్రాలు విఫలమైతే వాటిని జవాబుదారులుగా నిలబెడతామంటూ!

ఇక ప్రభుత్వాల బాధ్యతలపై కూడా సుప్రీంకోర్టు గట్టిగా స్పందించింది. టాయిలెట్లు, ఉచిత శానిటరీ ప్యాడ్స్ అందించడంలో రాష్ట్రాలు విఫలమైతే వాటిని జవాబుదారులుగా నిలబెడతామని స్పష్టం చేసింది. అవసరమైన బడ్జెట్ కేటాయింపులు చేసి, పాఠశాల స్థాయిలో పర్యవేక్షణ వ్యవస్థ ఏర్పాటు చేయాలని సూచించింది.

## చదువు అనేది గేమ్‌ఛేంజర్ - విదేశాల్లోని వైద్య నిపుణులు అమరావతికి తిరిగి రావాలి

మొదటి పేజి తరువాయి

ప్రపంచంలో ఉండే వైద్య సాంకేతికత మొత్తాన్ని, అత్యవసర వైద్యం అందించేందుకు వీలుగా ఎయిర్ అంబులెన్స్ లు, డ్రోన్లు అందుబాటులోకి తెస్తామన్నారు. విదేశాల్లో ఉన్న వైద్య నిపుణులు అమరావతికి తిరిగి రావాలని విజ్ఞప్తి చేశారు. జింకానా తరపున ఎంసీహెచ్ బ్లాక్ ఏర్పాటు చేసినట్లే రాష్ట్రంలోని మిగతా కళాశాలల్లో పూర్వ విద్యార్థులు ముందుకు రావాలన్నారు. సంపాదన వల్ల మనిషికి తృప్తి రాదని, ఆ డబ్బును సమాజానికి తిరిగి ఇవ్వడంలోనే నిజమైన సంతోషం దాగి ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున చేపట్టిన పీ-4 కార్యక్రమంలో భాగస్వాములు కావాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. పీపీపీ విధానం వల్లే దేశంలోని జాతీయ రహదారులు అద్భుతంగా తయారయ్యాయని అందుకే వైద్య రంగంలో మౌలిక వసతుల కల్పన ఈ విధానాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు.

### చదువు అనేది గేమ్‌ఛేంజర్ - విదేశాల్లో ఉన్న వైద్య నిపుణులు అమరావతికి తిరిగి రావాలి : సీఎం చంద్రబాబు

సంపాదనలో కొంతభాగం సమాజానికి : "ఆర్థిక అసమానతలు తగ్గాలి పేదరికం లేని సమాజం చూడాలి. ఆర్థిక అసమానతలు తగ్గించే వ్యవస్థకు శ్రీకారం చుట్టాలి. పీ4 కార్యక్రమానికి ముందుకు రావాలని అందరినీ కోరుతున్నా. సంపాదనలో కొంతభాగం సమాజానికి



వెచ్చించాలి. ప్రపంచంలోని అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలో భారత్ నాలుగో స్థానంలో ఉంది. 2028 నాటికి మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ తయారవుతుంది. 2038 నాటికి రెండో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ తయారవుతుంది. 2047 నాటికి ప్రపంచంలోనే ప్రథమస్థానంలో భారత్ ఉండాలనేది మనందరి ఆకాంక్ష. స్వర్ణాంధ్ర విజన్ 2047 తయారుచేశాం" అని సీఎం చంద్రబాబు వెల్లడించారు. "మనం మాత్రమే కాదు, సమాజం కూడా బాగుండాలనేది మన సంస్కృతి. అనేక సేవా కార్యక్రమాలకు ముందుకొచ్చి భారీగా విరాళాలు ఇస్తున్నారు. పిల్లలు ఎంత పెద్దవాళ్లయినా జీవితాంతం ఏ సహాయం కావాలన్నా అందించే సంస్కృతి మనది. రూ.100 కోట్లు ఖర్చు పెట్టి మాతా శిశు సంరక్షణ కేంద్రం ఏర్పాటు చేశారు. చైతన్యం పెరిగింది సేవా కార్యక్రమాలకు చాలామంది ముందుకొస్తున్నారు. జన్మభూమి కార్యక్రమానికి పిలుపు ఇవ్వగానే అభివృద్ధికి దోహదం చేశారు. ఆర్థిక అసమానతలు తగ్గితేనే సమాజం బాగుంటుంది. చదువు అనేది గేమ్‌ఛేంజర్ సరైన సమయంలో నిర్ణయాలు ఉండాలి. భారతరత్నకు మారుపేరుగా కలాం నిలిచారు. సాధారణ కుటుంబంలో పుట్టినా ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్తే ఉన్నత స్థితికి చేరుకుంటారు." - సీఎం చంద్రబాబు ఆరోగ్య రంగాన్ని మెరుగుపర్చేందుకే పీపీపీ : రాష్ట్రంలో వైద్య విద్యను, ఆరోగ్య రంగాన్ని మెరుగుపర్చేందుకే పీపీపీ విధానాన్ని తీసుకువస్తున్నట్లు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ స్పష్టం చేశారు. గుంటూరు జీజీహెచ్ లో మాతా శిశు సంరక్షణ కేంద్రం ప్రారంభోత్సవంలో సీఎంతో పాటు ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన సత్య కుమార్, జగన్ కేవలం పది శాతం నిధులు ఖర్చు చేసిన మెడికల్ కలేజీలు పూర్తి చేశామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. రక్షణ రంగంలో కూడా పీపీపీ అమలు చేస్తుంటే వైద్య రంగంలో పీపీపీ తప్పు ఎలా అవుతుందని ప్రశ్నించారు. తిరుమల నెయ్యి కల్తీ వ్యవహారం పైన వైఎస్సార్సీపీ వితండవాదం చేస్తోందని మండిపడ్డారు. అనంతరం కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ, చంద్రబాబు గతంలో హైదరాబాద్ లో జీనో వ్యాలీ, విశాఖలో మెడిటెక్ జోన్ ఏర్పాటు చేయడం వల్లే వైద్య రంగం పురోగతి చెందిందని అన్నారు. గుంటూరు జీజీహెచ్ లో అదనపు బ్లాకుల నిర్మాణానికి తులసి రామ చంద్ర ప్రభు రూ.10 కోట్లు ఇచ్చారని మరి కొందరు దాతలు కూడా అభివృద్ధి కోసం ముందుకు వచ్చారని తెలిపారు. గతంలో టీడీపీ అధికారంలో ఉండగా శిలాఫలకాలు వేసిన ప్రాజెక్టులను వైఎస్సార్సీపీ నిలిపివేసిందని కూటమి వచ్చాక వాటన్నింటిని పూర్తి చేస్తున్నట్లు వివరించారు.

## రాష్ట్రపతి ఇచ్చిన కండువాను రాహుల్ ధరించకపోవడం అగౌరపరచడమే

మొదటి పేజి తరువాయి

ఈ సందర్భంగా దిబ్రూఘర్ లోని ఖనికర్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన బహిరంగ సభలో అమిత్ షా మాట్లాడారు. విదేశాల నుంచి వచ్చిన వారితో సహా ప్రముఖులందరూ గౌరవ సూచకంగా కండువాను ధరించారని, కానీ రాహుల్ గాంధీ మాత్రమే అలా చేయడానికి నిరాకరించిన ఏకైక వ్యక్తి అని షా పేర్కొన్నారు. కాంగ్రెస్ ను ఉద్దేశించి షా కీలక వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ ఓటు బ్యాంకు రాజకీయాల కోసం చొరబాట్లను ఆయుధంగా ఉపయోగించుకుందని ఆరోపించారు. కానీ, బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అసోంలో ఎలాంటి చొరబాట్లు జరగలేదని తెలిపారు. అక్రమంగా భారత్ లోకి ప్రవేశించిన వారిని గుర్తించి వెనక్కి పంపిస్తామని ఆయన పేర్కొన్నారు. అదే విధంగా, తుపాకులు, తూటాలు, ఘర్షణలు, మరణాలు తప్ప కాంగ్రెస్ అసోంకు ఏమి ఇచ్చిందని రాహుల్ గాంధీని ప్రశ్నించారు.

### వాగ్దానాలను ఆచరణలోకి తెచ్చి చూపించాం!

ఇదిలా ఉండగా, అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మను అభినందిస్తూ అమిత్ షా కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుత ప్రభుత్వం, గత కాంగ్రెస్ ప్రభుత్వాల మాదిరిగా హామీలను కాగితాలకే పరిమితం చేయలేదని, తాము ఇచ్చిన వాగ్దానాలను సమర్థవంతంగా ఆచరణలోకి తీసుకొచ్చిందని షా పేర్కొన్నారు. అసోంను మరింత సమగ్రంగా తీర్చిదిద్దుతామని ఇచ్చిన హామీని రాష్ట్ర ప్రభుత్వం నిలబెట్టుకుందన్నారు. దిబ్రూఘడ్ లో 250 ఎకరాల్లో విస్తరించి ఉన్న అసోం రెండో శాసనసభ సముదాయానికి పునాది రాయి పడిందన్నారు. అది ఆ ప్రాంతానికి ఒక చారిత్రాత్మక అడుగు అని షా అభివర్ణించారు. అసోం అభివృద్ధికి కాంగ్రెస్ ఏమీ చేయలేదని, కానీ బీజేపీ మాత్రం రాష్ట్ర ప్రగతికి కట్టుబడి ఉందని ఆయన వ్యాఖ్యానించారు. మహాత్మా గాంధీ వర్ధంతి, ఈ సందర్భంగా ఆయనకు నివాళులర్పించాం. ఈ రోజు ఇక్కడ సుమారు రూ. 825 కోట్ల విలువైన 5 ప్రాజెక్టులకు శంకుస్థాపన చేయడం జరిగింది. నేను అసోం ముఖ్యమంత్రికి నా హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నాను. ఎందుకంటే, 2025 నాటికి అసోంను సమ్మిళిత రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని ఆయన గతంలో ప్రకటించారు. అలాగే, దిబ్రూఘడ్ ను అసోం రెండో రాజధానిగా చేస్తామని కూడా ప్రకటించారు. కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో అనేక ప్రకటనలు కేవలం ప్రకటనలుగానే మిగిలిపోవడాన్ని మనమంతా చూశాం. కానీ హిమంత బిశ్వ శర్మ చేసిన వాగ్దానాలను ఆచరించి చూపించారు. ఈ రోజు 250 ఎకరాల విస్తీర్ణంలో అసోం రెండో శాసనసభ సముదాయానికి శంకుస్థాపన జరిగింది. ఈ రోజు నుంచి భారత్ అంతటా ఉన్న దిబ్రూఘడ్ నివాసులందరూ అసోం రాజధాని నివాసులుగా పరిగణలోకి రానున్నారు. దిబ్రూఘడ్ గడ్డ, అసోం



తేయాకును ప్రపంచమంతటా విస్తరించేలా చేసింది. ప్రపంచ వేదికపై భారత్ కు ఓ ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చింది" అని అమిత్ షా పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, అసోం నూతన అసెంబ్లీ భవనానికి శంకుస్థాపన చేయడానికి ముందు, ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ సమక్షంలో జరిగిన కార్యక్రమంలో అమిత్ షాను సత్కరించారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా ఎన్నికల వ్యూహాలను చర్చించడానికి బీజేపీ నాయకులతో షా సమావేశం కానున్నారు.

## తిరుమల కల్తీ నెయ్యి వ్యవహారంపై ప్రభుత్వానికి సిట్ లేఖ

మొదటి పేజి తరువాయి

రాజీ లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. గత ప్రభుత్వ హయాంలో శ్రీవారి లడ్డూ తయారీలో ప్రాణాలు తీసే రసాయనాలు వాడారని, కల్తీ నెయ్యితో 20 కోట్ల లడ్డూలు తయారు చేశారని తిరుమల తిరుపతి దేవస్థానం (టిటి) ఛైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు. నెయ్యిలో నూటికి నూరు శాతం కల్తీ జరిగిందన్నారు. నివేదికలో జంతువుల కొవ్వులు లేవని ఎక్కడా నిర్ధరణ కాలేదని చెప్పారు. శుక్రవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. కమీషన్ల కోసం కక్కుర్తిపడి భోలే బాబా డెయిరీకి టెండర్లు ఇచ్చారని, గత టీటీడీ ఛైర్మన్, మురా మేస్త్రి సహకారం లేకుండా ఇవన్నీ చేయగలరా? అని ప్రశ్నించారు. "సుబ్బారెడ్డి పీఏ చిన్నప్ప ఖాతాలోకి రూ.కోట్లు వచ్చాయి. ఆ ఖాతా నుంచి ఎక్కడికి వెళ్లాయో సీబీఐ వెల్లడించాలి. ఈ అక్రమాల వెనుక ఉన్నవారి పేర్లు బయటపెట్టాలని సీబీఐని కోరుతున్నాం. కూటమి ప్రభుత్వం రాకుంటే ఆ కల్తీ నెయ్యి ఇంకా కొనసాగేది. దుర్మార్గుల నుంచి టీటీడీని మనమంతా కాపాడుకోవాలి" అని బీఆర్ నాయుడు అన్నారు. "పాలు, వెన్న లేకుండా 60 లక్షల కిలోల నెయ్యి ఎలా వచ్చింది? ప్రమాదకరమైన రసాయనాలు వాడారని సిట్ నివేదిక ఇచ్చింది. వాసన వచ్చేందుకు వేశారా మరేదైనా కారణమా తెలియదు. హిందువుల ప్రాణాలు తీసేందుకే వారు రసాయనాలు వాడారు. కల్తీ నెయ్యి కలిపిన లడ్డూలను కోట్లమందికి పంచారు. కల్తీ నెయ్యి వినియోగం వాళ్లు చేసిన మహా పాపం. ఆ కల్తీ నెయ్యితో 20 కోట్ల



లడ్డూలు తయారు చేశారు. అనేక అక్రమాలు చేసి రూ.వేల కోట్లు సంపాదించారు." - బీఆర్ నాయుడు, టీటీడీ ఛైర్మన్ ఆధారాలతో సహా అభియోగపత్రం : వైఎస్సార్సీపీ హయాంలో తిరుమల తిరుపతి దేవస్థానానికి కల్తీ నెయ్యి సరఫరా జరిగిందని, సుప్రీంకోర్టు ఏర్పాటు చేసిన సిట్ నిగ్గు తేల్చింది. దీన్నే తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో వినియోగించారని నిర్ధరించింది. తద్వారా కోట్ల మంది భక్తుల మనోభావాలను దెబ్బ తీశారని పేర్కొంది. 2019 కంటే ముందున్న కఠిన నిబంధనల్ని వైఎస్సార్సీపీ అధికారంలోకి వచ్చాక సడలించడం, అదే అదునుగా కల్తీ నెయ్యి సరఫరా సంస్థలు చొరబడిన తీరును ఆధారాలతో సహా అభియోగపత్రంలో ప్రస్తావించింది. 2019-24 మధ్య టీటీడీకి సరఫరా అయిన నెయ్యి నమూనాల్లో నెయ్యి పరిమాణం చాలా తక్కువగా ఉన్నట్లు గుజరాత్‌లోని ఎన్ డీడీబీ-కాఫ్ ప్రయోగశాల విశ్లేషణలో తేలిందని సిట్ వెల్లడించింది. 'భగవాన్‌పూర్‌లోని భోలేబాబా ఓరోగానిక్ డెయిరీ మిల్క్ ప్రైవేట్ లిమిటెడ్‌లో 2019 నుంచి 2024 వరకూ రూ.68 లక్షల 17 వేల కిలోల కల్తీ నెయ్యి తయారు చేశారని సిట్ తెలిపింది. అందులో రూ.59 లక్షల 71 కిలోలను అగ్‌మార్క్ స్పెషల్ గ్రేడ్ ఆవు నెయ్యి ముసుగులో టీటీడీకి సరఫరా చేశారని పేర్కొంది. తద్వారా రూ.234 కోట్ల 51 లక్షల రూపాయల నిధులు దుర్వినియోగానికి పాల్పడ్డారని స్పష్టం చేసింది. నెయ్యి వాసనలు వచ్చేందుకు ఈ రసాయనాలు: భోలేబాబా డెయిరీ ప్రతినిధులు, నిందితులైన పొమిల్ జైన్, విపిన్ జైన్‌లు కల్తీ నెయ్యి తయారీ కోసం తమ అనుబంధ సంస్థలైన హర్షా ట్రేడింగ్ కంపెనీ, హర్షా ఫ్రెష్ డెయిరీ ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా కల్తీ నెయ్యి తయారీ కోసం కోల్‌కతాలోని బుడ్జె బుడ్జె రిఫైనరీస్ లిమిటెడ్, ఇతర సంస్థల నుంచి పామ్ కెర్నెల్ ఆయిల్, రిఫైన్డ్ పామాయిల్, రిఫైన్డ్ పామోలిన్ ఆయిల్ కొన్నారు. అరిస్టో కెమికల్స్ నుంచి లాక్టిక్ యాసిడ్, సుగంధ్ ఆయిల్స్ అండ్ కెమికల్స్, శివాన్ని ట్రేడింగ్ కంపెనీ, జీఆర్ ఇంపెక్స్ నుంచి ఎసిటిక్ యాసిడ్ ఎస్టర్, మోనోగ్లిసరైడ్స్ వంటి రసాయనాలు సేకరించారు. పొమిల్ జైన్, విపిన్ జైన్ వారి ఉద్యోగులైన మోహన్ రాణా, సంజయ్ చౌహాన్ , ఆశిష్ రోహిలాలతో కలిసి కల్తీ నెయ్యి తయారు చేశారు. పాలు, వెన్న వంటివి సేకరించకుండా పామాయిల్, పామ్ కెర్నెల్ ఆయిల్, పామోలిన్ ఆయిల్ అతి తక్కువ పరిమాణంలో నెయ్యితో కలిపి రసాయనాలు జోడించి ఈ కల్తీ నెయ్యి తయారు చేశారు. ల్యాబ్ పరీక్ష విలువ సర్దుబాటు, నెయ్యి వాసనలు వచ్చేందుకు ఈ రసాయనాలు కలిపారు.

## భారతదేశ బడ్జెట్ చరిత్ర..

మొదటి పేజి తరువాయి

1996లో అప్పటి ప్రధాని హెచ్‌డీ దేవగౌడ సారథ్యంలో మంత్రి చిదంబరం తొలిసారిగా బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఆ తరువాత 1997లో రెండోసారి, 2004-08 మధ్య కాలంలో వరుసగా ఐదు సార్లు, 2013, 2014ల్లో మరో రెండు సార్లు ఆయన బడ్జెట్ ప్రవేశపెట్టారు. ఇక లోక్‌సభలో అత్యంత సుదీర్ఘ బడ్జెట్ ప్రసంగం చేసిన మంత్రిగా నిర్మలా సీతారామన్ ఇప్పటికే అరుదైన గుర్తింపును సొంతం చేసుకున్నారు

### బడ్జెట్ చరిత్ర.. ఆసక్తికర విషయాలు

భారత్‌కు సంబంధించిన తొలి బడ్జెట్‌ను 1860లో అప్పటి ఆర్థిక మంత్రి జేమ్స్ విల్సన్ ప్రవేశపెట్టారు. భారత మండలి సభ్యుడిగా ఆయన ఈ బడ్జెట్‌ను తీసుకొచ్చారు. 1857 సిపాయి తిరుగుబాటు అనంతరం, భారత ఆర్థిక వ్యవస్థలో సంస్కరణల పేరిట వలసపాలకులు ఈ బడ్జెట్‌ను తీసుకొచ్చారు. ఇక స్వాతంత్ర్యానంతరం, 1947 నవంబర్ 26న భారత దేశ ఆర్థిక మంత్రి ఆర్‌కే షణ్ముఖం చెట్టి తొలి బడ్జెట్‌ను పార్లమెంటులో ప్రవేశపెట్టారు. అత్యధిక సార్లు బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన రికార్డును మాజీ ప్రధాని మొరార్జీ దేశాయ్ సొంతం చేసుకున్నారు. మొత్తం 10 బడ్జెట్‌లను ఆయన పార్లమెంటు ముందుకు తెచ్చారు. 1959-64 మధ్యకాలంలో ఆర్థిక మంత్రిగా ఆరు సార్లు, ఆ తరువాత 1967-1969 మధ్య మరో నాలుగు సార్లు ప్రవేశపెట్టారు.




ఇక ప్రణబ్ ముఖర్జీ కూడా వివిధ సందర్భాల్లో మొత్తం 8 బడ్జెట్‌లను ప్రవేశపెట్టారు. 1982-84 మధ్యకాలంలో వరుసగా మూడు సార్లు, ఆ తరువాత 2009-12 మధ్య వరుసగా ఐదు సార్లు బడ్జెట్‌ను (మధ్యంతర బడ్జెట్ సహా..) తీసుకొచ్చారు. ఇక మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ వరుసగా ఐదు సార్లు పీవీ నరసింహారావు ప్రభుత్వంలో ఆర్థిక మంత్రిగా బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. అత్యంత సుదీర్ఘ బడ్జెట్ ప్రసంగం చేసిన వ్యక్తిగా ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ రికార్డును సొంతం చేసుకున్నారు. 2020 ఫిబ్రవరి 1న బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఏకంగా 2 గంటల 40 నిమిషాల పాటు ఆమె ప్రసంగించారు. చివరకు ఇంకా రెండు పేజీల వివరాలు మిగిలుండగానే నాడు ఆమె తన ప్రసంగాన్ని ముగించారు. భారత దేశ చరిత్రలో అతి తక్కువ సమయంలో బడ్జెట్ ప్రసంగాన్ని ముగించిన మంత్రిగా హీరూభాయ్ పటేల్ అరుదైన గుర్తింపును సొంతం చేసుకున్నారు. 1977లో మధ్యంతర బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ఆయన తన ప్రసంగాన్ని 800 పదాలతోనే ముగించారు. 1999 వరకూ భారత బడ్జెట్‌ను ఫిబ్రవరి చివరి రోజున సాయంత్రం 5 గంటల సమయంలో ఆర్థిక మంత్రులు ప్రవేశపెట్టేవారు. బ్రిటిష్ కాలమానానికి అనుగుణంగా ఇలా చేసేవారు. అయితే, ఈ ఆనవాయితీకి స్వస్తి చెప్పిన అప్పటి ఆర్థికమంత్రి యశ్వంత్ సిన్హా బడ్జెట్ ప్రవేశపెట్టే సమయాన్ని ఉదయం 11.00 గంటలకు మార్చారు. ఇక 2017లో ప్రభుత్వం బడ్జెట్ తేదీని ఫిబ్రవరి నెల చివరి నుంచి ఒకటవ తారీఖుకు మార్చింది. మార్చ్ నెలాఖరు నాటికి పార్లమెంటు ఆమోదం పొందేందుకు వీలుగా ఈ మార్పు చేసింది.

## ఈ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం.. వ్యూహాత్మక ముందడుగు

భారత్, యూరోపియన్ యూనియన్ నడుమ కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం అన్ని విధాలా ఘనం.. ఉభయ తారకం. మన ప్రధాని వర్ణించినట్టు ఇది అన్ని ఒప్పందాలకు తల్లి లాంటిదే.. అంతకు మించి ఇరువురికి అత్యవసరమైనది. రెండు దశా బ్దాలుగా పడి ఉన్న ప్రతిపాదన నేడు కార్యరూపం దాల్చడంలో ఇరు వైపులా జరిగిన కృషి అభినందనీయం..

### ఈ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం.. వ్యూహాత్మక ముందడుగు

భారత్, యూరోపియన్ యూనియన్ నడుమ కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం అన్ని విధాలా ఘనం.. ఉభయ తారకం. మన ప్రధాని వర్ణించినట్టు ఇది అన్ని ఒప్పందాలకు తల్లి లాంటిదే.. అంతకు మించి ఇరువురికి అత్యవసరమైనది. రెండు దశా బ్దాలుగా పడి ఉన్న ప్రతిపాదన నేడు కార్యరూపం దాల్చడంలో ఇరు వైపులా జరిగిన కృషి అభినందనీయం.. అమెరికా మిత్ర, శత్రు బేధం చూపించకుండా అందరినీ తన సుంకాల పెంపు తర్జన చూపించిన నేపథ్యంలో ప్రపంచ వాణిజ్యం కుదుపుకి లోనైంది. అందుకు భారత్ గానీ యూరోప్ గానీ మినహాయింపు కాదు.. ఈ స్థితిలో మూలపడి ఉన్న ద్వైపాక్షిక ఒప్పందాలకు బూజు దులిపి క్రియాశీలకం చెయ్యడం అవసరంగా మారింది. నేడు తుది రూపుతో ఖరారైంది. 27 దేశాల యూరోప్ సమాఖ్య భారత్ ఎగుమతులకు మంచి మార్కెట్‌ని చూపెడుతోంది. అలాగే మన దేశానికి అవసరమైన వస్తు సేవల్ని చవకగా అందిస్తుంది. ప్రపంచ జీడీపీలో 25 శాతం కలిగిన ఈ రెండు భాగస్వాములూ తమ తమ సుంకాల్ని దశలవారీగా దాదాపు ఎత్తివేయడం వల్ల లాభం పొందుతాయి.. ఎక్కువ పరిమాణంలో వాణిజ్యం జరిగి ఇతర దేశాలతో స్వేచ్ఛగా, ధైర్యంగా ఒప్పందాలు చేసుకోగల వీలు చిక్కుతుంది. ముఖ్యంగా అమెరికా ఆకస్మిక నిర్ణయాలకు, బెదిరింపులకు లొంగే అవసరం రాదు. తమ దేశీయ ఉత్పత్తిదారులు నష్టపోకుండా జాగ్రత్తలు గైకొని కుదుర్చుకున్న ఈ ఒప్పందం శీఘ్రంగా కార్యరూపం దాల్చాలి. ప్రస్తుతానికి యూరోప్ సమాఖ్య పార్లమెంట్‌లో ఇది ఆమోదం



పొందాల్సి ఉంటుంది. అలాగే మన పార్లమెంట్‌లో కూడా ఆమోదించవలసి ఉంది. ఈ ఏడాది చివరికల్లా ఆమోదాలు పూర్తయ్యి రెండు దేశాల మధ్య స్వేచ్ఛా వాణిజ్యం పూర్తి కార్యరూపం దాల్చి, అందివ స్తుందని ఆశిద్దాం.

# సంపాదకీయం

## మహాత్ముడివి మూడు బాధలు!

సత్యమే దేవుడని నమ్మిన మహామనిషి మోహన్‌దాస్ కరమ్‌చంద్ గాంధీ. మన దేశపు భిన్నత్వంలోని ఏకత్వాన్ని మనసా వాచా కర్మణా నమ్మి ప్రజల మధ్య వైషమ్యాలు లేని సమైక్య భారతావనిని కలగన్న దార్శనికుడు. ఆయన సంప్రదాయవాది కాదు, అదే సమయంలో అభ్యుదయవాదీ కాదు. కేవలం ఇంగిత జ్ఞానంతో పనిచేసిన ఒక ఆదర్శవాది. గాంధీని జీవితాంతం బాధించిన విషయాలు ప్రధానంగా మూడు ఉన్నాయి. ఒకటి, హిందూ ముస్లిం ఐక్యత లేకపోవడం. రెండు, దళితులు అభ్యున్నతి పొందకపోవడం. మూడవది, దరిద్ర నారాయణుల్ని పేదరికం నుంచి బయట పడవేయలేకపోవడం. గాంధీ రచనలన్నిటా ఈ విషయాలే కీలకంగా ఉంటాయి. "నేను నమ్మే సిద్ధాంతాలు, ఆదర్శాలు వ్యాప్తిలో ఉన్నంత కాలం, మరణానంతరం సైతం జీవించే వుంటాను" అని చెప్పారాయన. 20వ శతాబ్ది రాజకీయ నాయకుల్లో అత్యధికంగా మానవాళిని ప్రభావితం చేసిన నాయకుడు గాంధీ. సత్యం, అహింస, సత్యాగ్రహం అనే విలువలతో ప్రపంచవ్యాప్తంగా నైతిక రాజకీయానికి మార్గదర్శిగా నిలిచాడాయన. దేశ స్వాతంత్ర్యం సిద్ధించి ఏడున్నర దశాబ్దాలు గడిచాక నేడు, గాంధీని హత్య చేసిన గాడ్సేను కీర్తిస్తూ కొందరు చేస్తున్న వ్యాఖ్యలు భారతజాతి నైతికత మీద దాడి చేయడమే. అన్ని జాతులు, మతాలు కలగలిసి సమైక్యంగా జీవించాలనే ఆకాంక్ష కోసం ఆయన చెల్లించిన మూల్యం ప్రాణం. ప్రజాస్వామ్యంలో హింసను, హత్య చేసిన వారిని కీర్తించడం అంటే ప్రజాస్వామ్య స్ఫూర్తిని దెబ్బతీయడమే. దేశానికి గాంధీ లేకున్నా స్వాతంత్ర్యం వచ్చేదేమో కానీ, గాంధీ ఐడియాలజీ లేకుండా దేశం ఇంతటి ప్రశాంతతను పొందేది కాదు. మార్టిన్ లూథర్‌కింగ్ అమెరికాలో నల్ల జాతీయులకు హక్కులు సాధించినా, నెల్సన్ మండేలా దక్షిణాఫ్రికాకు స్వాతంత్ర్యం తెచ్చినా... మహాత్ముడి అహింసా మార్గమే వారికి ఆదర్శం. గాంధీ సత్యాగ్రహం అంటే తనను తాను ఆత్మపరిశీలన, ఆత్మ పరివర్తన చేసుకోవడం. మనిషిలో హింస, కోపం, అహంకారం, ద్వేషం ఉన్నప్పుడు ఇతరులకు మార్గదర్శిగా నిలవడం నైతికంగా సరైంది కాదని ఆయన నమ్మారు. ఇదే గాంధీ సత్యాగ్రహానికి పునాది. తనతో తాను నిజాయితీగా ఉండకపోతే, సత్యం కోసం సమాజంతో పోరాడే నైతిక హక్కు ఉండదని నమ్మారు. చౌరీచౌరా సంఘటనలో హింస జరిగిందని, తాను నైతికంగా సమాజాన్ని అహింస వైపు నడిపించడంలో విఫలమయ్యానని భావించి ఉద్యమాన్ని ఆపేశారు. ఇది గాంధీలోని ఆత్మపరిశీలనకు ఒక గొప్ప తార్కాణం. అలాగే గాంధీ దృష్టిలో ధర్మం అంటే సత్యం, అహింస, నైతికతపై ఆధారపడిన జీవన విధానం. ధర్మం వ్యక్తిగత, సామాజిక రాజకీయ రంగాలన్నిటిలోనూ నైతిక బాధ్యతను సూచిస్తుంది. వ్యక్తికీ వ్యక్తికీ, వ్యక్తికీ సమాజానికీ, సమూహానికీ సమూహానికీ మధ్య సంబంధాలను నిర్వచించే విలువగా ధర్మాన్ని ప్రస్తావించారు. గాంధీ దృష్టిలో సన్యాసి అంటే అంతర్ముఖ నైతికత, సామాజిక బాధ్యత, బాహ్యాజీవన రీతిగా ఆచరించేవారు; ముఖ్యంగా బలహీనుల పక్షాన నిలబడే ఆధునిక వేదాంతి; సమాజం నుంచి పారిపోయేవారు కాదు, ఒక నైతిక పోరాట యోధుడు. స్వదేశీ గురించి విస్తృతంగా ప్రచారం చేసిన గాంధీ... కేవలం దేశీయ వస్తువుల వాడకం, విదేశీ వస్తువుల బహిష్కరణ మాత్రమే కాదు. దానిని ఒక సామాజిక, ఆర్థిక కార్యక్రమంగా ముందుకు నడిపారు. ఖద్దరు ఉత్పత్తి, సత్యాగ్రహం, రైతు ఉద్యమాలు, దేవాలయ ప్రవేశాలు ఇవన్నీ కూడా ప్రజలను కుల, మత రహితంగా ఐక్యం చేయడానికి ఉద్దేశించిన కార్యాచరణలు. తోటి మానవుల పట్ల ప్రేమ, దయ, గుణాలతో వ్యవహరించడం, మానవసేవే మాధవ సేవగా ఆచరించడం... గాంధీ దృష్టిలో సనాతనం. గాంధీ సనాతనవాదం ఏ విషయాలపైనా మొండిగా వ్యవహరించదు. వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా ఆధ్యాత్మిక మార్గాన్ని చూపుతుంది. "నా హిందూయిజం ఎవరినీ వెలివేయదు. అన్ని తరగతులను కలుపుకుపోయే సమగ్రతా సిద్ధాంతం" అంటారు గాంధీ. అస్పృశ్యతకు వ్యతిరేకంగా గాంధీ పెద్ద యుద్ధం చేశారు. హిందూ శాస్త్రాల భావం సమానత్వాన్ని ప్రసాదించేదే తప్ప అస్పృశ్యతను ప్రోది చేసేది కాదని పలు సందర్భాల్లో అన్నారు. 'హరిజన' పేరుతో ఒక పత్రికను స్థాపించి, అహింసా సిద్ధాంతానికి అస్పృశ్యత విరుద్ధమని చాటారు. సాటి మనిషిని తక్కువగా, అవమానకరంగా చూడడం భగవద్గీత సందేశానికి కూడా వ్యతిరేకమని హిందూ సమాజాన్ని హెచ్చరించారు. హిందూ మతంలో అంతర్గత సంస్కరణల కోసం పోరాటం చేసిన చిట్టచివరి నాయకుడు మహాత్మాగాంధీ. సత్యమే దేవుడని నమ్మిన ఆయన దైవాన్వేషణలో ఎవ్వరూ మతం మారాల్సిన అవసరం లేదని చెప్పారు. గాంధీ లేకుండా స్వాతంత్ర్యోద్యమాన్ని, అంబేడ్కర్ లేకుండా భారత రాజ్యాంగాన్ని, నెహ్రూ లేకుండా ఆధునిక భారతాన్ని ఊహించలేం. వీరి ఆలోచనలు, ఆచరణ భారతీయ మూలాల నుంచి ఉద్భవించాయి. ఇటీవల మహాత్ముడిని తక్కువ చేస్తూ వస్తున్న పెడధోరణులు గాంధీ వ్యక్తిత్వ హననానికి చేస్తున్న ప్రయత్నాలు. పౌర సమాజం ఈ పోకడలను గుర్తించి, ప్రజలను వాస్తవికత వైపు నడిపించాల్సిన ఆవశ్యకత ఉంది.

## జల వివాదాలు కొలిక్కి వస్తాయా

తెలుగు రాష్ట్రాల మధ్య జల వివాదాల పరిష్కారానికి కేంద్రం నియమించిన కమిటీ శుక్రవారం ఢిల్లీలో సమావేశం కానుంది. కేంద్ర జలసంఘం ఛైర్మన్ నేతృత్వంలోని ఈ కమిటీలో రెండు రాష్ట్రాల నీటిపారుదలశాఖ అధికారులు సభ్యులుగా ఉన్నారు. ట్రైబ్యునల్, కృష్ణా, గోదావరి బోర్డులు, అపెక్స్ కౌన్సిల్ తేల్చాల్సిన అంశాలను ఈ కమిటీ పరిష్కరించగలదా అన్నది ప్రశ్న. అయితే జల వివాదాల పరిష్కారంలో ఇదొక ముందడుగుగానే చెప్పాలి. కీలక అంశాలను కమిటీ ఓ కొలిక్కి తేగలిగితే- కేంద్ర జల్‌శక్తి మంత్రి ఛైర్మన్‌గా, ఇద్దరు సీఎంలు సభ్యులుగా గల అపెక్స్ కౌన్సిల్ తుది నిర్ణయాలు తీసుకోగలదు. కృష్ణా జలాల్లో రెండు రాష్ట్రాల వాటాను తేల్చే అంశంపై బ్రిజేష్‌కుమార్ ట్రైబ్యునల్ ఎదుట వాదనలు జరుగుతున్నాయి. బచావత్ ట్రైబ్యునల్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు 811 టీఎంసీలు కేటాయించింది. ఇందులో తెలంగాణ, ఏపీలకు ఎవరి వాటా ఎంతన్నది మొదట తేల్చాలి. పునర్విభజన తరవాత ఏపీ 512 టీఎంసీలు, తెలంగాణ 299 టీఎంసీలు వాడుకునేలా 2015లో తాత్కాలిక అవగాహన కుదిరింది. అదిప్పటికీ కొనసాగుతోంది. 512 టీఎంసీలు తమకు నిర్ధారించాలని ఏపీ కోరుతోంది. తెలంగాణ మాత్రం కృష్ణాబేసిన్‌లోని ప్రాజెక్టులకు ప్రాధాన్యమిచ్చి 555 టీఎంసీలు కావాలని కోరింది. ఈ విషయంలో రెండు రాష్ట్రాల మధ్య చర్చల ద్వారా అవగాహనకు వచ్చే అవకాశాలు దాదాపు లేవనే చెప్పాలి. కృష్ణా డెల్టాకు బచావత్ చేసిన కేటాయింపుల మేరకు నీటి విడుదల అవసరం లేదని, శ్రీశైలం నుంచి పెన్నా బేసిన్‌కు నీటిని మళ్లించకుండా కృష్ణా బేసిన్‌లోని అవసరాలకే కేటాయించాలని తెలంగాణ వాదించింది. ఆ వాదనకు ట్రైబ్యునల్ అంగీకరిస్తే ఏపీ ప్రస్తుతం వాడుకుంటున్న 512 టీఎంసీలలో కొంత తగ్గించి తెలంగాణకు కేటాయించవచ్చు. లేదా ఇంకోరకమైన తీర్పు చెప్పొచ్చు. ఇది ట్రైబ్యునల్ దగ్గర తేలాలి తప్ప కేంద్ర జల్‌శక్తి కమిటీ దగ్గర కాదు. 811 టీఎంసీలలో ఎవరివాటా ఎంతన్నది తేల్చాల్సింది ట్రైబ్యునలే. ప్రస్తుత కమిటీ ఆ అంశం జోలికి వెళ్లే అవకాశం కూడా లేదు.

### ఇచ్చిపుచ్చుకునే వాతావరణం ఉంటే...

పోలవరం నిర్మాణం ద్వారా గోదావరి నుంచి కృష్ణాబేసిన్‌లోకి మళ్లించే నీటిలో వాటా రెండో అంశం. పోలవరంతో 80 టీఎంసీల నీటిని కృష్ణా బేసిన్‌లోకి మళ్లిస్తే, ఆ మేరకు నాగార్జునసాగర్ నుంచి నీటి విడుదలను నియంత్రించి కర్ణాటక, మహారాష్ట్ర కలిపి 35 టీఎంసీలు, నాగార్జునసాగర్ ఎగువన ప్రాజెక్టులకు 45 టీఎంసీలు ఏపీ వాడుకునేలా గోదావరి జల వివాదాల ట్రైబ్యునల్ అవార్డు పేర్కొంది. ముఖ్యమంత్రుల మధ్య జరిగిన ఒప్పందమే అవార్డులో భాగమైంది. పునర్విభజన తరవాత 45 టీఎంసీలు తమకే చెందుతాయని తెలంగాణ పేర్కొంది. నాగార్జునసాగర్ ఎగువన వాడుకోవాలని గోదావరి అవార్డు పేర్కొందని, కృష్ణాబేసిన్‌లో సాగర్ ఎగువన ఉన్నది తెలంగాణ ప్రాజెక్టులే కాబట్టి తమకే చెందుతాయని వాదిస్తోంది. ఈ వాదనతో ఏపీ అంగీకరించలేదు. కృష్ణా నదీ యాజమాన్య బోర్డులో, కేంద్ర జల్‌శక్తి దగ్గర పలు దఫాలు చర్చలు జరిగినా ఫలితం లేకపోయింది. సీడబ్ల్యూసీ మాజీ ఛైర్మన్ బజాజ్ నేతృత్వంలో ఈ అంశాన్ని తేల్చేందుకు కేంద్రం కమిటీని ఏర్పాటు చేసింది. అయితే, నీటి కేటాయింపులు, పంపిణీని తేల్చాల్సింది ట్రైబ్యునలేనని ఏపీ గట్టిగా వాదించడంతో బజాజ్ కమిటీ ఎలాంటి సిఫార్సు చేయలేదు. తరవాత ఈ అంశాన్ని కేంద్రం బ్రిజేష్ ట్రైబ్యునల్‌కే అప్పగించింది. ఈ 45 టీఎంసీలను పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలకు కేటాయిస్తూ 2022లో తెలంగాణ ప్రభుత్వం జీవో జారీ చేసింది. కానీ దీనికి సీడబ్ల్యూసీ ఆమోదం, ఏపీ అంగీకారం లేకపోగా, ట్రైబ్యునల్ తేల్చాల్సి ఉంది. ఈ విషయంలో ప్రస్తుతం ఏర్పాటు చేసిన కమిటీలో కొంత చర్చ జరిగి సానుకూలత ఏర్పడిన తరవాత ఇద్దరు సీఎంల మధ్య ఓ అంగీకారానికి అవకాశం ఉంది.



1982లోనే శ్రీశైలం ఎడమగట్టు కాలువకు ఇందులో 30 టీఎంసీలను ప్రతిపాదించారు. పోలవరానికి ఇంకా అనుమతి రాలేదు కాబట్టి వచ్చిన తరవాత ఈ ప్రతిపాదన చేయాలని సీడబ్ల్యూసీ అప్పట్లో వెనక్కి పంపింది. మొదటి నుంచి తెలంగాణలోని ప్రాజెక్టులకే ఈ నీటిని కేటాయించాలనే ప్రతిపాదన ఉంది కాబట్టి పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతలకు వాడుకోవడానికి ఏపీ అంగీకరిస్తే రెండు రాష్ట్రాల మధ్య జలాల వినియోగానికి సానుకూలత ఏర్పడుతుంది. ట్రైబ్యునల్ కేటాయిస్తే ఒక రాష్ట్రానికి కొంత ఎక్కువ, ఇంకొకరికి తక్కువ రావొచ్చు, సమానంగానైనా రావచ్చు. కానీ సీఎంలే ఓ అంగీకారానికి రాగలిగితే ప్రాజెక్టును పూర్తి చేసే అవకాశం ఏర్పడుతుంది. తెలుగు రాష్ట్రాల నడుమ ఇచ్చిపుచ్చుకునే వాతావరణానికి వీలు ఉంటుంది. బ్రిజేష్‌కుమార్ ట్రైబ్యునల్ 2013లో ఇచ్చిన తీర్పులోని కేటాయింపులు మూడో అంశం. బచావత్ ట్రైబ్యునల్ 75 శాతం నీటి లభ్యత ఆధారంగా ఉమ్మడి ఏపీకి 811 టీఎంసీలు కేటాయిస్తే, 2013లో బ్రిజేష్‌కుమార్ ట్రైబ్యునల్ ఇచ్చిన మరో 194 టీఎంసీలు కలిపితే 1005 టీఎంసీలైంది. తెలుగు రాష్ట్రాలకు ఇది సానుకూల తీర్పుకాదు. అందుకే ఉమ్మడి ఏపీ సుప్రీంకోర్టులో స్టే తెచ్చింది. దీనిపై ఏదో ఒకరోజు నిర్ణయం వచ్చే అవకాశం ఉంది. ఉమ్మడి ఏపీకి 194 టీఎంసీలు అదనంగా ఇచ్చిన బ్రిజేష్ ట్రైబ్యునల్, ఎగువన ఉన్న మహారాష్ట్ర, కర్ణాటకలకు కలిపి 2 4 టీఎంసీలు ఎక్కువగా కేటాయించింది. ఆలమట్టి ఎత్తు పెంచుకోవడానికీ అవకాశం ఇచ్చింది. అదనపు నీటి మాటేమోగానీ, కొన్నేళ్లలో బచావత్ కేటాయింపులు పొందడం కూడా సాధ్యం కాదు. దిగువన ఏపీకి 75 శాతం నీటి లభ్యతలో సమస్య రాకుండా చూసేందుకు 2130 టీఎంసీలకు మించి వచ్చినప్పుడు క్యారీ ఓవర్ స్టోరేజీ కింద శ్రీశైలం, సాగర్‌లలో నిల్వ చేసుకుని వాడుకోవడానికి అవకాశం ఇస్తే, బ్రిజేష్ ట్రైబ్యునల్ తీర్పు వల్ల 2400 టీఎంసీలకు మించి వస్తేతప్ప నిల్వ చేసుకోవడానికి వీలులేని పరిస్థితి ఏర్పడింది. ఇందులో కూడా బ్రిజేష్ ట్రైబ్యునల్ అన్యాయం చేసింది. అయితే దీంతో సంబంధం లేకుండా అదనంగా ఇచ్చిన నీటి వినియోగం తెలుగు రాష్ట్రాల మధ్య ఎలాగన్నదే ప్రశ్న. ఇందులో తెలుగుగంగకు 25 టీఎంసీలు, కర్నూలు జిల్లాలోని ఆర్డీఎస్ కుడికాలువకు నాలుగు టీఎంసీలు, జూరాలకు 9 టీఎంసీలు కేటాయించారు. ప్రస్తుతం రెండు రాష్ట్రాల మధ్య వాదనలు వింటున్న బ్రిజేష్ ట్రైబ్యునలే గతంలో ఈ తీర్పు ఇచ్చినందువల్ల తెలుగుగంగ, ఆర్డీఎస్ కుడికాలువ, జూరాలకు చేసిన కేటాయింపుల్లో మార్పులు చేసే అవకాశాలు తక్కువే. క్యారీ ఓవర్‌కు ఉన్న కేటాయింపుల్లో ఎవరెంత వాడుకోవాలన్నది తేల్చాలి. దీనిపై కూడా ప్రస్తుతం ఏర్పాటు చేసిన కమిటీ అధ్యయనం చేసి సంప్రదింపులతో ఒక అవగాహనకు వచ్చే అవకాశం ఉంది. ఇక్కడ అంగీకారానికి వచ్చి అపెక్స్ కౌన్సిల్ ఆమోదం పొందితే తెలుగు రాష్ట్రాలకు ఉపయుక్తం. బ్రిజేష్ ట్రైబ్యునల్ తీర్పు అమలులో లేదనుకున్నా బచావత్‌లోనూ క్యారీ ఓవర్ ఉండటంతో తెలుగు రాష్ట్రాలు చర్చలతో అంగీకారానికి రావడానికి ఇబ్బందేమీ లేదు.

### అంగీకారానికి వస్తే మేలు

గోదావరిలో ఉమ్మడి ఏపీకి 1,430 టీఎంసీల లభ్యత ఉంది. పునర్విభజనకు ముందు అప్పటి ప్రభుత్వం గోదావరిలో 958 టీఎంసీలు తెలంగాణకు, మిగిలినవి ఏపీకి వాటా ఉన్నట్లు శాసనసభలో పేర్కొంది. పునర్విభజన తరవాత ఏపీ దీనికి అంగీకరించలేదు. తెలంగాణకు 700 టీఎంసీలలోపే ఉన్నట్లు పేర్కొంది. కొత్త ట్రైబ్యునల్ ఏర్పాటుకు మొగ్గు చూపింది. కృష్ణా జలాలపై బ్రిజేష్‌కుమార్ ట్రైబ్యునల్ ఏర్పాటై రెండు దశాబ్దాలు దాటినా తీర్పు అమల్లోకి రాలేదు. పునర్విభజన తరవాత కాళేశ్వరం, కంతనపల్లి, సీతారామ ఎత్తిపోతల, సీతమ్మసాగర్‌లకు కేంద్రం అనుమతులిచ్చింది. ఇందులో కాళేశ్వరం మినహా మిగిలిన ప్రాజెక్టులు ఉమ్మడి ఏపీలో చేపట్టినవే. వీటన్నిటి కేటాయింపులను పరిగణనలోకి తీసుకుని గోదావరిలో తుది వాటాపై రెండు రాష్ట్రాలు ఓ అంగీకారానికి రావాల్సి ఉంది. అపెక్స్ కౌన్సిల్‌కు కేంద్రం కొత్తగా ఏర్పాటు చేసిన కమిటీ పునాదిని సిద్ధం చేయాలి. దీంతోపాటు మిగులు జలాలు ఎంత ఉన్నాయి, ఏయే నెలల్లో ఉన్నాయి, ఏ సబ్ బేసిన్ నుంచి ఉన్నాయన్న వివరాలతో ఓ అవగాహనకు వచ్చి వాడుకోవడానికి రెండు రాష్ట్రాలూ కార్యాచరణకు సిద్ధం కావాలి. ముందుగా నికర జలాలపై ఓ అంగీకారానికి వస్తే, మిగులు జలాలపై అవగాహన తేలికవుతుంది. ఈ దిశగా చర్చలు సాగితేనే ఫలితం ఉంటుంది.

## కేసీఆర్‌పై కుట్ర.. ప్రజాస్వామ్యంపై దాడి

తెలంగాణ రాష్ట్ర సాధన అనేది ఒక ఆవేశపూరిత, ఉద్వేగపూరిత రాజకీయ సంఘటన కాదు. అది ఒక దీర్ఘకాలిక నైతిక ప్రజా ఉద్యమ ఫలితం. ఆ ఉద్యమానికి ప్రాణం పోసి, ప్రజల ఆకాంక్షలను తన భుజస్కంధాలపై మోసి, అనేక త్యాగాలతో రాష్ట్రాన్ని సాధించిన నాయకుడు కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రజాస్వామ్య పద్ధతిలో జరిగిన తొలి ఎన్నికల్లో ప్రజలు కేసీఆర్‌ను తమ మొదటి ముఖ్యమంత్రిగా ఎన్నుకున్నారు. అది కేవలం ఒక అసాధారణ వ్యక్తికి కృతజ్ఞతాపూర్వకంగా, విశ్వాసంతో అప్పగించిన బాధ్యత. ఒక ఉద్యమానికి, ఒక ఆశయానికి తెలంగాణ ప్రజలు ఇచ్చిన గౌరవం. కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం వ్యవసాయం, సాగునీరు, విద్యుత్తు, పరిశ్రమలు, సంక్షేమం, మౌలిక వసతులు వంటి రంగాల్లో దేశానికే మార్గదర్శకంగా నిలిచింది. కాళేశ్వరం ప్రాజెక్ట్ ద్వారా కోట్ల ఎకరాలకు సాగునీరు అందించడం, రైతుబంధు ద్వారా రైతును గౌరవించడం, 24 గంటల ఉచిత విద్యుత్తు ద్వారా వ్యవసాయాన్ని బలోపేతం చేయడం, మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ తాగునీరు అందించడం దేశవ్యాప్తంగా చర్చకు వచ్చిన వాస్తవాలు. బీఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో తెలంగాణ అభివృద్ధిని చూసి అనేక రాష్ట్రాలు నివ్వెరపోయిన పరిస్థితి. తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధిని అధిగమించలేక, ఓర్వలేక కొన్ని జాతీయ పార్టీలు కక్షగట్టి చీకటి ఒప్పందాలతో ఒక్కటయ్యాయి. ప్రగతిని పరుగెట్టించి చరిత్రను సృష్టించిన కేసీఆర్ స్థానంలో, అబద్ధాల పునాదులపై, హామీల మోసాలపై అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు కక్షపూరిత రాజకీయాలకు పరాకాష్టగా మారింది. పాలనలో వైఫల్యాలు, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో అసమర్థత, ప్రజాసమస్యలపై దృష్టిలేమి ఇవన్నీ ప్రజల ముందు బయటపడుతున్నాయి. దీంతో ప్రజల దృష్టి మళ్లించేందుకు బీఆర్ఎస్‌ను, కేసీఆర్‌ను లక్ష్యంగా చేసుకుని నీతిమాలిన భాషతో బూతులు మాట్లాడటం రేవంత్‌రెడ్డికి అలవాటుగా మారింది. కమిటీలు, కమిషన్ల పేరుతో రాజకీయ వేధింపులు జరుగుతున్నాయి. ఇందులో భాగంగానే కేసీఆర్ మంత్రి వర్గంలో కీలకంగా పనిచేసిన కేటీఆర్, హరీశ్‌రావు, పార్టీ ప్రధాన కార్యదర్శి సంతోష్‌కుమార్‌కు సిట్ నోటీసులు జారీ చేసి విచారించింది. ఇప్పుడు కేసీఆర్‌కు కూడా నోటీసులు జారీ చేయడం రాజకీయ ప్రతీకారానికి నిదర్శనం కాక మరేమిటి? ప్రజల దృష్టి మళ్లించేందుకే సిట్ రాజకీయాలు ఈ చర్యలన్నింటి వెనుక ఒకే లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. తమ ప్రభుత్వ వైఫల్యాలపై, అవినీతి ఆరోపణలపై, ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజల దృష్టి నిలవకుండా చేయడం. ప్రజల పక్షాన గట్టిగా ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష బీఆర్ఎస్‌ను బలహీనపర్చడం. కేసీఆర్ ఇమేజ్‌ను దెబ్బతీయడం ద్వారా రాజకీయ లబ్ధి పొందాలని భావించడం. ఇక్కడ గమనించాల్సిన ముఖ్యమైన విషయం ఏమిటంటే ఎన్నికలకు ముందు స్వయంగా తన కుటుంబ సభ్యుల ఫోన్లు ట్యాప్ చేశారని, తన వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగించారని రేవంత్‌రెడ్డి పదేపదే ఆరోపించారు. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత, 'నిజంగా ఫోన్ ట్యాపింగ్ జరిగి ఉంటే నన్ను సిట్ విచారణకు పిలిచేవారు కదా; నన్ను పిలవలేదు అంటే ట్యాపింగ్ జరగలేదని అర్థం' అని స్వయంగా వ్యాఖ్యానించడం ఆయన రాజకీయ ద్వంద్వ వైఖరిని బట్టబయలు చేస్తున్నది. అభివృద్ధిని ప్రశ్నించలేక, వ్యక్తిత్వ హననం: కేసీఆర్ పాలనలో జరిగిన అభివృద్ధి ప్రజల కండ్ల ముందు స్పష్టంగా కనిపిస్తున్నది. దానిని తార్కికంగా ప్రశ్నించలేని పరిస్థితిలో, వ్యక్తిగతంగా ద్వేషాన్ని పెంచుకుని, తప్పుడు



ప్రచారాలు, దూషణలు, అనవసర ఆరోపణలు చేయడం నేటి పాలకుల ఆయుధంగా మారింది. కేసీఆర్ చేసిన అభివృద్ధిని తమ పాలనలో పునరావృతం చేయలేని నాయకులకు, పార్టీలకు కేసీఆర్ ఒక కంటగింపుగా మారారు. ఈ దుష్ప్రచారాల వెనుక కొంతమంది ఆంధ్రప్రదేశ్ రాజకీయ శక్తుల హస్తం ఉందనే అభిప్రాయం ప్రజల్లో బలంగా ఉంది. తెలంగాణ అస్తిత్వాన్ని, స్వతంత్రతను జీర్ణించుకోలేని శక్తులు, ఇక్కడి రాజకీయాలను ప్రభావితం చేయాలని ప్రయత్నిస్తున్నాయనే అనుమానం నిరాధారమైనది కాదు. దేశ రాజకీయాల్లో తెలంగాణ స్థానం పడిపోయిందా?: రెండేండ్లుగా తెలంగాణ పాలన ఏ విధంగా అథోగతి పాలవుతున్నదో ప్రజలు ప్రత్యక్షంగా చూస్తున్నారు. ఒకప్పుడు దేశ రాజధానిలో తెలంగాణ మాడల్‌పై చర్చ జరిగితే, ఇప్పుడు తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న అవినీతి గురించి మాత్రమే చర్చ జరుగుతున్నది తప్ప అభివృద్ధి గురించి ఎలాంటి చర్చ లేకపోవడం కాంగ్రెస్ పాలన ఎంత వేగంగా దిగజారిందో తెలియజేస్తున్నది. ఇది సీఎంగా రేవంత్‌రెడ్డి వ్యక్తిగత వైఫల్యం మాత్రమే కాదు రాష్ట్రానికి జరిగిన, జరుగుతున్న తీరని నష్టం. కేసీఆర్‌పై జరుగుతున్న ఈ రాజకీయ వేధింపులు కేవలం ఒక వ్యక్తిపై దాడి కాదు. అది తెలంగాణ ప్రజాస్వామ్యంపై, ప్రజల తీర్పుపై, రాష్ట్ర అస్తిత్వంపై జరుగుతున్న దాడి. అభివృద్ధిని అడ్డుకోలేక, ప్రజల ప్రశ్నలకు సమాధానం చెప్పలేక, రాజకీయ కక్షతో విచారణలు, నోటీసులు జారీ చేయడం చరిత్రలో ఎప్పుడూ నిలబడదు. తెలంగాణ ప్రజలు ఉద్యమ చైతన్యంతో ఉన్నారు. వారు నిజాన్ని, అబద్ధాన్ని వేరుచేసే శక్తి కలిగినవారు. కాలమే ఈ కక్షపూరిత రాజకీయాలకు సరైన సమాధానం ఇస్తుంది. కేసీఆర్‌కు జారీ చేసిన సిట్ నోటీసులు, వాటికి గల చట్టబద్ధత, బాధ్యతా సూత్రాల ఉల్లంఘన, రాజకీయ దుర్వినియోగాన్ని బట్టబయలు చేస్తుంది. కేసీఆర్‌కు సిట్ ద్వారా జారీ చేసిన నోటీసులు, భారత క్రిమినల్ న్యాయ వ్యవస్థలోని మౌలిక సూత్రాలపై, ముఖ్యంగా క్రిమినల్ బాధ్యత, కార్యనిర్వాహక అధికార పరిధి, రాజకీయ బాధ్యత వ్యక్తిగత బాధ్యతల మధ్య తేడాలపై కీలకమైన చర్చను ప్రారంభించాయి. ఈ నోటీసులు కేవలం ఒక వ్యక్తిని విచారణకు పిలిచిన ప్రక్రియగా మాత్రమే చూడాలా, లేక రాజకీయ ప్రతీకారానికి చట్టాన్ని ఉపయోగించడానికి ఉదాహరణగా అర్థం చేసుకోవాలా అన్నది చట్టపరంగా విశ్లేషించాల్సిన అంశం. సిట్ నోటీసుల చట్టపరమైన స్వభావం: కేసీఆర్‌కు జారీ చేసిన నోటీసులు సెక్షన్ 160 సీఆర్‌పీసీ (ప్రస్తుతం భారతీయ న్యాయ సురక్ష సంహిత 2023 సెక్షన్ 179) కింద జారీ అయినవిగా తెలుస్తున్నది. సెక్షన్ 160 సీఆర్‌పీసీ/సెక్షన్ 179 బీఎన్ఎస్ఎస్ ఉద్దేశం.. నేరానికి సంబంధించిన సమాచారం తెలిసిన వ్యక్తిని విచారణకు పిలవడం. ఇది నిందితుడిగా గుర్తించడం కాదు. ఇది అరెస్ట్ నోటీసు కాదు. ఇది కేవలం సమాచార సేకరణ కోసం మాత్రమే. అందువల్ల, చట్టపరంగా కేసీఆర్‌ను నిందితుడిగా పేర్కొన్నట్టు ఈ నోటీసులు సూచించవు. అయినప్పటికీ, పత్రికలలో, ఎలక్ట్రానిక్ మీడియాలో, ప్రజావేదికలపై దీనిని నేరారోపణగా చిత్రీకరించడం ప్రక్రియాత్మక న్యాయానికి విరుద్ధమైన ప్రచారంగా పరిగణించాలి. ముఖ్యమంత్రి హోదా అధికారుల చర్యలకు బాధ్యత వహించాలా? ఈ వ్యవహారంలో అత్యంత కీలకమైన న్యాయ ప్రశ్న ఇది. ముఖ్యమంత్రి పదవిలో ఉన్న సమయంలో, అధికారులు తమ అధికారిక విధుల నిర్వహణలో భాగంగా చేసిన చర్యలకు, ముఖ్యమంత్రి వ్యక్తిగతంగా క్రిమినల్ బాధ్యత వహించాలని ఏ చట్టమూ చెప్పట్లేదు. రాజకీయ బాధ్యత వర్సెస్ క్రిమినల్ బాధ్యత: భారత రాజ్యాంగం ప్రకారం మంత్రివర్గం శాసనసభకు సామూహిక రాజకీయ బాధ్యత వహిస్తుంది. ఇది పాలసీ నిర్ణయాల పరంగా మాత్రమే. ఇది క్రిమినల్ బాధ్యతగా మారదు. రాజకీయ బాధ్యత అంటే.. విధానాలపై విమర్శలు, ఎన్నికల ద్వారా తీర్పు. క్రిమినల్ బాధ్యత అంటే.. వ్యక్తిగత పాత్ర, నేర ఉద్దేశం, ప్రత్యక్ష చర్య. ఈ రెండింటిని కలపడం రాజ్యాంగ ఆత్మకు విరుద్ధం. అధికారుల స్వతంత్ర హోదా, చట్టపరమైన స్థితి: ఐఏఎస్, ఐపీఎస్ తదితర అధికారులు ఆల్ ఇండియా స్వసెస్ రూల్స్ కింద పనిచేస్తారు. వారు తీసుకునే నిర్ణయాలు చట్టాల ప్రకారం, నిబంధనల ప్రకారం, ఫైల్ నోటింగ్స్, ప్రొసీజర్ల ఆధారంగా ఉండాలి. ఒక అధికారి చట్టవిరుద్ధంగా వ్యవహరించినట్టయితే సదరు అధికారిపై శాఖాపరమైన చర్య లేదా క్రిమినల్ చర్య తీసుకోవచ్చు. కానీ అధికారి పనిచేశాడు కాబట్టి, ముఖ్యమంత్రి బాధ్యుడు అనే సిద్ధాంతం క్రిమినల్ జ్యూరిస్ప్రుడెన్స్‌లో లేదు. పరోక్ష బాధ్యత క్రిమినల్ చట్టంలో వర్తిస్తుందా? భారత న్యాయస్థానాలు స్థిరంగా చెప్పిన సూత్రం.. సాధారణంగా క్రిమినల్ న్యాయంలో ఒకరు చేసిన నేరానికి మరొకరు బాధ్యత వహించాల్సిన అవసరం లేదు. కానీ చట్టం ప్రత్యేకంగా అలా చెప్పినప్పుడు మాత్రమే పరోక్ష బాధ్యత వర్తిస్తుంది. అంటే స్పష్టమైన చట్ట ప్రావధానం లేకుండా ఇతరుల చర్యలకు వ్యక్తిని నేరస్థుడిగా చేయలేం. ముఖ్యమంత్రిపై బాధ్యత విధించాలంటే

## భారత్‌కు తప్పని కర్బన పన్ను

భారత్-ఐరోపా సమాఖ్య(ఈయూ) మధ్య కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం(ఎఫ్‌టీఏ) వల్ల ఇరువైపులా సుంకాలు భారీగా తగ్గనున్నాయి. అయితే, ఈయూ కర్బన పన్ను(సీబీఏఎం) మాత్రం భారత్‌కు పంటి కింద రాయిలా మారవచ్చు. సీబీఏఎం విషయంలో ఇండియాకు ప్రత్యేక మినహాయింపు ఇచ్చే ఉద్దేశం లేదని ఈయూ ముఖ్య ప్రతినిధి పౌలా పీన్యో తాజాగా వ్యాఖ్యానించారు. రెండు రోజుల కిందట కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంలో భాగంగా ఇకపై ఈయూకు భారత్ ఎగుమతి చేసే 99.5శాతం వస్తువులపై సుంకం ఉండదు. కార్మికులను ఎక్కువగా ఉపయోగించి వస్తువులను తయారుచేసే పరిశ్రమలకు దీనివల్ల లబ్ధి కలుగుతుంది. ఉదాహరణకు ఈయూ దేశాలకు ఎగుమతి అయ్యే భారతీయ దుస్తులు, పాదరక్షలు, సముద్ర ఉత్పత్తులు, వజ్రాలు, ఆభరణాలు, హస్తకళా ఉత్పత్తులు, రసాయనాలు, యంత్రాలపై సుంకాలు భారీగా తగ్గుతాయి. దాదాపు 97శాతం ఈయూ ఎగుమతులపై తాను విధిస్తున్న సుంకాలను భారత్ వచ్చే 7-10 ఏళ్లలో దశల వారీగా తగ్గిస్తుంది. ప్రస్తుతం వైన్లపై విధిస్తున్న 150శాతం సుంకాలను 20-30శాతానికి, విస్కీ, వోడ్కా, బ్రాందీ వంటి మద్యాలపై సుంకాలను నలభై శాతానికి, బీర్లపై సుంకాలను 110 నుంచి యాభై శాతానికి తగ్గిస్తుంది. ఈయూ దేశాల నుంచి దిగుమతి అయ్యే కార్లపై ప్రస్తుతం విధిస్తున్న 100-125శాతం సుంకాలను పది శాతానికి కుదిస్తుంది. ఇది ఏడాదికి 2.50 లక్షల కార్ల దిగుమతిపై మాత్రమే వర్తిస్తుంది. గొర్రె మాంసం, పండ్ల రసాలు, బేకరీ వస్తువులు, పాస్తా, చాక్లెట్లు వంటి వాటిపై సుంకాలను తొలగిస్తుంది. ఈయూ నుంచి దిగుమతయ్యే శుద్ధి చేసిన ఆహారం, రసాయనాలు, యంత్రాలు, ఎలక్ట్రానిక్స్, విమానాలపై సుంకాలను క్రమంగా ఎత్తివేస్తుంది.

అపరిష్కృతంగా మిగిలిన సీబీఏఎం

సుంకాల సంగతి అటుంచితే ప్రభుత్వపరంగా వస్తుసేకరణ, మేధా హక్కులు, కార్మిక, పర్యావరణ, సుస్థిరాభివృద్ధికి సంబంధించిన అంశాలపై భారత్, ఈయూలు భిన్న వైఖరులను అవలంబించాయి. దీని ప్రభావం ఎలా ఉంటుందో నిలకడ మీద తెలుస్తుంది. అన్నింటికన్నా ముఖ్యంగా ఈయూ కర్బన సరిహద్దు సర్దుబాటు విధానం (సీబీఏఎం) గురించి పరిశీలించాలి. ఒక వస్తువు తయారీలో బొగ్గు, చమురు వంటి శిలాజ ఇంధనాలను వాడితే కర్బన ఉద్గారాలు పెరుగుతాయి. అలాంటి వస్తువుల దిగుమతిపై ఈ ఏడాది జనవరి ఒకటి నుంచి ఈయూ అధిక సుంకాలు విధిస్తోంది. భారత్-ఈయూ ఒప్పందంలో సీబీఏఎం గురించి ప్రస్తావించలేదు. ప్రస్తుతానికి ఉక్కు, అల్యూమినియం వంటి ఆరు భారతీయ ఉత్పత్తులపై ఈయూ అధిక సుంకాలు విధిస్తోంది. క్రమంగా ఇతర పారిశ్రామిక ఉత్పత్తులపై కూడా సీబీఏఎం కింద అధిక సుంకాలు మోపవచ్చు. ఫలితంగా ఈయూతో కుదుర్చుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కింద ఈ వస్తువులపై భారత్‌కు సుంకాల మినహాయింపు లభించదు. దీన్ని సరిదిద్దే ప్రయత్నమేదీ జరగడం లేదు. 2026లో భారత్-ఈయూ సహకార వేదిక ఏర్పాటు, హరిత ఇంధనాలకు ఇండియా మారడానికి 50కోట్ల యూరోల నిధిని అందించే ప్రతిపాదన వంటివి...

## గడిచిన ఏడాది కంటే ద్రవ్యోల్బణం పెరిగే అవకాశం



గడిచిన ఏడాది కంటే ద్రవ్యోల్బణం పెరిగే అవకాశం : ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గురువారం పార్లమెంట్‌లో ఆర్థికసర్వే ను ప్రవేశపెట్టారు. వచ్చే ఆర్థిక సంవత్సరం (2026-27) జీడీపీ వృద్ధిరేటు 6.8-7.2 గా అంచనా వేస్తూ.. గత ఏడాది కంటే ద్రవ్యోల్బణం పెరిగే అవకాశం ఉందని తెలిపారు. గడిచిన ఏడాది కంటే ద్రవ్యోల్బణం పెరిగే అవకాశం : ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గురువారం పార్లమెంట్‌లో ఆర్థికసర్వే ను ప్రవేశపెట్టారు. వచ్చే ఆర్థిక సంవత్సరం (2026-27) జీడీపీ వృద్ధిరేటు 6.8-7.2 గా అంచనా వేస్తూ.. గత ఏడాది కంటే ద్రవ్యోల్బణం ఎరిగే అవకాశం ఉందని తెలిపారు. భారత ఆర్థిక వ్యవస్థ ఖీ27లో సుమారు 6.8--7.2% వరకు పెరగనున్నట్లు ఆర్థిక సర్వేలో అంచనా వేశారు. దృఢమైన మాక్రో ఫండమెంటల్స్, సంస్కరణలు ఈ వృద్ధికి బలం ఇస్తున్నాయని పేర్కొన్నారు. ద్రవ్యోల్బణం మొత్తం మీద స్థిరంగా ఉండవచ్చునని, ముఖ్యంగా ఆహారం, ఇంధన ధరలు కంట్రోల్‌లోనే ఉంటాయని ఆర్థిక సర్వే అంచనా వేసింది. రాజకోశ లోటు తగ్గే దిశగా ఉందని, ఆర్థిక పరిమితికి కట్టుబడి ఉందని పేర్కొంది. తయారీ, సేవల రంగం, గిగ్ ఎకానమీ విభాగాల్లో ఉద్యోగ సృష్టి మెరుగుపడినట్లు సర్వే సూచిస్తున్నది. భారత్ యూరోపియన్ యూనియన్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం ) కుదిరిందని, దీనివల్ల ఎగుమతులు, పోటీతత్వం పెరగనున్నాయని మంత్రి నిర్మలా సీతారామన్ చెప్పారు. 'మేక్ ఇన్ ఇండియా 2.0' పై దృష్టి కేంద్రీకరించి.. ఎలక్ట్రానిక్స్, సెమీ కండక్టర్లు, పునరుత్పాదక శక్తి రంగాలకు ప్రత్యేక ప్రోత్సాహాలు అందిస్తున్నట్లు తెలిపారు.డిజిటల్ పేమెంట్లు, ఫిన్‌టెక్, వినియోగం వేగంగా పెరుగుతూ.. భారత్‌ను ప్రపంచస్థాయి టెక్ హబ్‌గా మలుస్తున్నాయని అన్నారు. సౌర, వాయు, హైడ్రజన్ వంటి గ్రీన్ ఎనర్జీపై దృష్టి సారించి.. స్థిరమైన వృద్ధికి అనుకూలంగా మద్దతు కొనసాగుతోందని చెప్పారు. కాగా ఫిబ్రవరి 1న పార్లమెంట్‌లో బడ్జెట్ ప్రవేశపెట్టనున్నారు.

## కరెన్సీ నోట్లు చిత్తు కాగితాలు అవుతాయి

## రిచ్ డాడ్ పూర్ డాడ్ రచయిత సంచలన ప్రకటన




రిచ్ డాడ్ పూర్ డాడ్ రచయిత రాబర్ట్ కియోసాకి ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ఆందోళన వ్యక్తం చేశారు. ఫియాట్ కరెన్సీలు తమ విలువను కోల్పోయి కాగితపు ముక్కలుగా మారే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ద్రవ్యోల్బణం, ఆర్థిక సంక్షోభాల నుండి తమను తాము రక్షించుకోవడానికి బంగారం, వెండి, బిట్‌కాయిన్‌లలో పెట్టుబడి పెట్టాలని ఆయన సూచించారు.ఆర్థిక విషయాలకు సంబంధించి విలువైన సూచనలు, సలహాలు ఇచ్చే రిచ్ డాడ్ పూర్ డాడ్ పుస్తక రచయిత రాబర్ట్ కియోసాకి మరోసారి సంచలన ప్రకటన చేశారు. ఇక విధంగా ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై హెచ్చరికలు జారీ చేశారు. ఇప్పుడు వాడుకలో ఉన్న నోట్లు (డాలర్, రూపాయి వంటి ఫియాట్ కరెన్సీలు) భవిష్యత్తులో కేవలం కాగితపు ముక్కలుగా మిగిలిపోయే ప్రమాదం ఉందని అన్నారు.ఆ టైమ్‌లో మిమ్మల్ని రక్షించేది బంగారం మాత్రమేనని ఆయన పేర్కొన్నారు. రాబర్ట్ కియోసాకి ఫియాట్ కరెన్సీల పతనంపై చేసిన ఈ హెచ్చరిక ఇప్పుడు సంచలనంగా మారింది. ఇష్టమొచ్చినట్లు ప్రభుత్వాలు నోట్లు ముద్రించడం, పెరిగిపోతున్న దేశాల అప్పుల భారం వల్ల కరెన్సీ తన అసలు విలువను కోల్పోతోందని ఆయన అభిప్రాయపడుతున్నారు. ద్రవ్యోల్బణం అనే భూతం మీ జేబులోని డబ్బును తినేస్తోందని హెచ్చరిస్తున్నారు. ఆర్థిక మాంద్యం, బ్యాంకింగ్ సంక్షోభం తలెత్తినప్పుడు స్టాక్ మార్కెట్లు కుప్పకూలుతాయి. కానీ బంగారం ఎప్పుడూ తన విలువను కోల్పోదని అన్నారు. కొన్ని ఏళ్లుగా బంగారం తన విలువను నిలుపుకుంది. దీనిని ఏ ప్రభుత్వం కూడా కావాలని సృష్టించలేదు, కనుక దీని విలువను తగ్గించలేరు. యుద్ధాలు, రాజకీయ అస్థిరత ఉన్న సమయంలో బంగారం పెట్టుబడిదారులకు ఒక 'సేఫ్ హెవెన్' లాంటిది. కేవలం బంగారం మీద మాత్రమే కాకుండా, భవిష్యత్తు ఆర్థిక షాక్‌ల నుంచి తప్పించుకోవడానికి కియోసాకి ఒక మూడు అంచెల వ్యూహాన్ని సూచిస్తున్నారు. దీర్ఘకాలిక స్థిరత్వం కోసం బంగారం , తక్కువ ధరలో లభించే వెండి, డిజిటల్ యుగంలో విప్లవాత్మక ఆస్తిగా బిట్‌కాయిన్‌ను సూచించారు.

## ఆధార్ కార్డుపై కీలక అప్డేట్.. కొత్త యాప్‌లో మొబైల్ నెంబర్,అడ్రస్ అప్డేట్ మరింత ఈజీ.. ఎలానో చూడండి




కేంద్ర ప్రభుత్వం బుధవారం కొత్త ఆధార్ యాప్‌ను లాంచ్ చేసింది. ఇందులో అనేక కొత్త ఫీచర్లు ఉన్నాయి. మీ కుటుంబసభ్యుల వివరాలు అన్నీ ఒకేచోట ఉండటంతో పాటు బయోమెట్రిక్ వివరాలను లాక్, అన్ లాక్ చేసుకోవచ్చు. ఈ యాప్ ఎలా ఉపయోగించాలో చూద్దాం. యూఐడీఏఐ కొత్త ఆధార్ యాప్‌ను జనవరి 28వ తేదీన అందుబాటులోకి తీసుకొచ్చింది. ఆధార్ పేరుతో ఈ యాప్‌ను ప్రవేశపెట్టింది. గతంలోనే ఈ యాప్ తీసుకురాగా.. ఇప్పుడు పూర్తి స్థాయి వెర్షన్‌ను విడుదల చేసింది. ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో కేంద్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ మంత్రి అశ్విని వైష్ణవ్ ఈ యాప్‌ను అధికారికంగా ప్రారంభించారు. ఈ పూర్తి స్థాయి వెర్షన్‌లో అనేక కొత్త ఫీచర్లు జోడించారు. దీంతో ఆధార్ వినియోగదారలు మరింత సురక్షితంగా, సులభంగా ఆధార్ సేవలను ఉపయోగించుకోవచ్చు. ఆధార్‌కు మరింత భద్రత పెరగనుంది. ఇందులోని ఫీచర్లు ఏంటి.. ఎలా వాడాలి అనే విషయాన్ని చూద్దాం.

## ఎస్ఆర్ పురం వద్ద స్కూల్ బస్సును ఢీకొట్టిన లారీ...

### ఏడుగురు విద్యార్థులకు తీవ్ర గాయాలు...



చిత్తూరు//జనవరి 30(ఆకాంక్ష) : చిత్తూరు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఎస్ఆర్ పురం సమీపంలోని గ్రామాల నుంచి విద్యార్థులను తీసుకుని జీడీనెల్లూరు వైపు వెళ్తున్న స్కూల్ బస్సును బీసీ కాలనీ వద్ద వెనుక నుంచి లారీ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న ఏడుగురు విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాద తీవ్రతకు ఒక విద్యార్థికి నాలుక తెగి పోయినట్లు అక్కడ ఉన్నవారు తెలిపారు. ఢీకొన్న సమయంలో బస్సులోని విద్యార్థులు భయాందోళనకు గురయ్యారు. స్థానికులు వెంటనే స్పందించి గాయపడిన విద్యార్థులను సమీప ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకున్నారు. ప్రమాదానికి గల కారణాలపై విచారణ చేపట్టారు.

# కారు డ్రైవర్‌గా జీవితం ప్రజాసేవే లక్ష్యంగా రాజకీయ ప్రస్థానం....

### సామాన్యుడి నుంచి కౌన్సిలర్ బరిలోకిడ

### మన నరేష్'గా పెద్దపల్లి 4వ డివిజన్ ప్రజల గుండెల్లో స్థానం...

### పేద ప్రజల గొంతుగా మున్సిపల్ ఎన్నికల్లో పోటీ...




పెద్దపల్లి//(ఆకాంక్ష) జనవరి 30: పెద్దపల్లి జిల్లాలోని నాలుగో డివిజన్‌లో ఈ సారి మున్సిపల్ ఎన్నికలు ఆసక్తికరంగా మారుతున్నాయి. సామాన్య కుటుంబం నుంచి వచ్చిన మెరుగు నరేష్ ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో జనసేన పార్టీ తరపున కౌన్సిలర్ బరిలో నిలవడం రాజకీయ వర్గాలతో పాటు ప్రజల్లోనూ చర్చనీయాంశంగా మారింది. పదిహేనేళ్లుగా కారు డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్న నరేష్, తన కష్టజీవితాన్నే ప్రజలతో పంచుకుంటూ, వారి సమస్యలే తన లక్ష్యమని చెబుతున్నారు.గత పది సంవత్సరాలుగా పెద్దపల్లిలో జనసేన పార్టీ క్రియాశీలక కార్యకర్తగా కొనసాగుతున్న మెరుగు నరేష్, పార్టీ సిద్ధాంతాలను, కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఎప్పుడూ ముందుంటున్నారు. చదువులో డిగ్రీ పూర్తి చేసినప్పటికీ, ఉద్యోగ పరిమితుల్లోనే కాదు, ప్రజల మధ్య ఉండి సేవ చేయాలనే ఆశయంతో రాజకీయాల్లోకి వచ్చారు. పార్టీకి నమ్మిన కార్యకర్తగా నిరంతరం పనిచేసిన అనుభవమే ఈరోజు ఆయనను అభ్యర్థిగా నిలిపిందని పార్టీ శ్రేణులు చెబుతున్నాయి. నాలుగో డివిజన్‌లో నరేష్‌కు ఉన్న పేరు, ఆయన మంచితనం, అందరితో కలిసిపోయే స్వభావం ప్రజల్లో విశ్వాసాన్ని పెంచింది. చిన్నా పెద్దా తేడా లేకుండా ప్రతి ఒక్కరితో ఆత్మీయంగా మాట్లాడే నరేష్ పేరు డివిజన్ అంతటా వినిపించడం ఆయనకు పెద్ద బలంగా మారింది. ఏ వీధిలో అడుగు పెట్టినా 'మన నరేష్' అనే భావన కనిపించడం, ఆయనపై




ప్రజలకు ఉన్న ఆదరణకు నిదర్శనంగా నిలుస్తోంది.ప్రజా సమస్యల పరిష్కారంలో సామాన్యులకు అండగా నిలబడతానని నరేష్ భరోసా ఇస్తున్నారు. డ్రైనేజీ, తాగునీరు, రహదారులు, పారిశుధ్యం వంటి మౌలిక సమస్యలపై తక్షణ చర్యలు తీసుకునే దృఢ సంకల్పం తనదని చెబుతున్నారు. డివిజన్‌లో ప్రతి ఇంటికి వెళ్లినప్పుడు ప్రజలు స్వచ్ఛందంగా నీరాజనాలు పలుకుతూ, తమ అభిమానాన్ని తెలియజేయడం ఆయనకు మరింత ఉత్సాహాన్ని ఇస్తోంది.ఈ మున్సిపల్ ఎన్నికల్లో కౌన్సిలర్ గా జనసేన పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేస్తానని, పార్టీ బలోపేతం కోసం చివరి వరకు శ్రమిస్తానని మెరుగు నరేష్ స్పష్టం చేస్తున్నారు. పార్టీలోనూ




ఆయనకు ఉన్న మంచి పేరు, కార్యకర్తల నమ్మకం ఈ పోటీలో మరింత కలిసొచ్చే అంశంగా రాజకీయ పరిశీలకులు అభిప్రాయ పడుతున్నారు. సామాన్య కుటుంబం నుంచి వచ్చిన అభ్యర్థిగా, ప్రజల గుండెల్లో స్థానం సంపాదించిన మెరుగు నరేష్ ఈ ఎన్నికల్లో ఏస్థాయిలో విజయం సాధిస్తారన్నది ఇప్పుడు పెద్దపల్లి రాజకీయ వర్గాల్లో ఆసక్తిగా మారింది.

# హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి నిర్బంధం....

### కరీంనగర్ జిల్లా వీణవంక సమ్మక్క గద్దెల వద్ద ఉద్రిక్తత...

### కేసు నమోదు, సైదాపూర్ ఠాణాకు ఎమ్మెల్యే తరలింపు...



కరీంనగర్//(ఆకాంక్ష) జనవరి 30: కరీంనగర్ జిల్లా వీణవంకలో నిర్వహించిన సమ్మక్కసారలమ్మ జాతరకు వెళ్లేందుకు సిద్ధమైన హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిని పోలీసులు అడ్డుకొని నిర్బంధించారు. హుజూరాబాద్ పట్టణ పరిధిలోని కేసీ క్యాంపులో ఉన్న తన క్యాంపు కార్యాలయం నుంచి కుటుంబ సభ్యులతో కలిసి బయలుదేరే సమయంలో, కారువద్దకు చేరగానే పోలీసులు వచ్చి కాన్వాయ్‌ను నిలిపివేశారు. వీణవంక జాతరకు వెళ్లొద్దనే ఆదేశాలు ఉన్నాయని చెప్పడంతో ఎమ్మెల్యే తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక ఎమ్మెల్యే తన కుటుంబ సభ్యులతో సమ్మక్క సారలమ్మ జాతరకు వెళ్లే స్వేచ్ఛ కూడా లేదేనా? అని రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.పోలీసులు ముందుకు వెళ్లనీయకపోవడంతో ఎమ్మెల్యే తన సతీమణి శాలినీరెడ్డి, కూతురు శ్రీనిఖ రెడ్డితో కలిసి కరీంనగర్‌వరంగల్ రహదారిపై బైఠాయించారు. ఈ విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ శ్రేణులు, అభిమానులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకొని మద్దతు ప్రకటించారు. సుమారు గంటపాటు రాస్తారోకో కొనసాగడంతో ప్రాంతంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ క్రమంలో పోలీసులకు, ఎమ్మెల్యేకు మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. పోలీసులకు, బీఆర్ఎస్ నాయకుల మధ్య తోపులాట కూడా జరిగింది.ఒకరిద్దరు కార్యకర్తలను బలవంతంగా పోలీస్ వాహనంలో ఎక్కించేందుకు ప్రయత్నించడంపై ఎమ్మెల్యే మండిపడ్డారు. వార్డు సభ్యుడిగా కూడా గెలవని ఓ అనామకుడికి సీపీలు, ఏసీపీలు గులాంగిరీ చేయడమేంటని ప్రశ్నించారు. అధికారం చేతిలో ఉందని ఇష్టం వచ్చినట్టు ప్రవర్తిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు.హుజూరాబాద్‌లో నిర్బంధం, ఆందోళనల అనంతరం సాయంత్రం పోలీసులు జాతరకు వెళ్లేందుకు అనుమతి ఇవ్వడంతో ఎమ్మెల్యే కుటుంబ సభ్యులతో కలిసి వీణవంకకు చేరుకున్నారు. స్థానిక సర్పంచ్ దాసారపు సరోజనతో కలిసి సమ్మక్క, సారలమ్మ గద్దెల వద్దకు వెళ్లారు. అమ్మవారి వద్ద కొబ్బరికాయ కొట్టనివ్వకుండా పేద దళిత మహిళా సర్పంచ్‌ను అడ్డుకున్నారని కౌశిక్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం గద్దెల వద్ద నుంచి దిగాలని హుజూరాబాద్ ఏసీపీ మాధవి ఎమ్మెల్యేకు, సర్పంచ్‌కు సూచించగా వారు నిరాకరించారు. ఈ నేపథ్యంలో కౌశిక్‌రెడ్డిపై కేసు నమోదు చేసి, అరెస్ట్ చేసి సైదాపూర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఇదే సమయంలో ఎమ్మెల్యే సతీమణి శాలినీరెడ్డి,కూతురు శ్రీనిఖను ఏసీపీ మాధవి పోలీసులతో కలిసి అక్కడి నుంచి బయటకు లాక్కెళ్లడం తీవ్ర వివాదానికి దారితీసింది.

# ఫోన్ ట్యాపింగ్ లో సిట్ నోటీసులు ఎన్నికల స్టంట్ మాత్రమే...



### కాంగ్రెస్‌బీఆర్ఎస్ డ్రామాలను ప్రజలు నమ్మరు...

### బీజేపీ ఎంపీ డీకే అరుణ...

జడ్చర్ల//జనవరి 30(ఆకాంక్ష) : మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో బీజేపీ ఎంపీ డీకే అరుణ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో కేసీఆర్‌కు సిట్ నోటీసులు ఇవ్వడం పూర్తిగా ఎన్నికల స్టంట్ మాత్రమేనని ఆరోపించారు. ఎన్నికలు వచ్చిన ప్రతీసారి ప్రజలను మోసం చేయడానికి ఏదో ఒక అంశాన్ని తెరపైకి తేవడం కాంగ్రెస్‌కు అలవాటుగా మారిందని, ఇప్పుడు అదే కోవలో ఫోన్ ట్యాపింగ్ అంశాన్ని బయటకు తీసుకొచ్చారని వ్యాఖ్యానించారు.కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల మధ్య లోపాయికారీ అవగాహన రాజకీయాలు నడుస్తున్నాయని ఆరోపించిన డీకే అరుణ, ఈ నోటీసుల తర్వాత వాస్తవంగా ఎలాంటి చర్యలు ఉండవని స్పష్టం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు, ఈ-కార్ రేస్ వ్యవహారాలపై నివేదికలు వచ్చి రెండేళ్లు గడిచినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని గుర్తు చేశారు. అలాంటప్పుడు సిట్ నోటీసులు ఎన్నికల వేళలోనే గుర్తుకు రావడం వెనుక అసలు ఉద్దేశం కాంగ్రెస్‌కు లబ్ధి చేకూర్చడమేనని ఆరోపించారు.చర్యలు తీసుకుంటున్నామని చెప్పడం కేవలం నాటకమేనని, వాస్తవంగా చర్యలు తీసుకునే చిత్తశుద్ధి కాంగ్రెస్‌కు లేదని డీకే అరుణ విమర్శించారు. కాంగ్రెస్,బీఆర్ఎస్ ఎన్ని రాజకీయ డ్రామాలు చేసినా ప్రజలు ఇకపై నమ్మే పరిస్థితిలో లేరని స్పష్టం చేశారు. ఎన్నికల స్టంట్లకు ప్రజలు మోసపోవద్దని ఈ సందర్భంగా ఆమె ప్రజలకు విజ్ఞప్తి చేశారు.గద్వాల ఎమ్మెల్యే ఇప్పటికీ బీఆర్ఎస్‌లోనే ఉన్నారని స్పీకర్ స్వయంగా చెప్పినప్పటికీ, అదే ఎమ్మెల్యే కాంగ్రెస్‌కు ఓటు వేయాలని ప్రచారం చేస్తున్నారని డీకే అరుణ మండిపడ్డారు. నిజంగా కాంగ్రెస్‌పై నమ్మకం ఉంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి కాంగ్రెస్ తరఫున పోటీ చేసి గెలవాలని సవాల్ విసిరారు. స్పీకర్ కూడా కోర్టులను మోసం చేస్తున్నారని ఆరోపిస్తూ, ఇంతకన్నా దారుణం ఇంకేముంటుందని ప్రశ్నించారు.ఫిరాయింపుల అంశంపై ఎన్నికల ముందు రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డిలు చేసిన వ్యాఖ్యలను గుర్తు చేసుకోవాలని డీకే అరుణ అన్నారు.బీఆర్ఎస్ చేసిన పనినే ఇప్పుడు కాంగ్రెస్ చేస్తోందని, ఈ రెండు పార్టీల మధ్య తేడా ఏమీ లేదని వ్యాఖ్యానించారు. ఇలాంటి రాజకీయాల వల్లే ప్రజాస్వామ్యంలో విలువలు పూర్తిగా దిగజారిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.విద్య, వైద్యం, రోడ్లు, మౌలిక వసతుల అభివృద్ధికి అవసరమైన నిధులు కేవలం కేంద్ర ప్రభుత్వం నుంచే వస్తున్నాయని డీకే అరుణ స్పష్టం చేశారు. మహబూబ్‌నగర్ చుట్టుపక్కల బైపాస్ రోడ్ల నిర్మాణం జరుగుతోందని, కేంద్ర సహకారంతోనే ఈ అభివృద్ధి సాధ్యమవుతోందని తెలిపారు. మహబూబ్‌నగర్ పట్టణ ప్రజలకు ఇప్పటి వరకు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల నుంచి ఎలాంటి గణనీయమైన అభివృద్ధి జరగలేదని విమర్శించారు.మహబూబ్‌నగర్ పట్టణ అభివృద్ధి పూర్తిగా కేంద్ర ప్రభుత్వంతోనే సాధ్యమని, అందుకే రాబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగురవేయాలని ప్రజలను కోరారు. మహబూబ్‌నగర్ మేయర్ పదవికి బీజేపీకి అవకాశం ఇవ్వాలని, అప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం తుంగలో తొక్కిందని ఆరోపించిన డీకే అరుణ, ఎన్నికలు రాగానే శంకుస్థాపనలు చేయడం, కొబ్బరికాయలు కొట్టి ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. ఈ మోసపూరిత రాజకీయాలను ప్రజలు గమనించి సరైన నిర్ణయం తీసుకోవాల్సిన సమయం వచ్చిందని ఆమె అన్నారు.

# నామినేటెడ్ పాలకవర్గంతో.. రైతులకు మేలు జరిగేనా..?

**సహకార సంఘాలలో ఎన్నికలను రద్దు చేస్తూ నామినేటెడ్ పదవుల నియామకానికి ప్రభుత్వం ప్రయత్నం చేస్తున్న విషయం తెలిసిందే. ఇంతకుముందు వ్యవసాయ సహకార సంఘానికి ఎన్నికలు నిర్వహించి డైరెక్టర్ల మద్దతుతో చైర్మన్ పదవి దక్కుతుండేది.**

నామినేటెడ్ పాలకవర్గంతో.. రైతులకు మేలు జరిగేనా.

సహకార సంఘాలలో ఎన్నికలను రద్దు చేస్తూ నామినేటెడ్ పదవుల నియామకానికి ప్రభుత్వం ప్రయత్నం చేస్తున్న విషయం తెలిసిందే. ఇంతకుముందు వ్యవసాయ సహకార సంఘానికి ఎన్నికలు నిర్వహించి డైరెక్టర్ల మద్దతుతో చైర్మన్ పదవి దక్కుతుండేది. కానీ ప్రభుత్వం ప్రస్తుతం డైరెక్టర్లను, చైర్మన్, వైస్ చైర్మన్‌లను నామినేటెడ్‌గా నియమిస్తే సంఘంలో ఇబ్బందులు ఏర్పడే అవకాశం లేకపోలేదు. రైతుల ఓట్లతో ఎన్నుకున్న పాలకవర్గానికి తెలియకుండా కొందరు చైర్మన్లు అవకతవకలకు పాల్పడినట్టు ఆరోపణలు ఉన్నాయి.. అలాంటిది ఎలాంటి ఎన్నికలూ లేకుండా నామినేటెడ్ పోస్టులు చేస్తే రైతులకు న్యాయం జరుగుతుందా? అనే సందేహాలు రైతులలో నెలకొన్నవి. రైతులచే ఎన్నుకోబడే చైర్మన్‌లను నామినేటెడ్‌గా ప్రకటించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తుంటే రైతులు ఆందోళన చెందుతున్నారు.

## రైతులకు పదవులు దక్కేనా

సొసైటీలో ప్రభుత్వం నామినేటెడ్‌గా పదవులు భర్తీ చేస్తే అందులో ఏ పార్టీకి చెందని రైతులకు ఆ పదవులు దక్కుతాయా అనే సందిగ్ధత నెలకొంది. ప్రభుత్వానికి అనుకూలంగా ఉన్న పార్టీకి చెందిన చైర్మన్, వైస్ చైర్మన్, డైరెక్టర్లు ఉంటారు అందులో ఒకవేళ చైర్మన్ అవకతవకలకు పాల్పడితే చైర్మన్‌ను ఎవరు ప్రశ్నిస్తారు. అంతా ఒక గూటికి చెందిన నాయకులే కనుక ప్రశ్నించే అవకాశం అక్కడ ఉండదు.. సొసైటీలో 13 మంది డైరెక్టర్లు ఉండగా, ఏడుగురితో చైర్మన్ పదవి కైవసం చేసుకోవచ్చు. కొన్ని సొసైటీలలో రెండు పార్టీలకు చెందిన డైరెక్టర్లు చెరో సగం విజయం సాధిస్తే అక్కడ సొసైటీ పాలక వర్గంలో తీసుకునే నిర్ణయాలన్నిటిలోనూ ప్రతిపక్ష డైరెక్టర్‌లకు వివరించాల్సి ఉంటుంది గనుక అక్కడ అవకతవకలకు తక్కువ అవకాశాలు ఉంటాయి.

## సహకార సంఘాల ఏర్పాటు ముఖ్య ఉద్దేశం



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వ్యవసాయ ప్రాథమిక సహకార సంఘాలు 01 ఆగస్టు 1964 నుండి ఒక ప్రత్యేక చట్టం ద్వారా అమలు చేయబడ్డాయి. రైతుల అవసరాలకు అనుగుణంగా ఎరువులు, పంట రుణాలు రైతుల వద్దకు నేరుగా చేరేందుకు ఒక గొప్ప ఆలోచనతో సహకార సంఘాలు అప్పట్లో ఏర్పాటు చేయబడ్డాయి. సహకార సంఘ చట్టంలో సభ్యులుగా చేరిన రైతులకు ఓటు హక్కు కల్పించారు. సంఘానికి ఎన్నికలు జరిగే సమయంలో అందులో సభ్యత్వం ఉన్న ప్రతి రైతు ఓటు హక్కును వినియోగించుకోవచ్చు. రైతులు తమ ఓటు హక్కును వినియోగించుకోకుండానే పాలకవర్గాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేయబోతుందని ప్రతిపాదనలు ఉన్నాయి.

## నామినేటెడ్ పదవులకు ఖర్చు ఉండదా

తెలంగాణ ప్రభుత్వం ఎన్నికల ఖర్చులు తగ్గించాలని సొసైటీ ఎన్నికలు నిర్వహించకుండా నామినేటెడ్‌గా నియమించాలని భావిస్తోంది. కానీ నామినేటెడ్‌గా పదవులు దక్కితే వాళ్లకు ఖర్చులు ఉండవా? అనేది ప్రశ్నతకంగా మారింది. నామినేటెడ్ పదవుల విపరీతమైన డిమాండ్ ఉంది. పదవి పొందిన వారు రాజకీయ పార్టీల మీటింగ్‌లు పెడితే దాని ఖర్చు వారు భరిం చాల్సిందే. లేదా పార్టీకి ఫండింగ్ ఇయ్యాల్సిందే. ఇది ముందు నుంచి అనేక నామినేటెడ్ పదవులలో జరుగుతున్న తంతే...

## ఎన్నికల ఖర్చులే కారణం అయితే...

ఎన్నికలు నిర్వహించేందుకు అయ్యే ఖర్చులే నామినేటెడ్‌కు కారణమైతే ప్రాథమిక సహకార సంఘ ఎన్నికలలో సంఘం మొత్తానికి కలిపి ఒకే పోలింగ్ బూత్‌లో ఎన్నికలు నిర్వహిస్తారు. దానికి అయ్యే ఖర్చు చాలా తక్కువ. అదే గ్రామపంచాయతీ ఎన్నికలలో ప్రతి గ్రామంలో పోలింగ్ బూతులు నిర్వహిస్తారు వీటికి ఖర్చు చాలా ఎక్కువ. రెండిటినీ పోలిస్తే గ్రామపంచాయతీ ఎన్నికల ఖర్చు వ్యయం ఎక్కువే అవుతుంది. రాబోయే రోజులలో ఎన్నికల ఖర్చులు తగ్గించాలంటే సర్పంచ్, పాలకవర్గం, ఎంపీపీ, పాలకవర్గం, జడ్పీటీసీ పాలకవర్గాలను కూడా నామినేటెడ్ పదవులుగా ప్రకటించాలి కదా..

# సమన్వయంతో పనిచేస్తే పీపీపీ గేమ్ చేంజర్!

**పబ్లిక్-ప్రైవేటు (పీపీపీ) భాగస్వామ్యంతో కొత్త ప్రభుత్వ వైద్య కళాశాలల స్థాపనపై జరుగుతున్న చర్చ ప్రభుత్వానికి, ప్రతిపక్షానికి మధ్య జరుగుతున్న సాధారణ వివాదంలా కనిపించినా, పరిమిత ఆర్థిక వనరులున్న ప్రభుత్వం వైద్యవిద్యారోగ్య రంగాన్ని దాని మౌలిక స్వభావాన్ని కోల్పోకుండా విస్తరింపచేయడం ఎలా అనేదే అసలు సమస్య..**




పబ్లిక్-ప్రైవేటు (పీపీపీ) భాగస్వామ్యంతో కొత్త ప్రభుత్వ వైద్య కళాశాలల స్థాపనపై జరుగుతున్న చర్చ ప్రభుత్వానికి, ప్రతిపక్షానికి మధ్య జరుగుతున్న సాధారణ వివాదంలా కనిపించినా, పరిమిత ఆర్థిక వనరులున్న ప్రభుత్వం వైద్యవిద్యారోగ్య రంగాన్ని దాని మౌలిక స్వభావాన్ని కోల్పోకుండా విస్తరింపచేయడం ఎలా అనేదే అసలు సమస్య.. ఈ వివాదం సమకాలీన భారత దేశంలో సిద్ధాంతం, పాలనా సామర్థ్యం, ఆర్థిక పరిమితుల మధ్య ఉన్న లోతైన విభజనను స్పష్టంగా వెలికితీస్తున్న అరుదైన విధాన చర్చకు దారితీస్తోంది. పెరుగుతున్న జనాభానుగుణంగా దేశంలో నాణ్యమైన వైద్య విద్యను విస్తరించడానికి, ఆరోగ్య సేవలను మెరుగుపరచడానికి పీపీపీ విధానంలో కొత్త వైద్య కళాశాలలను ఏర్పాటు చేయాలన్న నీతి ఆయోగ్ భావనకు అనుగుణంగా ఒక్క వైద్య కళాశాల కూడా లేని జిల్లాలలో అప్పటికే ఉన్న జిల్లా లేదా రిఫరల్ ప్రభుత్వ ఆసుపత్రులకు జత చేసి 157 కొత్త వైద్య కళాశాలలను కేంద్ర ప్రాయోజిత పథకం కింద ఏర్పాటు చేయడానికి కేంద్ర ప్రభుత్వం అనుమతించింది.

## పీపీపీతో జవాబుదారీతనం, పారదర్శకత..

వైద్యవిద్యారోగ్య రంగంలో నిధుల సమీకరణ, నైపుణ్యం, సృజనాత్మకత పరంగా పీపీపీ చాలా లాభదాయకమైనదని, దీని వలన ప్రాజెక్టుల స్థిరాభివృద్ధి సాధ్యమై జవాబుదారీతనం, పారదర్శకత ఇనుమడించి గ్రామీణ భారతంలో ఆధునిక వైద్య సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. పీపీపీ ప్రాజెక్టులను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం వయబులిటీ గ్యాప్ ఫండింగ్ (వి.జి.ఎఫ్) కింద ప్రత్యేక ఆర్థిక సహాయాన్ని అందిస్తోంది. మూల ధన వ్యయంలో 30 నుంచి 40శాతం ( పైలట్ ప్రాజెక్టులకు 80 శాతం వరకు), నిర్వహణ ఖర్చుల్లో మొదటి ఐదేళ్లకు 50 శాతం గ్రాంట్ రూపంలో ఇస్తారు. వీజీఎఫ్ వ్యయంలో కేంద్ర, రాష్ట్రాలు చెరి సగం భరిస్తారు. ఇరవై రాష్ట్రాలలో పీపీపీ విధానంలో నిర్వహిస్తున్న 919 డయాలిసిస్ కేంద్రాలకు కేంద్రం 80శాతం వరకు వీజీఎఫ్ ఇస్తోందని, వైద్య కళాశాలలు, ఆసుపత్రులు, డయాగ్నస్టిక్ కేంద్రాలు, అత్యవసర వైద్య సేవలు, వైద్య పరికరాల ఏర్పాటు వంటి మౌలిక ప్రాజెక్టులకు ఇది గొప్ప అవకాశమని, రాష్ట్రాలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కేంద్ర మంత్రి విజ్ఞప్తి చేస్తున్నారు. వైద్య విద్య ఖర్చు విపరీతంగా పెరిగిపోతున్న క్రమంలో 2029 నాటికి మరో 75,000 మెడికల్ సీట్లు అందుబాటులోకి రావాలంటే పీపీపీ తప్ప మరో ప్రత్యామ్నాయం లేదని విభిన్న పార్టీల ఎంపీలతో కూడిన పార్లమెంటరీ స్థాయీ సంఘం కూడా స్పష్టం చేసింది.

## దేశమంతటా ఒప్పు.. ఇక్కడ తప్పా?

తన హయాంలో రూ.8,480 కోట్ల అంచనా వ్యయంతో గ్రామీణ ప్రాంతాల్లో 17 వైద్య కళాశాలలను నిర్మించి 2250 ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులోకి తేవాలని తలపెట్టిన వైఎస్ జగన్మోహన్ రెడ్డి రూ.1,550 కోట్ల ఖర్చుతో కేవలం ఐదు మెడికల్ కాలేజీల నిర్మాణాన్ని అరకొరగా మాత్రమే పూర్తి చేయగలిగారనేది వాస్తవం. అందుకే నిధుల కొరతతో సుదీర్ఘ కాలం పాటు నిర్మాణాలు కొనసాగే దుస్థితికి చరమగీతం పాడి వైద్యారోగ్య సేవలను గ్రామీణ ప్రాంతాలకు వేగంగా విస్తరించడం కోసం మౌలిక సదుపాయాల కల్పనలో విజయవంతమైన పీపీపీ విధానాన్ని అనుసరించాలని ఏపీ ప్రభుత్వం ఆలోచన. అయితే వైద్యారోగ్య విషయంలో పీపీపీతో ప్రభుత్వ సొమ్మును ప్రైవేటు వారికి దోచి పెడుతున్నారని, ప్రభుత్వ కళాశాలలను ప్రైవేటైజ్ చేస్తున్నారని విపక్షం ఆరోపిస్తోంది. నిజానికి ఒక్క ఏపీలోనే కాదు వీజీఎఫ్ ద్వారా దేశంలోని వివిధ జిల్లాలలో పీపీపీ ప్రాజెక్టులకు కేంద్ర మంత్రి జెపి నడ్డా శంకుస్థాపన చేశారు.

## వైసీపీ ద్వంద వైఖరి..

పీపీపీ విధానంలో రిజర్వేషన్లు ఉండవని, పేద విద్యార్థులకు వైద్య విద్య దుర్లభం అవుతుందనే విమర్శలు నిరాధారం. నిజానికి జీవో నెం 107,108, 133, 204 ద్వారా కొత్త ప్రభుత్వ వైద్య కళాశాలల్లోని మొత్తం సీట్లలో 15శాతం ఆలిండియా కోటా పోగా మిగిలిన సీట్లలో సగం జనరల్ విభాగం (రూ.15,000), 35శాతం సెల్ఫ్ ఫైనాన్స్ (రూ.12,00,000), 15శాతం ఎన్నారై (రూ.20,00,000) కోటాగా నిర్ధారించి ప్రభుత్వ వైద్య విద్యను వ్యాపారీకరణ చేసిందే వైసీపీ ప్రభుత్వం. పీపీపీ విధానంలో జనరల్ విభాగంలో 110 (7.5శాతం), మిగతా విభాగాల్లో 110 మెడికల్ సీట్లు అదనంగా లభించడం వలన స్థానిక విద్యార్థులకు మరింత మేలు చేకూరుతుందని ప్రభుత్వం చెబుతోంది. పీపీపీ అంటే ప్రయివేటీకరణ కాదని, ప్రభుత్వ పర్యవేక్షణలో ప్రైవేటు రంగ సామర్థ్యాన్ని వినియోగించు కోవడమేనని, యాజమాన్య హక్కు ప్రభుత్వానిదేనని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పష్టత ఇచ్చాయి. పీపీపీ ద్వారా నిర్మించినా అవి ప్రభుత్వ మెడికల్ కళాశాలలుగానే కొనసాగుతాయని, ప్రభుత్వ కోటాలో సీట్లు, రిజర్వేషన్లు, నిబంధనలు, ప్రవేశాలు, ఫీజు నియంత్రణ అన్నీ ఎన్ఎంసీ, రాష్ట్ర ప్రభుత్వ నియంత్రణలోనే ఉంటాయి.

## గ్రామీణ భారతంలో కార్పొరేట్ వైద్యం..

ప్రభుత్వ వైద్య కళాశాలలు, ఆసుపత్రుల నిర్మాణం కాదు, నిర్వహణే అసలు సమస్య. ఈ పరిస్థితిని అధిగమించాలంటే పీపీపీనే అనుసరణీయం అనేది నిష్ఠుర సత్యం. వైద్య కళాశాలలకు అనుబంధంగా ఉన్న ఆసుపత్రులలో ఇప్పుడున్నట్లే ఓపి సేవలు ఉచితంగా అందించడంతో పాటు ఒక్కో కాలేజీ ఆసుపత్రిలో 70శాతం పడకలు ఉచిత వైద్యానికి కేటాయిస్తారు. అత్యాధునిక వైద్య సౌకర్యాలు, ఆయుష్మాన్ భారత్-ఎన్టీఆర్ వైద్యసేవా పథకం క్రింద యూనివర్సల్ హెల్త్ పాలసీతో పాటు సూపర్ స్పెషలిస్ట్ డాక్టర్ల సేవలు అందుబాటులో ఉండటం వలన పేదలకు కార్పొరేట్ వైద్యం ఉచితంగా అందుతుందని కూటమి ప్రభుత్వం చెబుతోంది. గతంలో పేదలకు కార్పొరేట్ వైద్యం అంటూ ఆరోగ్యశ్రీ ని పొగిడిన మేధావులు ఇప్పుడు పేదలకు అదే కార్పొరేట్ వైద్యం పీపీపీ ద్వారా లభిస్తుంటే విమర్శించడం విచారకరం. వాస్తవంలో పేదలకు వైద్యఆరోగ్య రంగంలో నాణ్యమైన వైద్య సేవలు అందే విధంగా ప్రభుత్వం, ప్రైవేటు భాగస్వాములు సమన్వయంతో పనిచేస్తే ఆరోగ్య రంగంలో కూడా పీపీపీ గేమ్ చేంజర్‌గా మారే అవకాశం ఉంది.

# శీచలికాలంలో "గుండెపోటు"కు కారణాలివే! - వైద్య నిపుణులు ఏం చెప్తున్నారంటే!

**ఈ సీజన్‌లో రోగనిరోధక శక్తి తక్కువ - ఎండకు తిరగడంతో పాటు ఏం చేయాలో తెలుసా?**

వాతావరణంలో ఉష్ణోగ్రతలు తగ్గి, వెన్నులో వణుకు పుట్టించే చలితో పిల్లలు, వృద్ధులకు అనారోగ్య సమస్యలు వస్తున్నాయి. చిన్నారులకు ముక్కులో నుంచి రక్తం కారడం, చంటి పిల్లల్లో న్యుమోనియా, పెద్దల్లో ఆస్తమా పెరుగుతున్నాయి. గుండె సంబంధిత రుగ్మతలున్న వారికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ క్రమంలో రోజురోజుకూ పెరుగుతున్న చలి కారణంగా కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అంటున్నారు నిపుణులు. మరి, అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం! శీతాకాలంలో జీర్ణశక్తి మందగిస్తుంది. శరీరానికి ఎండ సరిగ్గా తగలక విటమిన్ డి లోపం తలెత్తి, రోగనిరోధక శక్తి క్షీణించే అవకాశం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. ఫలితంగా వివిధ రకాల అనారోగ్యాలు చుట్టుముడతాయని అంటున్నారు. మరి, ఈ సమస్యల్ని నివారించాలంటే ఈ కాలంలో లభించే కొన్ని ఆహారం, వ్యాయామాలతో పాటు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

## ఈ జాగ్రత్తలు తప్పనిసరి :



చలి తీవ్రత పెరగడంతో అనేక లక్షణాలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా జలుబు, దగ్గు, గొంతునొప్పి, ఒళ్లు నొప్పులు, జ్వరంతో బాధపడే వారి సంఖ్య క్రమంగా పెరుగుతుందంటున్నారు నిపుణులు. ఈ కాలంలో చిన్నారుల్లో తీవ్రమైన జ్వరాలు కనిపిస్తుంటాయని చెబుతున్నారు. ఊపిరితిత్తుల ఇన్‌ఫెక్షన్లు ఎక్కువగా సోకుతుంటాయని పేర్కొంటున్నారు. ముఖ్యంగా న్యుమోనియా సోకకుండా జాగ్రత్తపడాలని తెలియజేస్తున్నారు. అలాగే, అనేక రకాల అలర్జీలు, చర్మ సంబంధిత సమస్యలూ పిల్లలపై దాడి చేస్తుంటాయని పేర్కొంటున్నారు. నెలలోపు వయసున్న పసిపిల్లల్లో 'హైపోథర్మియా' వచ్చే అవకాశం ఉందంటున్నారు నిపుణులు. అంటే శరీర ఉష్ణోగ్రత తగ్గిపోయి వారి శరీరం చల్లబడుతుందని పేర్కొంటున్నారు. ఇది చాలా ప్రమాదకరమని హెచ్చరిస్తున్నారు. కాబట్టి పసిపిల్లల్ని వెచ్చగా ఉంచాలని సూచిస్తున్నారు. అలాగే, పొడి వాతావరణం వల్ల ముక్కు ఎండిపోయి లోపల నుంచి రక్తస్రావం జరుగుతుందని పేర్కొంటున్నారు. జలుబు తీవ్రంగా ఉండడం వల్ల ఎక్కువసార్లు ముక్కు చీదినా, లోపల తరచూ వేలు పెట్టినా రక్తం వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. శీతల వాతావరణం గుండె సమస్యలున్న వారికి ప్రమాదకరం. రక్తనాళాలు సంకోచించడం వల్ల హైబీపీకి దారితీస్తుంది. తద్వారా గుండెపై ఒత్తిడి పెరుగుతుంది. చల్లని వాతావరణం వల్ల రక్తం చిక్కుబడి క్లాట్స్ ఏర్పడే ప్రమాదం ఉంది. శ్వాసకోశ సంబంధిత సమస్యల వల్ల గుండెకు సరఫరా అయ్యే ప్రాణవాయువు శాతం తగ్గడంతో దాని పనితనం దెబ్బతింటుంది. చలిగా ఉందని చాలా మంది శారీరక శ్రమ లేదా వ్యాయామం తగ్గిస్తారు. దీనివల్ల గుండె సమస్యలు అధికమయ్యే ప్రమాదం ఉంది. ఇప్పటికే గుండె సంబంధిత సమస్యలున్న వారు, వృద్ధులు జాగ్రత్తలు పాటించాలి. ఉదయం కాస్త ఎండ వచ్చాక వ్యాయామం కొనసాగించాలి. జన సమూహంలోకి వెళ్లినపుడు మాస్కులు ధరించాలి.

కొవ్వు పదార్థాలను తినకూడదు. చక్కెర ఎక్కువ కలిగిన ఆహారాన్ని నిషేధించాలి. ఏదైనా ఇబ్బంది కలిగితే వైద్యులను వెంటనే సంప్రదించాలి. డాక్టర్ అజయ్, గుండె వైద్యుడు, కిమ్స్ ఆసుపత్రి, హైదరాబాద్ ఆహారం, వ్యాయామం : ఈ సీజన్‌లో వ్యాధుల బారిన పడకుండా నిపుణుల సూచనలు అనారోగ్యకరమైన చిరుతిళ్లు జోలికి వెళ్లకుండా వేడి ఆహారాన్ని, ముఖ్యంగా ఆకుకూరలను భోజనంలో భాగం చేసుకోవాలని సూచిస్తున్నారు. నూనెలు ఎక్కువగా ఉండే వేపుళ్లు, పిండి వంటలను కట్టిడి చేయాలని పేర్కొంటున్నారు. వేడివేడి సూప్‌లను ఆహారంలో భాగం చేసుకోవాలని సూచిస్తున్నారు. ఈ కాలంలో దాహం లేదని పిల్లలు మంచి నీళ్లు ఎక్కువగా తాగరు. దీనివల్ల చర్మం, పెదవులు పొడిబారి రక్తస్రావం జరుగుతుందని తెలియజేస్తున్నారు. కాబట్టి దాహంగా అనిపించకున్నా నీళ్లు తాగుతూ ఉండాలని సూచిస్తున్నారు. రోజుకు కనీసం రెండు, మూడు సార్లు చర్మానికి మాయిశ్చరైజర్లు రాసి పొడిబారకుండాచూసుకోవాలంటున్నారు. చలి ఎక్కువగా ఉంటే వ్యాయామం ఇంటి లోపల చేయొచ్చని చెబుతున్నారు. కాస్త ఎండ వచ్చాక నడక, ఇతర శారీరక శ్రమ కలిగించే ఎక్సర్‌సైజ్‌లు తప్పనిసరంటున్నారు. ఉన్ని దుస్తులతో చలి తగలకుండా వెచ్చగా ఉండడం అందరికీ మేలని సూచిస్తున్నారు. ఇక్కడ మీకు అందించిన సమాచారం, సూచనలు అన్నీ మీ అవగాహన కోసం మాత్రమే. శాస్త్ర పరిశోధనలు, అధ్యయనాలు, వైద్య, ఆరోగ్య నిపుణుల సూచనల ప్రకారమే మేము ఈ సమాచారాన్ని అందిస్తున్నాం. వీటిని పాటించే ముందు కచ్చితంగా మీ వ్యక్తిగత వైద్యుల సలహాలు తీసుకోవడమే మంచిది.

**తొలి కారును ఆవిష్కరించిన**

# టయోటా..ఏకంగా 543 కిమీ

**అర్బన్ క్రూయిజర్ ఎబెల్లా పేరుతో ఈ కారును తీసుకువచ్చారు.**




ఇండియన్ మార్కెట్లో ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం విపరీతంగా పెరిగిపోయిన సంగతి తెలిసిందే. మోడీ సర్కార్ అధికారంలోకి వచ్చిన తర్వాత పెట్రోల్, డీజిల్ ధరలు విపరీతంగా పెరిగాయి. దాని ఫలితంగా ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం కూడా క్రమక్రమంగా పెరుగుతోంది. కస్టమర్లు ఎలక్ట్రిక్ వాహనాలు కొంటున్న నేపథ్యంలో, తక్కువ ధరలో ఎక్కువ మైలేజ్ ఇచ్చే వాహనాలను కూడా కంపెనీలు తీసుకువస్తున్నాయి. డిమాండ్ కు తగ్గట్టు ప్రొడక్షన్ కూడా అవుతోంది. ఇలాంటి నేపథ్యంలోనే టయోటా తన తొలి ఎలక్ట్రిక్ వాహనాన్ని ఆవిష్కరించింది. అర్బన్ క్రూయిజర్ ఎబెల్లా పేరుతో ఈ కారును తీసుకువచ్చారు. ఈ మేరకు అధికారిక ప్రకటన చేసింది కంపెనీ. దీంతో ఈ కొత్త కారు ఫోటోలు వైరల్ గా మారాయి.

## తొలి ఎలక్ట్రిక్ అర్బన్ క్రూయిజర్ ఎబెల్లా కారు ఫీచర్లు ఇవే

టయోటా తీసుకువచ్చిన మొదటి ఎలక్ట్రిక్ వెహికల్ అర్బన్ క్రూయిజర్ ఎబెల్లా కారు 543 కిలోమీటర్ల వరకు మైలేజ్ ఇస్తుందట. 61 ఏిష్ట్ర బ్యాటరీ ఉన్న కారు ఈ రేంజ్ లో మైలేజ్ ఇస్తుందని కంపెనీ వెల్లడించింది. అలాగే 49 ఏిష్ట్ర ఉన్న ఎలక్ట్రిక్ కారు 440 కిలోమీటర్ల మైలేజ్ ఇస్తుందని వివరించింది. అంటే బ్యాటరీ సామర్థ్యాన్ని బట్టి మైలేజ్ లో తేడా ఉంటుంది. అలాగే 360 డిగ్రీ కెమెరా, వైర్లెస్ చార్జర్, పవర్డ్ డ్రైవర్ సీట్ కూడా అందిస్తున్నారు. ఇంటీరియర్ లో సన్ రూఫ్ కూడా కంపెనీ అందిస్తోంది. ఎల్ఈడి ఐ=ా, హెడ్ లాంప్స్, అందిస్తున్నారు. ఈ కారు ఒకసారి ఫుల్ చార్జింగ్ కావాలంటే దాదాపు 7 గంటల సమయం పడుతుంది. 189 అఎ టార్క్ కూడా రిలీజ్ కానుంది. ఇక అర్బన్ క్రూయిజర్ ఎబెల్లా కారు ధర ఇంకా ప్రకటించలేదు కంపెనీ. కానీ ఈ కారు ధర రూ.18 లక్షల నుంచి రూ.25 లక్షల మధ్య ఉండే ఛాన్సు ఉంది.

# ప్రైవసీ.. ప్రాధాన్యతలు..! యువతలో మారుతున్న ధోరణి

**స్మార్ట్‌ఫోన్‌లలో నిమగ్నమై సెర్చ్ చేస్తున్నప్పుడు, సోషల్ మీడియాలో స్క్రోల్ చేస్తున్నప్పుడు, వివిధ యాప్‌లలో మాట్లాడుతున్నప్పుడు మనకు తెలియకుండానే మన సమాచారాన్ని సేకరించే టెక్నాలజీ ఇప్పుడు అందుబాటులో ఉంది.**



ప్రైవసీ ప్రతీ వ్యక్తి గోప్యత వంటివి వ్యక్తుల జీవితంలో ఒక ముఖ్యమైన భాగం. వ్యక్తిగత జీవితం, అభిప్రాయాలు, కుటుంబ వ్యవహారాలు, అలవాట్లు వంటి విషయాల్లో చాలా మంది సరిహద్దులు పాటించేవారు. కొన్ని విషయాలను బయటకు చెప్పకపోయేవారు. కానీ ఆధునిక సాంకేతికత అందుబాటులోకి రావడం, సోషల్ మీడియా హవా పెరగడంతో ప్రైవసీలోనూ సడలింపులు స్టార్ట్ అయ్యాయి. ఒకప్పటితో పోలిస్తే ఇప్పుడు చాలా తక్కువ మంది అనేక విషయాల్లో గోప్యత అంత ముఖ్యమైందని భావించడం లేదు. అత్యంతక వ్యక్తిగతమైన విషయాల్లో తప్ప అన్నింటిలోనూ గోప్యతను పాటించాలని చాలామంది అనుకోవడం లేదు. ఆధునిక యువతలో ధోరణి క్రమంగా పెరుగుతోంది. - దిశ, ఫీచర్స్

## అంతా ఆటోమేటిక్

ప్రైవసీ ఇప్పుడు పూర్తిగా అంతర్ధానం కాలేదు. కానీ ఆటోమేటిక్‌గా మారిపోయింది. మనం స్మార్ట్‌ఫోన్‌లలో స్క్రోల్ చేస్తూ, స్వైప్ చేస్తూ, స్మార్ట్ డివైస్‌లతో మాట్లాడుతుండగా, టెక్నాలజీ మన గురించి మనకు తెలియకుండానే ఎక్కువ సమాచారాన్ని సేకరిస్తోంది. ప్రస్తుతం ఇది యాక్టివ్‌గా ఉందని నిపుణులు అంటున్నారు. ఇలాంటి ట్రాకింగ్ కొన్ని సార్లు డిస్టోపియన్ నవలలాగా అనిపిస్తుంది. రోజువారీ జీవితంలో మనల్ని ట్రాక్ చేసే 10 నిజమైన మార్గాలు ఉన్నాయి. ఇవి సోషల్ మీడియా, సెర్చ్ ఇంజిన్‌లు, ఈమెయిల్‌లు, యాప్‌లు, కుకీలు, మొబైల్ డివైస్‌లు, వై-ఫై, సర్వైలెన్స్ కెమెరాలు, ఆన్‌లైన్ షాపింగ్, హోమ్ డివైస్‌లు వంటివి.

## సెర్చ్ ఇంజిన్ల కీ రోల్

సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌ల విషయానికి ఫేస్‌బుక్ సహా పలు ఇతర వేదికలు కూడా మన రాజకీయ ఆలోచనలు, వయసు, స్నేహితుల లోకేషన్లు, ఉపయోగిస్తున్న డివైస్‌లు వంటి సమాచారాన్ని ట్రాక్ చేసి, వ్యక్తిగతీకరించిన (ావతీంశీఅఖ్రీఱఓవం)యాడ్‌లు చూపిస్తాయి. సెర్చ్ రిజల్ట్‌లలో గూగుల్ వంటి ఇంజిన్‌లు మన సెర్చ్ క్వెరీలు, క్లిక్ చేసిన యాడ్‌లు, వీడియోలు, ఇమేజ్‌లు, లింక్‌లను స్టోర్ చేస్తాయి. అయితే అన్నీ ట్రాక్ చేస్తాయని కాదిక్కడ. సోషల్ మీడియా వేదికల్లో ప్రైవసీ ఉంటుందని గుడ్డిగా నమ్మాల్సిన అవసరం లేదనే విషయాన్ని గుర్తించాలి. ఈమెయిల్‌లలో థర్డ్-పార్టీ కంపెనీలు/యాప్‌లు అంతర్లీనంగా ఉంటాయని నిపుణులు అంటున్నారు. ఎప్పుడు ఏం క్లిక్ చేశాం. ఏం ఓపెన్ చేశాం. ఏ డివైస్ ఉపయోగించాం విషయాలను మన స్థానాన్ని ట్రాక్ చేస్తాయి. యెల్ప్, టిండర్, స్నాప్‌చాట్ వంటివి యాప్‌లు ఇందుకు చక్కటి ఉదాహరణ. ఇవి లొకేషన్ యాక్సెస్ అడిగినప్పుడు ఏం అవుతుందిలే అని అందరూ యాక్సెస్ చేస్తుంటారు. కానీ అవి మనం ఎక్కడున్నామో తెలుసుకుంటాయి. కుకీలు సైట్‌లు మన మునుపటి విజిట్‌లు, ప్రాధాన్యతలు గుర్తుంచుకుని యాడ్‌లు టార్గెట్ చేస్తాయి. అయితే బ్రౌజర్‌లలో వీటిని డిసేబుల్ చేయవచ్చు కూడా.

## హ్యాకర్లు యాక్సెస్ చేయొచ్చు

మొబైల్ డివైస్‌లు సెన్సార్‌ల ద్వారా ఫిజికల్ ఉపయోగాలు లైట్, టెంపరేచర్ వంటి పర్యావరణ కారకాలు, కాల్ రికార్డులు, జీపీఎస్ ద్వారా లొకేషన్‌ను ట్రాక్ చేయడం వంటివి చేస్తాయి. పబ్లిక్ వై-ఫైలు అన్‌సెక్యూర్డ్‌గా ఉంటే హ్యాకర్లు మన డివైస్‌లను యాక్సెస్ చేసి సోషల్ సెక్యూరిటీ, క్రెడిట్ కార్డ్ వివరాలు తీసుకోవచ్చు. సర్వైలెన్స్ కెమెరాలు ప్రపంచవ్యాప్తంగా 245 మిలియన్లు ఇన్‌స్టాల్ అయి మానిటరింగ్ చేస్తున్నాయి. ఆన్‌లైన్ షాపింగ్ మన షాపింగ్ హ్యాబిట్‌ల ద్వారా వ్యక్తిగత సమాచారాన్ని రివీల్ చేసి టార్గెటెడ్ యాడ్‌లను ఆన్‌లైన్ వేదికల్లో ప్రదర్శిస్తుంది. హోమ్ డివైస్‌లు గూగుల్ హోమ్, అలెక్సా వంటివి క్వెరీలు, సంభాషణలను రికార్డ్ చేస్తాయి. వీటిని యాక్సెస్ చేసి డిలీట్ చేయవచ్చు. డిలీట్ చేయకుంటే ప్రైవసీ రిలేటెడ్ ఇష్యూస్ కూడా తలెత్తవచ్చు. మొత్తానికి ఆధునిక సాంకేతికతను ఉపయోగిస్తున్న ఈ రోజుల్లో ప్రైవసీ గురించి పెద్దగా పట్టింపులు లేకపోవడం, నార్మలైజ్ అనుకోవడం వంటి అభిప్రాయంతో ఉన్నవారికి సమస్య ఏం లేదు. ప్రతీ విషయాన్ని గోప్యతగా భావించేవారికి మాత్రం స్మార్ట్ ఫోన్లు, సోషల్ మీడియా వేదికలు కూడా భద్రతను కల్పించలేవమో!!

## మంథనిలో ఘనంగా మహాత్మా గాంధీ వర్ధంతి వేడుకలు....



మంథని రూరల్//**జనవరి 30 ఆకాంక్ష :** మంథని పట్టణంలో శుక్రవారం మహాత్మా గాంధీ వర్ధంతి వేడుకలను మంథని మండల అధ్యక్షులు ఆయిలి ప్రసాద్ ఆధ్వర్యంలో మంథని గాంధీ చౌక్ లో గల మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలవేసి కాంగ్రెస్ నాయకులు నివాళ్లు అర్పించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి నాయకులు ఆయిలి ప్రసాద్ మాట్లాడుతూ మహాత్మా గాంధీ గారు సత్యం,అహింసా మార్గంలో పోరాటం ప్రపంచవ్యాప్తంగా పౌర హక్కుల ఉద్యమాలకు స్ఫూర్తినిచ్చిందనీ అన్నారు.భారత ఆర్థిక వ్యవస్థ కోసం ఖాదీ, గ్రామీణ పరిశ్రమలను ప్రోత్సహించారు.బ్రిటిష్ పాలన నుండి భారతదేశానికి స్వాతంత్ర్యం తీసుకురావడంలో కీలక నాయకుడు, సామాజిక కార్యకర్త అని కొనియాడారు. బిజెపి ప్రభుత్వం మహాత్మా గాంధీ ఉపాధి హామీ పేరును లేకుండా చేస్తున్నారని ధ్వజం ఎత్తేరు. మా ప్రియతమ నాయకులు రాష్ట్ర మంత్రివర్యులు శ్రీ దుద్దిల్ల శ్రీధర్ బాబు సత్యం అహింసతో నేర్చుకోవాలని అదే బాటలో నడుస్తూ ప్రతి ఒక్కరికి హింస అనేది లేకుండా శాంతితో కూడుకున్న నైతిక విలువలతో ముందుకెళ్లాలని మన నాయకులు మాకు దిశా నిర్దేశం ఎప్పుడు చేస్తూ ఉంటారని శ్రీధర్ బాబు వారు గాంధీయవాది అని అన్నారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కుడుదుల వెంకన్న, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు సాధుల శ్రీకాంత్,టౌన్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు పెంటరి రాజు, ఎస్సీ సెల్ డివిజన్ అధ్యక్షులు మంథని సత్యం, బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కిషన్ జి, మాజీ ఎంపీపీ కొండా శంకర్, మాజీ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎరుకల ప్రవీణ్,జిల్లా మీడియా ఇంచార్జ్ అరెల్లి కిరణ్, బీసీ సెల్ టౌన్ అధ్యక్షులు బండారి ప్రసాద్ నాయకులు ఎల్లంకి వంశీ,మూల పురుషోత్తం రెడ్డి, సర్పంచ్ ఇసంపెల్లి లక్ష్మీ శ్రీనివాస్,మారుపాక నిహారిక, ఉట్ల అనిల్ రెడ్డి,మబ్బు తిరుపతి, ఎసన్, కొయ్యల దేవేందర్, విజయ్,సురేష్,కుమార్,ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, మహిళా కాంగ్రెస్ నాయకురాలు, అనుబంధ సంఘాల నాయకులు, అన్ని విభాగాల నాయకులు, కాంగ్రెస్ పార్టీ అభిమానులు పాల్గొన్నారు.

## గంగారం సబ్‌స్టేషన్‌లో

## అదనపు 3.15 ఎంవిఏ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు...

### విద్యుత్ సరఫరాలో శాశ్వత శ్రేణి...



నాగర్ కర్నూల్ టౌన్//**జనవరి 30 ఆకాంక్ష :** గంగారం సబ్‌స్టేషన్‌లో శుక్రవారం అదనంగా 3.15 ఎంవిఏ సామర్థ్య గల ట్రాన్స్‌ఫార్మర్ విజయవంతంగా ఏర్పాటు చేయబడింది. బిజినేపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ ఏఈ శ్రీనివాసచారి ప్రకారం, ఈ కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఇప్పటికే ఉన్న 5 ఎంవిఏ ట్రాన్స్‌ఫార్మర్‌కు తోడుగా పనిచేసి, పెరుగుతున్న విద్యుత్ అవసరాలను తీర్చడానికి దోహదపడుతుంది.సబ్‌స్టేషన్ పరిసర ప్రాంతాల్లో, ముఖ్యంగా గంగారం, వసురం తండా, పెద్దతాండ,కిమ్యతాండ గ్రామాలలో తరచుగా వోల్టేజ్ సమస్యలు, విద్యుత్ అంతరాయాలు ఎదురవుతున్నాయి. ఈ సమస్యలను స్థిరంగా పరిష్కరించేందుకు అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు.ఈ కొత్త సౌకర్యంతో, గ్రామాల రైతులు, గృహ వినియోగదారులు మెరుగైన విద్యుత్ సరఫరా పొందగలుగుతారు అని అధికారులు తెలిపారు. స్థానిక ప్రజలు విద్యుత్ శాఖ సిబ్బంది సమన్వయంతో పనులు పూర్తిచేయడం పట్ల సంతృప్తి వ్యక్తం చేసి, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ చర్యతో ప్రాంతీయ విద్యుత్ సరఫరా నాణ్యతలో ద్రూఢత, సామర్థ్యం పెరుగుతుందని విశ్లేషకులు అభిప్రాయపడ్డారు.

## ఆర్థిక ఇబ్బందులతో యువ రైతు ఆత్మహత్య...



జడ్చర్ల//**జనవరి 30 ఆకాంక్ష :** మహబూబ్ నగర్ జిల్లా మిడ్జిల్ మండలం వల్లభ రావుపల్లి గ్రామంలో ఆర్థిక సమస్యలతో బాధపడిన ఓ యువ రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకోవడం వలన గ్రామంలో విషాదం చేకూరింది. మృతుడు క్యాత పోగు ప్రశాంత్ (35), స్థానిక రైతుగా వ్యవహరిస్తుండగా, ఈ ఘోర ఘటన తన పొలంలో చోటుచేసుకుంది.పక్కనే పని చేస్తున్న ఇతర రైతులు ప్రశాంత్‌ను క్షణక్షణం గమనించి వెంటనే జడ్చర్ల గవర్నమెంట్ హాస్పిటల్‌కు తరలించడానికి ప్రయత్నించినప్పటికీ, మార్గమధ్యలో ఆయన మృతి చెందారు.గ్రామస్తుల తెలిపిన వివరాల ప్రకారం, మృతుడు కుటుంబం బాధలో మునిగిపోయింది. ఆయనకు భార్య, ఇద్దరు చిన్నపిల్లలు ఉన్నారు. సంఘటన తరువాత గ్రామంలో తీవ్ర స్థాయి విషాదం కొనసాగింది.ప్రమాద కారణాలు, ఆర్థిక ఇబ్బందుల స్వభావం, మరియు స్థానిక అధికారుల స్పందనపై మరింత వివరాలు సేకరించడం జరుగుతున్నది.

## వృద్ధాశ్రమం పరిశీలనలో సౌకర్యాలు, క్షేమం పై దృష్టి..



నాగర్ కర్నూల్ టౌన్// **జనవరి 30 ఆకాంక్ష :** జిల్లా న్యాయ సేవా సంస్థ (ఋూూా) నాగర్ కర్నూల్ ఆధ్వర్యంలో బిజినపల్లి గ్రామంలోని లుడ్డునగర్‌లోని ప్రశాంత నిలయం వృద్ధాశ్రమాన్ని శుక్రవారం డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ శ్రీదేవి పరిశీలించారు. రాష్ట్ర హైకోర్టు ఆదేశాల ప్రకారం నిర్వహించిన ఈ పరిశీలనలో వృద్ధుల సౌకర్యాలు, జీవనోన్నత అంశాలు పరిశీలించడం జరిగింది.ఈ సందర్భంగా శ్రీదేవి వృద్ధులతో మాట్లాడారు, వారి ఆరోగ్యం, యోగక్షేమాలను తెలుసుకున్నారు. వృద్ధులకు మెనూ ప్రకారం ఆహారం అందించబడుతున్నదా అనే విషయాన్ని సమీక్షించారు. వారిని ఉత్సాహ పరచడం కోసం వృద్ధులు పాడే పాటల్లో పాల్గొన్నారు. "జీవితంలో వృద్ధాప్యం చివరి దశ కాబట్టి, అందరూ సంతోషకరంగా, ఆహ్లాదకరంగా జీవించాలి" అని ఆయన పేర్కొన్నారు. వృద్ధుల అవసరాల విషయమై, "ఏమైనా సహాయం అవసరమైతే మా సంస్థ తరఫున అవసరమైన సహాయ సహకారాలు అందిస్తాము" అని గౌరవ సెక్రటరీ తెలిపారు. కార్యక్రమంలో వృద్ధులకు బిస్కట్ ప్యాకెట్లు, బన్నులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ రామ్ ఆర్య, డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్, ఆశ్రమ నిర్వాహకురాలు సిస్టర్ రవికుమారి, వృద్ధులు పాల్గొన్నారు. వృద్ధాశ్రమ పరిశీలన కార్యక్రమం ద్వారా వృద్ధుల క్షేమానికి ఋూూా సంస్థ ప్రత్యేక దృష్టి పెట్టడం, వారి జీవిత ప్రమాణాలను మెరుగుపరచడం లక్ష్యంగా ఉందని అధికారులు తెలిపారు.

## భూతగాదాలో దాయాదుల దాడి ఇద్దరి రిమాండ్..




నాగర్ కర్నూల్ టౌన్,**జనవరి 30 ఆకాంక్ష :** నాగర్ కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం కారుకొండ గ్రామంలో భూతగాదాలు, పాత కక్షల కారణంగా మమ్మద్ ఫయాజ్‌పై జరిగిన దారుణ దాడిలో ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్సై కే. శ్రీనివాస్ తెలిపారు, మహమ్మద్ ఖలీలుల్లా మరియు కలీముల్లా అనే నిందితులు మమ్మద్ ఫయాజ్‌ను పంట పొలంలో ఘాతుకరంగా దాడి చేసి తీవ్ర గాయాల పాలు చేశారు. ఈ ఘటనపై బాధితుడు, ఆయన భార్య రహిమునిస్ బేగం ఫిర్యాదు అందించిన నేపథ్యంలో పోలీసులు కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించారు.దాడిలో తీవ్ర గాయాల పడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మమ్మద్ ఫయాజ్ ఆరోగ్యం ప్రస్తుతం విషమంగా ఉందని కుటుంబీకులు తెలిపారు. పోలీసులు కేసు విచారణను వేగవంతం చేయడానికి చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

# 52వ డివిజన్ లో ప్రజా సేవకునిగా పతంగి రవి...





గోదావరిఖని//**జనవరి 30 ఆకాంక్ష :** రామగుండం కార్పొరేషన్ పరిధిలోని 52వ డివిజన్ లో ప్రజలలోని నమ్మకాన్ని పొంది 'అందరివాడి' పేరును సంపాదించిన పతంగి రవి ఈసారి కార్పొరేటర్ ఎన్నికల్లో బరిలో నిలిచారు. ఆయన తన అభ్యర్థిత్వాన్ని ప్రతిపాదిస్తూ, నిజమైన ప్రజా సేవకునిగా ప్రజల మధ్య ఉండే వ్యక్తిగా ప్రజలకు పరిచయం చేశారు. పతంగి రవి మాట్లాడుతూ, "నేను రాజకీయ నాయకుడు కాదు. నిత్య ప్రజా సేవకుని పాత్రలో, ప్రతి ఇంటికి చేరి సమస్యలను తెలుసుకుని పరిష్కారం చేయాలనుకుంటున్నాను. నా సేవలు మాటల్లో కాదు, పని చేయడం ద్వారా మాత్రమే ఉంటాయి. మీ ఇళ్లలో ఒక కుటుంబ సభ్యుడిలా, పిల్లవాడిలా, తమ్ముడిలా, కొడుకుల్లా, మీ ఏ సమస్య వచ్చినా నా సమక్షంలో పరిష్కారం పొందుతారు" అని తెలిపారు. 52వ డివిజన్ ప్రజలకు ఆయన ప్రత్యేకంగా వినతిచ్చారు. "నాకు ఇచ్చే ప్రతీ అవకాశం, ప్రతీ ఓటు ప్రజల సంక్షేమం కోసం ఉపయోగపడాలి. రాజకీయ కవాతు, మాటల పందుగ కాదు, నిజమైన సేవలే నా లక్ష్యం. మీరు నాకు ఇచ్చే ఆశీర్వాదం ద్వారా నేనూ మీ కోసం, మీ సమస్యల కోసం పనిచేస్తానని రవి అన్నారు. రవి అభ్యర్థిత్వం ప్రజలకు చేరిక కోసం వ్యక్తిగత పద్ధతిలో ప్రచారం చేస్తున్నారు. గ్రామాల వారీగా, వీధి వారీగా తిరిగి, ప్రతి కుటుంబాన్ని చేరి వారి సమస్యలను తెలుసుకుంటూ పరిష్కార మార్గాలను వివరిస్తున్నారు. "ప్రతి ఇంటి సమస్యను పరిష్కరించడానికి నేనుంటాను. మీరు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యలో సొంత వాడి వలె ఉండి సహకరిస్తాను. ఇది నా మాట కాదు, నా పని" అని ఆయన స్పష్టం చేశారు.రవి మాటల్లో కాదు, పని చూపే వ్యక్తిగా పేరు సంపాదించారు. చిన్నపాటి సమస్యల నుండి పెద్ద సమస్యల వరకు ప్రతి అంశంలో ప్రజలతో కలసి పని చేయడానికి సిద్ధంగా ఉన్నారని చెప్పారు. "ప్రజల కోసం, ప్రజల సౌలభ్యం కోసం, నా కృషి ఎప్పటికీ నిలిచేలా ఉంటుందని హామీ ఇస్తున్నాను. మీ ఆశీర్వాదం నాకు ప్రేరణ, నా పని పథం" అని రవి అభ్యర్థించారు.రాజకీయాలు మించి, నిజమైన ప్రజా సేవకులను ఎన్నుకోవాలని ఆయన అభ్యర్థించారు. ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కరించడమే అతని ప్రధాన లక్ష్యం. "ఎందుకు ఓటు వేస్తున్నారో, ప్రజలకు కనీసం నమ్మకం కలిగేలా, పని ద్వారా చూపించాలి. ప్రజలే నా బలమైన ఆధారం, ప్రజలే నా శక్తి" అని పతంగి రవి పేర్కొన్నారు.ప్రచారంలో రవి ప్రతిరోజూ కొత్త మైలురాళ్లను చేరుతున్నారు. ప్రతి గ్రామంలో ప్రత్యేకంగా సమావేశాలు నిర్వహిస్తూ, ప్రజలతో ప్రత్యక్షంగా చర్చలు జరుపుతున్నారు. "ప్రజల సమస్యలలో నేరుగా చేరి పరిష్కారం చూపడం, ప్రతి ఇంటి సమస్యకు స్పందించడం, నా లక్ష్యం. ప్రజల ఆపదలో నేనూ వారికి తోడుగా ఉండే వాడిని" అని అన్నారు. 52వ డివిజన్ ప్రజలకు రవి ఒక వినతిగా, ఆపద్బాంధవుడిగా, సేవకుడిగా నిలిచే హామీ ఇచ్చారు.ప్రతీ ఇంటికి చేరి సమస్యలను తెలుసుకొని పరిష్కారం చేయడం నా విధానం. నా సేవలు మాటల్లో కాదు, పనిచేసే పని ద్వారా ఉంటాయి. నా ఉద్దేశ్యం ప్రజల సంక్షేమం" అని రవి స్పష్టం చేశారు. రవి ప్రచారం నేటి రోజు ప్రారంభించగా, గ్రామాల వారీగా, వీధి వారీగా ప్రజల సమస్యలను తెలుసుకుంటూ, వాటిని పరిష్కరించడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నారు. "ప్రజలకోసం, వారి సమస్యల పరిష్కారానికి నేను ప్రతిరోజూ ప్రయత్నిస్తా. నా సేవలు ప్రజల కోసం మాత్రమే" అని ఆయన అన్నారు. 52వ డివిజన్ లోని ప్రతి కుటుంబానికి చేరి, సమస్యలు తెలుసుకుని, ప్రతి సమస్యకు పరిష్కారం చూపడం రవి ప్రధాన ఉద్దేశ్యం. "ప్రజల వాణి, ప్రజల ఆశీర్వాదం, నా ప్రేరణ. ప్రజల సమస్యల పరిష్కారం, నా కృషి. ఇది మాటల్లో కాదు, పని ద్వారా చూపించాలి" అని రవి అభ్యర్థించారు.



రవి మానవీయ విలువలను, ప్రజా సేవా విలువలను ముందుకు పెట్టి, రాజకీయాలను దాటివేయాలని ప్రతిపాదిస్తున్నారు. "ప్రజల కోసం నిజమైన సేవ, రాజకీయాల పైకి కాదు. మీరు నా నిబద్ధతను నమ్మి, నన్ను కార్పొరేటర్ గా ఆమోదిస్తే, ప్రతి సమస్యకు పరిష్కారం చూపుతాను. నా సేవలు మాటల్లో కాదు, ప్రతిదీ పని ద్వారా" అని ఆయన హామీ ఇచ్చారు. 52వ డివిజన్ ప్రజలకు పతంగి రవి చేసే విన్నపం స్పష్టంగా ఉంది: "ప్రజల సమస్యల పరిష్కారం కోసం మీ ఆశీర్వాదం, ఓటు, నా ప్రేరణ. నేను ప్రతిరోజూ మీ మధ్య ఉండి, సేవ చేస్తాను. నా పని మాత్రమే, మాటలు కాదు. ప్రజల సంక్షేమం నా కర్తవ్యం" అని రవి తెలిపారు.రవి ప్రచారం సమయం మొత్తం ప్రజల మధ్య నేరుగా ఉండి, వారి సమస్యలను తెలుసుకొని, పరిష్కారం చూపేందుకు కృషి చేస్తున్నారు. ప్రతీ ఇంటికి చేరి, ప్రతీ సమస్యకు స్పందించడం రవి ప్రధాన లక్ష్యం. "ప్రజలకోసం, ప్రజల సంక్షేమం కోసం, నేను ఎల్లప్పుడూ కృషి చేస్తా. నా సేవలు మాటల్లో కాదు, పనిచేసే పని ద్వారా ఉంటాయి. ఇది నా విన్నపం, నా హామీ" అని రవి పేర్కొన్నారు.

## నాగర్ కర్నూల్ మునిసిపాలిటీలో నామినేషన్ల పర్వం...

### 224 అభ్యర్థులు బరిలో

నాగర్ కర్నూల్ టౌన్//**జనవరి 30 ఆకాంక్ష :** నాగర్ కర్నూల్ మునిసిపాలిటీలోని 24 వార్డుల పరిధిలో మునిసిపాలిటీ ఎన్నికలకు నామినేషన్ల పర్వం శనివారం ముగిసింది. మొత్తం 224 మంది అభ్యర్థులు నామినేషన్లను దాఖలు చేసినట్లు ఎన్నికల కమిషన్ వెల్లడించింది.పార్టీల వారీగా నామినేషన్ల సంఖ్య ఇలా ఉంది: కాంగ్రెస్ 114, బీఆర్ఎస్ 59, బీజేపీ 30, బీఎస్పీ 8, జనసేన 1, ఫార్వర్డ్ బ్లాక్ 1, టీఆర్పీ 3, సీపీఐ 1, సీపీఎం 1, బీఎం = పీ 4, ఇండిపెండెంట్లు 45. ఎన్నికల కమిషన్ ప్రకారం, నామినేషన్ల ధ్రువీకరణ పూర్తయిన తరువాత మాత్రమే తుది జాబితా ప్రకటించబడుతుంది.

## జాతి కోసం నిలబడి కొట్లాడిన వీరవనితలు.. సమ్మక్క, సారలమ్మలు...

### గోవింద రాజు, పడిగిద్ద రాజుల వంశంలో గొప్ప సైనికులు..

### తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత...



మేడారం//**జనవరి 30 ఆకాంక్ష :** జాతి కోసం నిలబడి కొట్లాడిన వీరవనితలు.. సమ్మక్క, సారలమ్మలని గోవింద రాజు, పడిగిద్ద రాజుల వంశంలో గొప్ప సైనికులు అని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత పేర్కొన్నారు.శుక్రవారం సమ్మక్క, సారలమ్మలను దర్శించుకున్న తర్వాత మీడియాతో మాట్లాడారు.తెలంగాణ ప్రజలు బాగుండాలని సమ్మక్క, సారలమ్మలను కోరుకోవటం జరిగింది.కాకతీయుల వంటి రాజులతో కొట్లాడిన వనదేవతలు సమ్మక్క, సారలమ్మలు. వారి జాతి కోసం నిలబడి కొట్లాడిన వీరవనితలు. గోవింద రాజు, పడిగిద్ద రాజుల వంశంలో గొప్ప సైనికులు. అని కొనియాడారు.వారి స్ఫూర్తితోనే మేము తెలంగాణ ప్రజల కోసం పోరాటం చేస్తాం. తెలంగాణ వచ్చిన 12 ఏళ్ల తర్వాత కూడా నీళ్లు, నిధులు, నియామకాలు అందని పరిస్థితి ఉంది. సామాజిక న్యాయం అందరికీ ఇప్పటికీ దక్కలేదు. ఈ పరిస్థితి పోయేలా మేము జాగృతి తరఫున మా వంతు కృషి చేస్తామన్నారు.

## తెలంగాణ ఎప్‌సెట్ షెడ్యూల్ విడుదల..

### ఫిబ్రవరి 19 నుంచి దరఖాస్తులు..




హైదరాబాద్//**జనవరి 30 ఆకాంక్ష :** తెలంగాణ ఎప్‌సెట్ షెడ్యూల్ విడుదలైంది. ఈ షెడ్యూల్ ప్రకారం ఫిబ్రవరి 19 నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. దరఖాస్తుల స్వీకరణకు ఏప్రిల్ 4 చివరి తేదీ. జేఎన్‌టీయూ ఆధ్వర్యంలో మే 4 నుంచి 11 వరకు ఎప్‌సెట్ పరీక్షలు జరగనున్నాయి.తెలంగాణలోని కాలేజీల్లో 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మా కోర్సుల్లో ఈ పరీక్ష ద్వారా ప్రవేశాలు కల్పించనున్నారు. ప్రతి ఏడాది ఈ పరీక్షలు జరుగుతాయి.

## బర్గమ్ భార్య చాలా అందంగా ఉంటుంది ..

### అందుకే ఆయనకు పదవి ఇచ్చా...

### వివాదాస్పదంగా మారిన ట్రంప్ చేసిన వ్యాఖ్యలు...



న్యూఢిల్లీ **జనవరి 30 ఆకాంక్ష :** అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు వివాదాస్పదంగా మారాయి. యూఎస్ అంతర్గత వ్యవహారాల శాఖ మంత్రిగా డగ్ బర్గమ్‌ను ట్రంప్ నియమించారు. అయితే బర్గమ్ భార్య చాలా అందంగా ఉంటుందని.. అందుకే ఆయనకు పదవి ఇచ్చానని ట్రంప్ ఈ సందర్భంగా వెల్లడించారు. ఈ వ్యాఖ్యలు చేసిన సమయంలో బర్గమ్ భార్య కేథరిన్ అక్కడే ఉండటం గమనార్హం. బర్గమ్ నియామకంపై ట్రంప్ చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు తీవ్ర విమర్శలకు దారితీశాయి.మాదక ద్రవ్యాల కట్టడి లక్ష్యంగా ఓ కార్యనిర్వాహక ఉత్తర్వులపై గురువారం (స్థానిక కాలమాన ప్రకారం) ట్రంప్ సంతకాలు చేశారు. ఓవల్ ఆఫీసులో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో దానికి సంబంధించిన వివరాలను ట్రంప్ వెల్లడించారు. ఈ సందర్భంగా బర్గమ్‌ను అంతర్గ వ్యవహారాల శాఖ మంత్రిగా నియమించడం వెనుక గల కారణాన్ని వివరించారు. ఎన్నికల ప్రచార వీడియోలో బర్గమ్ దంపతులు గుర్రపు స్వారీ చేస్తున్న దృశ్యాన్ని చూశానని ట్రంప్ తెలిపారు. అందులో ముందుగా బర్గమ్ భార్య కేథరిన్ తన కంటపడిందని చెప్పారు. అందులో ఆమె చాలా అందంగా, ఆకర్షణీయంగా కనిపించారని అన్నారు. 'ఆ వీడియో చూసి వెంటనే ఎవరు అని అడిగాను.. అది ఆయన గురించి కాదు.. ఆమె గురించే ' అని వ్యాఖ్యానించారు. అనంతరం తన సహాయకులు దంపతుల వివరాలు చెప్పారని అన్నారు. అప్పుడే బర్గమ్‌ను తన కేబినెట్‌లోకి తీసుకోవాలని నిర్ణయించుకున్నానని తెలిపారు."మీలా ఒక వ్యక్తికి జీవిత భాగస్వామిగా ఉండటం చాలా గొప్ప విషయం." అని నియామకం సందర్భంగా బర్గమ్‌ను ట్రంప్ ప్రశంసించారు. అయితే బర్గమ్ వ్యాపారవేత్తగా, నార్త్ డకోటా రాష్ట్రానికి రెండుసార్లు గవర్నర్‌గా సేవలందించారు. వీటిపై బర్గమ్‌ను ట్రంప్ ప్రశంసించినప్పటికీ, ఆయన విజయాల్లో భార్య పాత్రే ఎక్కువ ఉందని పదే పదే ప్రస్తావించడం ఇప్పుడు విమర్శలకు దారి తీసింది.

# సీపీఆర్‌పై.. అవగాహన అవసరం!



నేటి సమాజంలో హార్ట్ అటాక్ అనేది వృద్ధులకు మాత్రమే పరిమితమైన సమస్య కాదు. యువత, మధ్య వయసువారు, పిల్లలు కూడా అకస్మాత్తుగా గుండెపోటుకు గురవుతున్న ఘటనలు రోజురోజుకు పెరుగుతున్నాయి.. ఇది కేవలం వైద్య సమస్య కాదు. ఇది ఒక సామాజిక అత్యవసర సమస్యగా మారింది. వైద్య నిపుణులు చెప్పే దాని ప్రకారం హార్ట్ అటాక్ వచ్చిన వెంటనే సరైన సమయంలో సీపీఆర్ (కార్డియో పల్మనరీ రెసస్కిటేషన్) చేయగలిగితే ప్రాణాలు కాపాడే అవకాశాలు చాలా ఎక్కువ.. సీపీఆర్‌పై.. అవగాహన అవసరం! నేటి సమాజంలో హార్ట్ అటాక్ అనేది వృద్ధులకు మాత్రమే పరిమితమైన సమస్య కాదు. యువత, మధ్య వయసువారు, పిల్లలు కూడా అకస్మాత్తుగా గుండెపోటుకు గురవుతున్న ఘటనలు రోజురోజుకు పెరుగుతున్నాయి.. ఇది కేవలం వైద్య సమస్య కాదు. ఇది ఒక సామాజిక అత్యవసర సమస్యగా మారింది. వైద్య నిపుణులు చెప్పే దాని ప్రకారం హార్ట్ అటాక్ వచ్చిన వెంటనే సరైన సమయంలో సీపీఆర్ (కార్డియో పల్మనరీ రెసస్కిటేషన్) చేయగలిగితే ప్రాణాలు కాపాడే అవకాశాలు చాలా ఎక్కువ..

### ఇంత బాధ్యతా రాహిత్యమా

సీపీఆర్ అనేది గుండెపోటు లేదా శ్వాస ఆగిపోయిన అత్య వసర స్థితిలో ప్రాణాలను రక్షించే ప్రాథమిక వైద్య ప్రక్రియ కానీ దురదృష్టవశాత్తు, మన సమాజంలో సీపీఆర్‌పై అవగాహన చాలా తక్కువగా ఉంది. ఎవరైనా కుప్పకూలినప్పుడు ప్రజలు సహాయం చేయకుండా భయంతో, అయోమయంలో నిలబడిపోతున్నారు. కొందరు వీడియోలు తీయడంలో నిమగ్నమవు తున్నారు. మరికొందరు 'ఏం చేయాలో తెలియదు' అంటూ విలువైన నిమిషాలను వృథా చేస్తున్నారు.. ఈ నిర్లక్ష్యమే అనేక ప్రాణ నష్టాలకు కారణమవుతోంది.

### గోల్డెన్ అవర్.. ప్రాణరక్షణ సమయం..

హార్ట్ అటాక్ తర్వాత మొదటి ఒక గంటను వైద్యులు "గోల్డెన్ అవర్"గా పేర్కొంటారు. ఈ కీలక సమయంలో సీపీఆర్ ప్రారంభమైతే, వెంటనే హాస్పిటల్‌కు తరలిస్తే, బాధితుడు మళ్లీ సాధా రణ జీవితానికి చేరుకునే అవకాశముంది. కానీ అవగాహన లేనందున ఆ గోల్డెన్ అవర్ మన చేతుల మధ్యనే జారిపోతోంది. సీపీఆర్ అవసరం కేవలం హార్ట్ అటాక్‌లకే పరిమితం కాదు.. వైద్య నిపుణుల ప్రకారం, కరెంట్ షాక్ తగిలి వ్యక్తి స్పృహ కోల్పోయి శ్వాస ఆగిపోయిన పరిస్థితిలో, పరిసరాలు సురక్షితంగా ఉన్నట్లయితే సీపీఆర్ చేయవచ్చు.. అయితే ముందుగా విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిపివేయడం అత్యంత ముఖ్యం.

### సీపీఆర్ ఎలా చేయాలి..

ప్రతి ఒక్కరూ తెలుసుకోవాల్సిన ముఖ్యమైన స్టెప్స్. ఎవరైనా అకస్మాత్తుగా కుప్పకూలితే ఈ విధంగా చేయాలి. స్పందన ఉందా లేదా చూడాలి. వ్యక్తిని పిలిచి, భుజాన్ని మెల్లగా కదిలించి స్పందిస్తున్నాడా చూడాలి. శ్వాస ఉందా లేదా పరిశీలించాలి. ఛాతీ కదులుతోందా శ్వాస వస్తోందా..? లేకపోతే వెంటనే చర్య తీసుకోవాలి. వెంటనే అంబులెన్స్‌కు ఫోన్ చేయాలి.. ఇది అత్యంత కీలకమైన దశ. ఛాతిపై ఒత్తిడి ఇవ్వాలి. బాధితుడిని సమానంగా ఉన్న నేలపై పడుకోబెట్టాలి. ఛాతి మధ్యభాగంపై రెండు చేతులు ఉంచి నిమిషానికి సుమారు 100120 సార్లు 56 సెం.మీ లోతుగా ఒత్తిడి ఇస్తూ ఆపకుండా కొనసాగించాలి. శ్వాస ఇచ్చే పద్ధతి తెలిసి ఉంటే మాత్రమే ఇవ్వాలి.. తెలియని వారు కేవలం ఛాతి ఒత్తిడినే కొనసాగించినా సరిపోతుంది.

### అవగాహన ఉద్యమంగా మారాలి!

ఇక్కడ ప్రభుత్వ వ్యవస్థ బాధ్యత మరింత అవసరం. పోలీస్ శాఖ, ఆరోగ్య శాఖ కలిసి సీపీఆర్‌పై విస్తృత అవగాహన కార్య క్రమాలు చేపట్టాలి.. పాఠశాలలు, కళాశాలలు, గ్రామ సభలు, బస్టాండ్‌లు, కార్యాలయాలు వంటి ప్రజలు ఎక్కువగా చేరే ప్రాంతాల్లో ప్రాక్టికల్ శిక్షణ ఇవ్వాలి. సీపీఆర్ అనేది డాక్టర్లకే కాదు, ప్రతి సాధారణ పౌరుడికీ తెలిసి ఉండాల్సిన మౌలిక జీవన నైపుణ్యంగా మారాలి. ఇది ఖర్చుతో కూడిన కార్యక్రమం కాదు. కానీ దీని వల్ల లభించే ఫలితం అమూల్యమైనది ఒక మనిషి ప్రాణం. ప్రభుత్వం మాత్రమే కాదు.. మీడియా, స్వచ్ఛంద సంస్థలు, ఉపాధ్యాయులు, సామాజిక కార్యకర్తలు అందరూ కలిసి సీపీఆర్ అవగాహనను ఉద్యమంలా ప్రజల్లోకి తీసుకెళ్లాలి. సీపీఆర్ ఒక జీవన రక్షణ విద్య. ఇప్పుడు నేర్చుకోకపోతే తర్వాత పశ్చాత్తాపమే మిగులుతుంది.

## ఈ సారి అసెంబ్లీలో! వెలుగులోకి

## జనసేన ఎమ్మెల్యే అరవ శ్రీధర్ మరో వీడియో

### జనసేన పార్టీకి చెందిన రైల్వే కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్‌పై వస్తున్న ఆరోపణల పరంపరలో మరో సంచలన అంశం తెరపైకి వచ్చింది.

జనసేన పార్టీకి చెందిన రైల్వే కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్‌పై వస్తున్న ఆరోపణల పరంపరలో మరో సంచలన అంశం తెరపైకి వచ్చింది. తాజాగా మరో వీడియో వెలుగులోకి వచ్చింది. ఎమ్మెల్యే అరవ శ్రీధర్‌కు సంబంధించి లైంగిక ఆరోపణలు చేసిన ప్రభుత్వ మహిళా ఉద్యోగి వీణ రోజుకో వీడియో, చాటింగ్ విడుదల చేస్తున్నట్లు తెలుస్తోంది. అసెంబ్లీలో ఉన్న సమయంలోనే ఎమ్మెల్యే శ్రీధర్, వీణ మధ్య వీడియో కాల్, చాటింగ్ వ్యవహారం నడిచినట్లు తెలుస్తోంది. ఈ వీడియో వైరల్ కావడంతో నెటిజన్లు స్పందించారు. అసెంబ్లీలో ఉన్న సమయంలో వీడియో కాల్, చాట్ చేయడం ఏమిటని ఎమ్మెల్యేను ప్రశ్నించారు. ఇప్పటికే వీడియో కాల్స్‌కు సంబంధించిన క్లిప్పింగులు బయటకు రావడంతో ఇరకాటంలో ఉన్న ఎమ్మెల్యేకు, ఈ తాజా వీడియో మరింత తలనొప్పిగా మారింది. వీణ చేస్తున్న ఆరోపణలతో రాజకీయ వర్గాల్లోనూ, సామాజిక మాధ్యమాల్లోనూ ఈ వ్యవహారంపై తీవ్ర చర్చ నడుస్తోంది. కావాలనే తనపై దుష్ప్రచారం చేస్తున్నారని రైల్వే కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ ఈ అంశాన్ని ఖండిస్తున్న విషయం విదితమే.

# కాలేయ ఆరోగ్యం దెబ్బతింటే మొత్తం శరీర ఆరోగ్యం దెబ్బతింటుంది....

### ఆకలి తగ్గడంతో పాటు శరీర బరువు కూడా తగ్గుతుంది...



హైదరాబాద్//**జనవరి 30 ఆకాంక్ష :** మన శరీరంలో కాలేయం అనేక విధులను నిర్వర్తిస్తుంది. కాలేయ ఆరోగ్యం దెబ్బతింటే మొత్తం శరీర ఆరోగ్యం దెబ్బతింటుంది. కాలేయం తన విధులను సక్రమంగా నిర్వర్తించకపోతే మనం తీవ్ర అనారోగ్యానికి గురి కావాల్సి వస్తుంది. కనుక కాలేయ ఆరోగ్యాన్ని కాపాడుకోవడం చాలా అవసరం. కాలేయ ఆరోగ్యం దెబ్బతినడం వల్ల కళ్లు, గోళ్లు పసుపు రంగులోకి మారిపోతాయని చాలా మంది అనుకుంటారు. కానీ ఇలాంటి స్పష్టమైన లక్షణాలు ఎప్పుడూ కనిపించవు. మనం గుర్తించలేని కొన్ని లక్షణాలను కూడా కాలేయం కనబరుస్తూ ఉంటుంది. ఈ లక్షణాలను గుర్తించడం వల్ల మనం సమస్య మరింత తీవ్రతరం కాకుండా కాపాడుకోవచ్చు. దీంతో కాలేయ ఆరోగ్యం దెబ్బతినకుండా ఉంటుంది. కాలేయ సమస్యలను సూచించే కొన్ని లక్షణాల గురించి తెలుసుకుందాం.

#### అలసట, నొప్పి....

తగినంత విశ్రాంతి తీసుకున్నప్పటికి అలసటగా ఉన్నట్లయితే కాలేయం సమస్యలో ఉందని అర్థం చేసుకోవాలి. మన శరీర జీవక్రియలో కాలేయం ముఖ్యపాత్ర పోషిస్తుంది. కాలేయ ఆరోగ్యం దెబ్బతినడం వల్ల శక్తిని సరిగ్గా నిర్వహించలేదు. దీంతో మనకు ఎల్లప్పుడూ అలసటగా ఉన్నట్టు ఉంటుంది. కాలేయ ఆరోగ్యం దెబ్బతిన్నట్లయితే ఆకలి తగ్గడంతో పాటు శరీర బరువు కూడా తగ్గుతుంది. అంతేకాకుండా జీర్ణక్రియ పోషకాలను సరిగ్గా గ్రహించలేకపోతుంది అనడానికి ఇది ఒక సంకేతం. కాలేయ ఆరోగ్యం దెబ్బతిన్నప్పుడు కాలేయం ఉన్నచోట అనగా ఉదరం కుడి ఎగువ భాగంలో నొప్పి లేదా మంటగా ఉంటుంది, కాలేయం వాపుకు గురి అవుతుంది. కాలేయ ఆరోగ్యం దెబ్బతిన్నప్పుడు అది బిలిరుబిన్ అనే పదార్థాన్ని విచ్చినం చేయలేకపోతుంది. దీంతో చర్మం, కళ్లు పసుపు రంగులోకి మారతాయి. ఇటువంటి లక్షణాన్ని గుర్తించిన వెంటనే ఆలస్యం చేయకుండా వైద్యుడిని సంప్రదించడం మంచిది.

#### చర్మ సమస్యలు....

కాలేయ పనితీరు సరిగ్గా లేనప్పుడు చర్మం దురదగా ఉంటుంది. కాలేయం పనితీరు మందగించడం వల్ల రక్తం ద్వారా విష పదార్థాలు బయటకు తొలగించబడవు. దీంతో చర్మం కింద ఆ విషపదార్థాలు పేరుకుపోయి దురదకు కారణమవుతాయి. కాళ్లు, పొత్తి కడుపులో ద్రవం పేరుకుపోవడం కూడా కాలేయం సరిగ్గా పనిచేయడం లేదని తెలియజేసే ఒక సంకేతమే. అదే విధంగా మలం, మూత్రం రంగుల్లో మార్పు రావడం వంటి లక్షణాలు కాలేయ ఒత్తిడిని తెలియజేస్తాయి. ఈవిధమైన లక్షణాలు కనిపించిన వెంటనే నిర్లక్ష్యం చేయకూడదు. వైద్యుడిని సంప్రదించి ఇవి కాలేయం దెబ్బతినడం వల్ల తలెత్తిన సమస్యలా లేదా మరేదైనా అనారోగ్య సమస్యలకు సంకేతాలా అని నిర్ధారణ చేసుకుని తగిన చికిత్స తీసుకోవాలి. సమస్య ఏదైనా త్వరగా గుర్తించినప్పుడే మనం కాలేయ ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. ఈ లక్షణాలను అస్సలు నిర్లక్ష్యం చేయకూడదు. కొన్నిసార్లు ఇవి ప్రాణాంతకంగా మారే అవకాశం కూడా ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

## ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌లపై స్పీకర్ విచారణ...



హైదరాబాద్//**జనవరి30 ఆకాంక్ష :** ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై స్పీకర్ గడ్డం ప్రసాద్ విచారణ ప్రారంభించారు. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై బీఆర్ఎస్ దాఖలు చేసిన అనర్హత పిటిషన్‌పై ఆయన విచారణ చేపట్టారు. బీఆర్ఎస్ నేత పాడి కౌశిక్ రెడ్డి, బీజేపీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఇతరులు వేసిన అనర్హత పిటిషన్లపై విచారణ కొనసాగుతున్నది.పిటిషనర్ల వాదనలు విన్న తర్వాత స్పీకర్ సాక్ష్యాలను నమోదు చేయనున్నారు. స్పీకర్ సుప్రీంకోర్టు ఆదేశాలతో ఈ విచారణ చేపట్టారు. పెండింగ్‌లో ఉన్న మూడు అనర్హత పిటిషన్లపై సుప్రీంకోర్టు గతంలోనే వివరణ కోరింది. విచారణ జరిపి రెండు వారాల్లో నివేదిక ఇవ్వాలని స్పీకర్‌ను ఆదేశించింది. ఈ క్రమంలో పెండింగ్ పిటిషన్‌లపై స్పీకర్ విచారణ జరుపుతున్నారు. విచారణ అనంతరం స్పీకర్ కార్యాలయం సుప్రీంకోర్టుకు నివేదిక సమర్పించనుంది.

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దగ్ధం....



తుంగతుర్తి//**జనవరి30 ఆకాంక్ష :** కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర స్థాధకుడు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై కక్ష సాధింపు చర్యతో సిట్ నోటీసులు ఇవ్వడాన్ని నిరసిస్తూ శుక్రవారం తుంగతుర్తి మండల కేంద్రంలోని మెయిన్ రోడ్ పై బీఆర్ఎస్ నాయకులు ఆందోళన చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ పార్టీ నాయకులపై కక్ష సాధింపులకు పాల్పడుతోందని, అందులో భాగంగానే మొన్న హరీష్ రావుకు, నిన్న కేటీఆర్ కు, నేడు కేసీఆర్ కు ఫోన్ టాపింగ్ కేసులో నోటీసులు పంపిస్తుందని విమర్శించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని, ప్రజల దృష్టి మళ్లించడానికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇలాంటి కుట్రలకు తెరలేపుతుందని మండిపడ్డారు.ఇకనైనా పరిపాలన మీద సోది తెచ్చుకోవాలని, లేకపోతే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకులు గుండగాని రాములుగౌడ్, మట్టిపెల్లి శ్రీశైలం, దొంగరి శ్రీనివాస్, సర్పంచులు శ్రీనివాస్ రెడ్డి, మనోజ్, రమేష్, కరుణాకర్, మండల నాయకులు మల్యాల రాములు, గుడిపాటి వీరయ్య, కడారి దాసు, గోపగాని రమేష్, మట్టిపెల్లి వెంకట్, సోమేశ్, యాకూబ్, గునిగంటి యాదగిరి, తునికి లక్ష్మి, గోపగాని శ్రీనివాస్, బొజ్జ సాయికిరణ్ వెంకటేష్, మల్లేష్, భాస్కర్, మహేందర్, వెంకన్న పాల్గొన్నారు.

## బాధితులకు పరిహారం విషయంలో రాష్ట్ర ప్రభుత్వం తీరుపై హైకోర్టు అసహనం...



హైదరాబాద్//**జనవరి30 ఆకాంక్ష :**సిగాచి ప్రమాద బాధితులకు పరిహారం విషయంలో రాష్ట్ర ప్రభుత్వం తీరుపై తెలంగాణ హైకోర్టు మరోసారి అసహనం వ్యక్తంచేసింది. గత ఏడాది సంగారెడ్డి జిల్లా పాశమైలారంలోని సిగాచి ఫార్మా కంపెనీలో పేలుడు సంభవించిన ఘటనలో 56 మంది దుర్మరణం పాలయ్యారు. మరో 8 మంది ఆచూకీ లభ్యం కాలేదు. ఇంకో 28 మంది క్షతగాత్రులయ్యారు.ఆ మరణించిన 56 మందికి, ఆచూకీ లభించని 8 మందికి, 28 మంది క్షతగాత్రులకు పరిహారం అందించాలని, ప్రమాదంపై దర్యాప్తు కోసం సిట్ ఏర్పాటు చేయాలని బాబూరావు అనే వ్యక్తి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ జరుపుతూ.. 'పరిహారం ఎంత ఇస్తామని చెప్పారు..? ఎంత ఇస్తున్నారు..?' ఎప్పుడు ఇస్తారు..?' అంటూ న్యాయమూర్తి ఒకింత ఆగ్రహంతో ప్రశ్నించారు.పరిహారం పంపిణీకి సంబంధించిన అంశాలపై కంపెనీ వివరణ ఇవ్వాలని, దానికి సంబంధించిన వివరాలను తెలియజేయాలని, ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. కంపెనీ ప్రకటించిన పరిహారంతోపాటు, చట్టప్రకారం అందాల్సిన పరిహార వివరాలను సమర్పించాలని ఈపీఎఫ్ హైదరాబాద్ రీజనల్ కమిషనర్, ఈఎస్ఐ డైరెక్టర్, రాష్ట్ర బీమా నియంత్రణ మండళ్లను సుమోటో ప్రతివాదులుగా చేర్చి హైకోర్టు చీఫ్ జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ నోటీసులు ఇచ్చారు.

## ఫిబ్రవరి నెలలో 50 ఎకరాల ఆయిల్ ఫామ్ ప్లాంటేషన్ పూర్తి కావాలి...

### ట్రాక్టర్ పై ప్రయాణిస్తూ... క్షేత్రస్థాయిలో పంట పొలాల పరిశీలన...

### ఆయిల్ ఫామ్ పంట పొలాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించిన జిల్లా కలెక్టర్...



పెద్దపల్లి//**జనవరి30 ఆకాంక్ష :**ఫిబ్రవరి నెలలో 50 ఎకరాల ఆయిల్ ఫామ్ ప్లాంటేషన్ పూర్తి కావాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పెద్దపల్లి మండలం రంగాపూర్, గట్టి సింగారం గ్రామాలలో రవీందర్ రెడ్డి అనే రైతు నూతనంగా సాగు చేస్తున్న ఆయిల్ ఫామ్ పంట పొలాలను ట్రాక్టర్ పై ప్రయాణిస్తూ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ.. రంగాపూర్, గట్టి సింగారం గ్రామాలలో రైతులందరూ కలిసి 100 ఎకరాల వరకు ఆయిల్ ఫామ్ సాగుకు ముందుకు వచ్చారని తెలిపారు. ఆయిల్ ఫామ్ పంట ప్రోత్సహించేందుకు ఇక్కడ గుట్ట పై విద్యుత్ సరఫరా నిమిత్తం 9 లక్షల రూపాయలు కలెక్టర్ నుంచి కేటాయించి పనులు పూర్తి చేసామని కలెక్టర్ పేర్కొన్నారు. ఫిబ్రవరి నెలలో 50 ఎకరాలలో ఆయిల్ మొక్కల నాటే పనులు పూర్తి కావాలని కలెక్టర్ సంబంధిత అధికారులకు సూచించారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట జిల్లా హార్టికల్చర్ అధికారి జగన్ మోహన్ రెడ్డి, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## బాలికల గురుకులంలో స్పర్శ్ కుష్టు నిర్మూలన అవగాహన కార్యక్రమం....



పెద్దపల్లి టౌన్//**జనవరి30 ఆకాంక్ష :**పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని తెలంగాణ మహాత్మా జ్యోతిబా పూలే బీసీ బాలికల గురుకుల పాఠశాలలో స్పర్శ్ లెప్రసీ అవేర్‌నెస్ క్యాంపెయిన్ (రూజా) జాతీయ కుష్టు నిర్మూలన అవగాహన కార్యక్రమాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె. ప్రమోద్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కుష్టు వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.ఈ సందర్భంగా డాక్టర్ కె. ప్రమోద్ కుమార్ మాట్లాడుతూ మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా ప్రతి సంవత్సరం జాతీయ కుష్టు నిర్మూలన దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ నెల 30వ తేదీ నుంచి ఫిబ్రవరి 13వ తేదీ వరకు జిల్లావ్యాప్తంగా విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమాల్లో డీపీఎంఓలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, సూపర్వైజర్లు పాల్గొని ప్రజల్లో కుష్టు వ్యాధిపై అవగాహన కల్పిస్తారని తెలిపారు. అలాగే అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో యూత్ సంఘాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, డ్వాక్రా గ్రూపుల మహిళలను భాగస్వాములుగా చేసి ప్రతిజ్ఞలు చేయించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. శరీరంపై స్పర్శ లేని రాగి లేదా గోధుమ రంగు మచ్చలు కనిపించిన వెంటనే సమీపంలోని ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు. కుష్టు వ్యాధిని ప్రాథమిక దశలో గుర్తించి పూర్తి చికిత్స తీసుకుంటే పూర్తిగా నయం అవుతుందని, నిర్లక్ష్యం చేస్తే అంగవైకల్యం ఏర్పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు డాక్టర్ బి. శ్రీరాములు, డిప్యూటీ పారా మెడికల్ అధికారులు కె. రమేష్, బి. దేవి సింగ్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఉమా మహేశ్వర్, ఎంపీహెచ్ఈఓ రాజేష్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, పాఠశాల ప్రిన్సిపాల్ దీప్తి, అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## నామినేషన్ల జాతర..! కేంద్రాల వద్ద పోటెత్తిన జనాలు...

### ముందు నామినేషన్.. ఆ తర్వాత బీఫారం ఉత్కంఠ...



గోదావరిఖని//**జనవరి30 ఆకాంక్ష** :పెద్దపల్లి జిల్లాలో మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల నామినేషన్ ప్రక్రియ శుక్రవారం జాతరను తలపించింది. సుల్తానాబాద్, పెద్దపల్లి, మంథని మున్సిపాలిటీలతో పాటు రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నామినేషన్ల సేకరణకు ఏర్పాటుచేసిన కేంద్రాల వద్ద ఉదయం నుంచే భారీగా జనాలు తరలివచ్చారు. రాజకీయ పార్టీల అభ్యర్థులు, స్వతంత్ర అభ్యర్థులు తమ అనుచరులతో కలిసి పెద్ద ఎత్తున నామినేషన్లు దాఖలు చేసేందుకు కేంద్రాలకు చేరుకున్నారు. మధ్యాహ్నం 12 గంటల వరకు నామినేషన్ కేంద్రాల వద్ద వరుసలు దర్శనమిచ్చాయి. ముఖ్యంగా రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన కేంద్రాల వద్ద అభ్యర్థులు, మద్దతుదారులతో జాతర వాతావరణం నెలకొంది.నామపత్రాల పరిశీలన, సవరణ కోసం ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్‌లు అభ్యర్థులతో కిటకిటలాడాయి. అభ్యర్థులు ముందుగా హెల్ప్‌డెస్క్‌ను సంప్రదించి, అనంతరం నామినేషన్ కేంద్రాలకు వెళ్లేలా అధికారులు అనుమతి ఇచ్చారు. అభ్యర్థితో పాటు ఇద్దరికి మాత్రమే కేంద్రంలోకి ప్రవేశానికి అవకాశం కల్పించారు.ఉదయం 10.30 గంటలకు ప్రారంభమైన నామినేషన్ సేకరణ ప్రక్రియ సాయంత్రం ఐదు గంటలు దాటినా, కేంద్రాల్లో ఇప్పటికే ఉన్న వారి నుంచి నామపత్రాలను అధికారులు స్వీకరించారు.నామినేషన్ సేకరణ అనంతరం పరిశీలన, అభ్యంతరాల స్వీకరణ, పరిష్కార ప్రక్రియ కొనసాగనుంది. ఫిబ్రవరి 3వ తేదీ వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉండగా, అదే తేదీ వరకు బీఫారం సమర్పించేందుకు అవకాశం ఉంది. దీంతో పార్టీ టికెట్లపై ఆశావహుల్లో ఉత్కంఠ నెలకొంది. వారంలోపే మొత్తం ఎన్నికల ప్రక్రియ కీలక దశకు చేరుకోవడంతో రాజకీయ పార్టీలకు ఇది సవాలుగా మారింది. ఒకే డివిజన్ నుంచి ఎక్కువ మంది ఆశావహులు నామినేషన్లు వేయడంతో, పార్టీ అభ్యర్థిని ఖరారు చేయడం, మిగతా వారిని బుజ్జగించి నామినేషన్లు ఉపసంహరించుకునేలా చేయడం పార్టీలకు కత్తి మీద సాములా మారనుందని రాజకీయ వర్గాలు చర్చించుకుంటున్నాయి.

## పాలెం గ్రామంలో లెప్రసీపై అవగాహన... ప్రతిజ్ఞ కార్యక్రమం...



నాగర్‌కర్నూల్ టౌన్//**జనవరి30 ఆకాంక్ష** :జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం పాలెం గ్రామంలో లెప్రసీపై అవగాహన మరియు ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామంలోని గాంధీ విగ్రహం వద్ద మహాత్మా గాంధీకి నివాళులు అర్పించిన అనంతరం ఈ కార్యక్రమం చేపట్టారు. పాలెం ఆరోగ్య ఉపకేంద్రం వైద్య సిబ్బంది, గ్రామ పెద్దలు, వివిధ సంఘాల నాయకుల సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో "వివక్షతను అంతం చేయడంగౌరవాన్ని కాపాడటం" అనే నినాదంతో లెప్రసీపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ నెల 30 నుంచి ఫిబ్రవరి 13 వరకు గ్రామాల్లో కుష్టు వ్యాధి లక్షణాలను గుర్తించేందుకు వైద్య ఆరోగ్య సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి ప్రతి వ్యక్తిని పరీక్షిస్తారని తెలిపారు.ఈ సందర్భంగా హెల్త్ అసిస్టెంట్ కూన గోవర్ధన్ మాట్లాడుతూ లెప్రసీ లక్షణాలపై వివరించారు. చర్మంపై స్పర్శ లేకుండా కనిపించే మచ్చలు,మందమైన మెరిసే జిడ్డుగల చర్మం, చెవులు, వీపు, ఛాతీపై నొప్పిలేని బొడిగలు, కనుబొమ్మలు మరియు కనురెప్పల వెంట్రుకలు రాలిపోవడం, కనురెప్పలు పూర్తిగా మూతపడకపోవడం, ముక్కు దిబ్బడ, ముక్కు నుంచి రక్తస్రావం, చేతులు కాళ్లలో తిమ్మిర్లు, పాదాల వాపు, అరచేతులు అరికాళ్లలో స్పర్శ కోల్పోవడం, చల్లని లేదా వేడి వస్తువులను గుర్తించలేకపోవడం, చేతుల నుంచి వస్తువులు తెలియకుండానే జారిపోవడం, కాళ్లకు చెప్పులు జారిపోవడం, చేతులు కాళ్లలో బొబ్బలు రావడం, వేళ్లు వంకరగా మారి అంగవైకల్యం రావడం వంటి లక్షణాల్లో ఏవైనా కనిపిస్తే లెప్రసీగా అనుమానించి వెంటనే సంబంధిత వైద్య సిబ్బంది లేదా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని వైద్యులను సంప్రదించాలని సూచించారు.కార్యక్రమంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ రిటైర్డ్ అధికారి డాక్టర్ పాపిశెట్టి గోపాల్ పాల్గొని మహాత్మా గాంధీ చేసిన సేవలను కొనియాడారు. గ్రామ సర్పంచ్ బోనాసి రామకృష్ణ, ఉపసర్పంచ్ గోవింద శ్రీనివాసులు, వార్డు సభ్యులు, పుర ప్రముఖులు, వివిధ సంఘాల ప్రతినిధులు, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, ఏఎన్ఎం జి. గజవర్ధనమ్మ, ఆశా వర్కర్ల జిల్లా అధ్యక్షురాలు బోనాసి జయమ్మతో పాటు ఆశాలు శమేం, విజయలీల, పార్వతి, వరలక్ష్మి తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## 1వ వార్డు అభ్యర్థి తూముల శ్యామల మహేష్ అట్టహాస నామినేషన్...



పెద్దపల్లి టౌన్//**జనవరి30 ఆకాంక్ష :** పెద్దపల్లి మున్సిపల్ ఎన్నికల వేళ 1వ వార్డు బంధంపల్లిలో రాజకీయ హడావిడి నెలకొంది. కౌన్సిలర్ అభ్యర్థిగా తూముల శ్యామల మహేష్ శుక్రవారం ఎమ్మెల్యే విజయ రమణారావు సహకారంతో అట్టహాసంగా నామినేషన్ దాఖలు చేశారు. అంతకు ముందు నిర్వహించిన భారీ ర్యాలీ డప్పు చప్పుళ్లు, నినాదాలతో బంధంపల్లి వీధులను మారుమోగించింది. మరోసారి అవకాశం ఇస్తే వార్డును మోడల్ వార్డుగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు.

## సాగులో సాంకేతిక పరికరాలదే భవిష్యత్...

### ఆధునిక వ్యవసాయంపై రైతుల అవగాహన...



నాగర్‌కర్నూల్ టౌన్//**జనవరి30 ఆకాంక్ష** :రాబోయే రోజుల్లో వ్యవసాయ రంగంలో నూతన సాంకేతిక పరికరాలు కీలక పాత్ర పోషించనున్నాయని డ్రిప్ ఇరిగేషన్ వ్యవస్థ ప్రతినిధులు తెలిపారు. సాగును మరింత లాభసాటిగా మార్చేందుకు ఆధునిక యాంత్రీకరణ అనివార్యమని వారు స్పష్టం చేశారు.గత డిసెంబర్ 12 నుంచి ఈనెల 30 వరకు మహారాష్ట్రలో నిర్వహించిన బెల్గాం హార్టికల్చర్ అగ్రికల్చర్ ఫెస్టివల్‌లో భాగంగా వివిధ రకాల డ్రిప్ ఇరిగేషన్ నూతన పరికరాలు, ఆధునిక వ్యవసాయ యంత్రాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా మామిడి, స్వీట్ ఆరెంజ్, అరటి వంటి పండ్ల తోటలు, కూరగాయల సాగు, మొక్కజొన్న, వరి, ఉల్లి పంటల సాగులో అనుసరిస్తున్న ఆధునిక పద్ధతులను రైతులకు వివరించారు. అలాగే సోలార్ వ్యవసాయ పంపుసెట్లు, భవిష్యత్తులో అమలు చేయనున్న నూతన సాగు విధానాలపై ప్రత్యేకంగా అవగాహన కల్పించారు.



ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన బిజినేపల్లి, తిమ్మాజీపేట, జడ్చర్ల, బాలానగర్, కేశంపేట, కొందుర్గు, ఫరుక్‌నగర్ ప్రాంతాల రైతులు ఈ వ్యవసాయ ప్రదర్శనలో పాల్గొని నూతన సాగు పద్ధతులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఆధునిక యాంత్రీకరణ వల్ల నీటి వినియోగం తగ్గి, దిగుబడులు పెరుగుతాయని రైతులు అభిప్రాయ పడ్డారు.జైన్ డ్రిప్ ఇరిగేషన్ సంస్థ ప్రతినిధులు రైతుల సందేహాలకు సమాధానాలు ఇస్తూ వివిధ రకాల సాంకేతిక సాగు పద్ధతులు, యంత్రాల పనితీరును వివరించారు.ఈకార్యక్రమం ద్వారా రైతులు ఆధునిక వ్యవసాయంపై సమగ్ర అవగాహన పొందారని నిర్వాహకులు తెలిపారు.

## తెలంగాణ రాష్ట్ర ప్రజలందరిపై ఉండాలని సమ్మక్కసారలమ్మల ఆశీర్వాదం ఉండాలి..



ఉప్పల్//**జనవరి 30 ఆకాంక్ష :** మేడారం సమ్మక్కసారలమ్మల ఆశీర్వాదం తెలంగాణ రాష్ట్ర ప్రజలందరిపై ఉండాలని చిల్కానగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్, జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ మాజీ సభ్యురాలు బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ ఆకాంక్షించారు. మేడారం జాతర సందర్భంగా ఆమె కుటుంబ సమేతంగా అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కూడా ఆమెతో కలిసి అమ్మవార్లను దర్శించుకున్నారు.అనంతరం బన్నాల గీత ప్రవీణ్ మాట్లాడుతూ తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని, రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో ఉండే విధంగా అమ్మవారి ఆశీర్వాదం ఎల్లప్పుడూ తెలంగాణపై ఉండాలని మొక్కుకున్నట్లు తెలిపారు. ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి కోసం సమ్మక్కసారలమ్మలు దీవించాలని ఆమె ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఎద్దుల కొండల్ రెడ్డి, ముద్దం శ్రీనివాస్ యాదవ్, చేర్యాల శ్రీనివాస్, మాస శేఖర్, బాలకృష్ణ గౌడ్, చిన్న, మహేష్ తదితరులు పాల్గొని అమ్మవార్లను దర్శించుకున్నారు. మేడారం జాతర సందర్భంగా భక్తుల రద్దీ మధ్య ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

## తల మీదే రక్షణ మీదే హెల్మెట్ ధారణతోనే ప్రాణ రక్షణ..



భద్రాచలం//**జనవరి 30 ఆకాంక్ష :** "తల మీదే రక్షణ మీదే"అనే సత్యాన్ని ప్రతి ద్విచక్ర వాహన చోదకుడు గుర్తించి, తప్పనిసరిగా హెల్మెట్ ధరించి తన విలువైన ప్రాణాలను కాపాడుకోవాలని భద్రాచలం ఆర్టీఏ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ సంగం వెంకట పుల్లయ్య వాహనదారులను కోరారు.శుక్రవారం భద్రాచలం రవాణా శాఖ యూనిట్ కార్యాలయంలో జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ వెంకట పుల్లయ్య, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ బి. రాజశేఖర్ రెడ్డి, సిబ్బంది కార్యాలయానికి వచ్చిన వాహనదారుల హెల్మెట్లపై "నన్ను ధరించు నిన్ను రక్షిస్తా" అనే నినాదంతో కూడిన రేడియం స్టిక్కర్లను అంటించి, హెల్మెట్ ప్రాధాన్యతను వివరించారు.ప్రతి ద్విచక్ర వాహన చోదకుడు నాణ్యమైన హెల్మెట్‌ను తలకు సరిగ్గా ధరించి, మెడ వద్ద బెల్ట్ క్లిప్‌ను కచ్చితంగా బిగించుకుని ప్రయాణించాలని వెంకట పుల్లయ్య సూచించారు. హెల్మెట్‌ను సక్రమంగా ధరిస్తే రోడ్డు ప్రమాదాలు జరిగినప్పటికీ తలకు తీవ్ర గాయాలు తగలకుండా ప్రాణాలను కాపాడుకోవచ్చని వివరించారు. మనం జీవించి ఉన్నప్పుడే కుటుంబానికి రక్షణగా నిలబడగలమని, అందుకే హెల్మెట్ ధారణను అలవాటుగా మార్చుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపైనే ఉందన్నారు.అలాగే కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులకు కూడా హెల్మెట్ ప్రాధాన్యతను వివరించి, వారిని ఈ అలవాటుకు ప్రోత్సహించాలని కోరారు.తల మీదే రక్షణ మీదే; హెల్మెట్ ధారణ ప్రాణ రక్షణ" అనే సత్యాన్ని ఎప్పటికీ మర్చిపోవద్దని ఆయన స్పష్టం చేశారు. సెల్‌ఫోన్ ఉపయోగిస్తూ డ్రైవింగ్ చేయడం, మద్యం మత్తులో, నిద్ర మత్తులో, అతి వేగంతో వాహనాలు నడపడం అత్యంత ప్రమాదకరమని హెచ్చరించారు. రోడ్డు భద్రత నియమాలను ప్రతి ఒక్కరూ తప్పని సరిగా పాటించి, ప్రమాదాలను అరికట్టి తమతో పాటు ఇతర రోడ్డు వినియోగ దారుల విలువైన ప్రాణాలను కాపాడాలని పిలుపు నిచ్చారు.ఈ కార్యక్రమంలో ఏఎంవీఐ బి. రాజశేఖర్ రెడ్డి, కానిస్టేబుల్ ఎన్. శివయ్య, సిబ్బంది భీముడు పాల్గొనగా కార్యాలయానికి వివిధ పనుల నిమిత్తం వచ్చిన ప్రజలు హాజరయ్యారు.

## ముగిసిన మున్సిపల్ నామినేషన్ల పర్వం...

### 2వ వార్డు బరిలో ఈదునూరి సరితజైపాల్ ...



పెద్దపల్లి//**జనవరి 30 ఆకాంక్ష :** తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ ఎన్నికల సందడి ఉత్కంఠకు చేరుకుంది. రాష్ట్ర ఎన్నికల షెడ్యూల్ ప్రకారం నామినేషన్ల దాఖలుకు శుక్రవారం చివరి రోజుగా ఉండటంతో పెద్దపల్లి మున్సిపాలిటీలో అభ్యర్థుల రాకపోకలు జోరుగా సాగాయి. ప్రధాన రాజకీయ పార్టీలతో పాటు స్వతంత్ర అభ్యర్థులు తమ అనుచరులతో కలిసి పెద్ద సంఖ్యలో తరలివచ్చి నామినేషన్లు సమర్పించారు.నామినేషన్ల గడువు ముగిసే సమయానికి ఎన్నికల వాతావరణం పూర్తిగా వేడెక్కింది. ఈ నేపథ్యంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ తన ఎన్నికల శంఖారావాన్ని పూరించింది. పెద్దపల్లి మున్సిపాలిటీ 2వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా ఈదునూరి సరితజైపాల్ నామినేషన్ల చివరి రోజున రిటర్నింగ్ అధికారికి తమ నామినేషన్ పత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా అభ్యర్థి ఈదునూరి సరితజైపాల్ మాట్లాడుతూ, ప్రజల ఆశీస్సులతో నామినేషన్ దాఖలు చేయడం ఆనందంగా ఉందని తెలిపారు. సామాన్యుల సమస్యలను నేరుగా తెలుసుకుంటూ, 2వ వార్డును అభివృద్ధి బాటలో నడిపించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. స్థానిక సమస్యల పరిష్కారం, మౌలిక వసతుల మెరుగుదల, పారిశుధ్యం, తాగునీరు, రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. తెలంగాణ రాజ్యాధికార పార్టీకి అవకాశం కల్పించి ఆశీర్వదించాలని ఓటర్లను కోరారు. నామినేషన్ల ప్రక్రియ పూర్తికావడంతో స్క్రూటినీ అనంతరం తుది అభ్యర్థుల జాబితా వెలువడనుంది. ఆ తర్వాత పెద్దపల్లి మున్సిపాలిటీలో ఎన్నికల ప్రచారం మరింత ఉత్సాహంగా సాగనుందని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థుల మధ్య పోటీ ఎలా ఉండబోతుందన్న దానిపై ఆసక్తి నెలకొంది.

## సాంకేతిక ఆధారాలు,సీసీటీవీ ఫుటేజ్‌తో నిందితుల అరెస్ట్...



ఉప్పల్//**జనవరి 30 ఆకాంక్ష :** ముఠాగా ఏర్పడి వరుస చోరీలకు పాల్పడుతున్న నిందితులను పోలీసులు సవాలుగా తీసుకుని చాకచక్యంగా పట్టుకున్నారు. సాంకేతిక ఆధారాలు, సీసీటీవీ ఫుటేజ్‌ను ఆధారంగా చేసుకుని నిందితుల కదలికలను గమనించిన పోలీసులు కేసును విజయవంతంగా ఛేదించారు. ఈ కేసులో చోరీ చేసిన సొత్తును కొనుగోలు చేసిన బీహార్‌కు చెందిన సీరామ్ సవ్ బీరేంద్రదను ట్రాన్సిట్ వారెంట్‌పై మేడిపల్లికి తీసుకువచ్చి అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. అతడితో పాటు మరో నిందితుడిని కూడా రిమాండ్‌కు తరలించారు. ఇంకా ఇద్దరు నిందితులను బీహార్ నుంచి మేడిపల్లికి తీసుకువస్తున్నట్లు డీసీపీ తెలిపారు.నిందితులు గతంలో నల్గొండ, వరంగల్, జనగాం పోలీస్ స్టేషన్ పరిధుల్లో కూడా పలు చోరీ కేసుల్లో నిందితులుగా ఉన్నట్లు విచారణలో తేలిందని పోలీసులు పేర్కొన్నారు.వారి నుంచి నాలుగు మొబైల్ ఫోన్లు, రూ.2,04,000 నగదును స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ఈ కేసును సమర్థవంతంగా ఛేదించిన పోలీస్ సిబ్బందిని డీసీపీ సురేష్ కుమార్ అభినందించి రివార్డులు అందించారు. రిమాండ్ అనంతరం కేసుపై మరింత లోతుగా దర్యాప్తు చేపడతామని పోలీసులు తెలిపారు.

## సిపిఐ తరపున 20వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా కపిలవాయి మానస నామినేషన్..



నాగర్ కర్నూల్// **జనవరి 30 ఆకాంక్ష :** నాగర్ కర్నూల్ మున్సిపాలిటీ 20వ వార్డు కౌన్సిలర్ ఎన్నికల నేపథ్యంలో సిపిఐ (కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థిగా కపిలవాయి మానస, కపిలవాయి గోపి చారి అధికారికంగా నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. 20వ వార్డు రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు సమర్పించారు.ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం. బాల నరసింహ, సిపిఐ తెలంగాణ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యులు హెచ్. ఆనంద్ జి, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు మారేడు శివశంకర్, సిపిఐ నాగర్ కర్నూల్ పట్టణ కార్యదర్శి కపిలవాయి గోపి చారి పాల్గొని అభ్యర్థులకు సంఘీభావం తెలిపారు.ఈ సందర్భంగా సిపిఐ నాయకులు మాట్లాడుతూ, ప్రజా సమస్యల పరిష్కారం, పారదర్శక పాలన, పేదల హక్కుల పరిరక్షణే సిపిఐ ప్రధాన లక్ష్యమని తెలిపారు. 20వ వార్డులో ప్రజల ఆశీర్వాదంతో సిపిఐ విజయం సాధిస్తుందనే ధీమాను వ్యక్తం చేశారు. నామినేషన్ కార్యక్రమం ప్రశాంత వాతావరణంలో కొనసాగగా, సిపిఐ శ్రేణులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని నినాదాలతో ఉత్సాహం నింపారు.

## ఉప్పల్ చరిత్రను ప్రతిబింబించే క్యాలెండర్ ఆవిష్కరణ...



ఉప్పల్//**జనవరి 30 ఆకాంక్ష :** ఉప్పల్ ప్రాంతపు చరిత్ర, సాంస్కృతిక వైభవం ఉట్టిపడేలా రూపొందించిన ప్రత్యేక క్యాలెండర్‌ను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆవిష్కరించారు. ఈ క్యాలెండర్‌ను బీఆర్ఎస్ నేత పూదూరి జితేందర్ రెడ్డి (ఉప్పల్ పీజేఆర్) వినూత్న ఆలోచనతో ముద్రించారు. ఉప్పల్‌పై తనకున్న ప్రేమ,అనుబంధాన్ని ప్రజలకు తెలియజేసేలా క్యాలెండర్ రూపకల్పన చేయడం విశేషం. ఇందులో ఉప్పల్‌లోని ప్రసిద్ధ ఆలయాలు,చారిత్రక కట్టడాలు, స్థానిక విశేషాలు, ప్రాంతానికి ప్రత్యేక గుర్తింపునిచ్చే అంశాలను ఆకర్షణీయంగా పొందుపరిచారు. ప్రతి నెలకు ఒక ప్రత్యేక విశేషాన్ని ప్రతిబింబించేలా క్యాలెండర్‌ను రూపొందించడం ద్వారా ఉప్పల్ చరిత్రను నేటి తరానికి చేరువ చేసే ప్రయత్నం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, ఉప్పల్ ప్రాంతానికి గొప్ప చరిత్ర ఉందని,ఆ చరిత్రను గుర్తు చేసేలా రూపొందించిన ఈ క్యాలెండర్ అభినందనీయమని పేర్కొన్నారు. స్థానిక నాయకులు, కార్యకర్తలు, ఉప్పల్ వాసులు ఈ క్యాలెండర్‌ను ఆసక్తిగా పరిశీలిస్తూ ప్రశంసలు కురిపించారు.ప్రాంత చరిత్రను సంరక్షిస్తూ భవిష్యత్ తరాలకు అందించే దిశగా పూదూరి జితేందర్ రెడ్డి చేసిన ఈ ప్రయత్నం ఉప్పల్‌లో విశేష స్పందనను పొందుతోంది.

## రామాలయానికి 41వేల రూపాయల ఫర్నిచర్ అందజేత...

### దాతృత్వం చాటుకున్న వైద్యులు డాక్టర్ హేమంత్ కుమార్....



నాగర్ కర్నూల్//**జనవరి 30 ఆకాంక్ష :** నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని రాంనగర్ కాలనీలో గల శ్రీ సీతారామ చంద్రస్వామి దేవాలయానికి భక్తుల సౌకర్యార్థం వినియోగించుటకు మూడు స్టీల్ బెంచీలు, 25 కుర్చీలు 41వేల విలువ గల ఫర్నిచర్ ను నాగర్ కర్నూల్ లోని శ్రీ హేమంత్ న్యూరో మల్టీస్పెషల్టి హాస్పిటల్ న్యూరాలజీ ఫిజీషియన్ డాక్టర్ హేమంత్ కుమార్, జనరల్ ఫిజీషియన్ డాక్టర్ ప్రియాంక లు ఆలయ ప్రధాన అర్చకులు కందడై వరదరాజన్ అయ్యంగార్ కు అందజేశారు. రామాలయంలో విశేషంగా జరుగుతున్న నిత్య పూజా కార్యక్రమాలతో పాటు ప్రత్యేక పూజలకు వీటిని వినియోగిస్తామని అర్చకులు తెలిపారు. అనంతరం వైద్యులకు ప్రత్యేక పూజలు నిర్వహించి వేద ఆశీర్వచనం చేశారు. ఈ కార్యక్రమంలో అర్థం రవీందర్, గొల్ల రాములు, మన్యపు రెడ్డి, రమాదేవి, శారద, పాండురంగయ్య, స్వామి భక్తులు మహిళలు పాల్గొన్నారు.

## నేడు వడ్డేమాన్ లో శని త్రయోదశి ప్రత్యేక పూజలు...



నాగర్ కర్నూల్//**జనవరి 30 ఆకాంక్ష :** నాగర్ కర్నూల్ జిల్లా బిజినపల్లి మండలం పరిధిలోని నంది వడ్డేమాన్ గ్రామంలో గల శ్రీ శనేశ్వర స్వామి ఆలయంలో శని త్రయోదశి సందర్భంగా ఈ నెల31న శనివారం నాడు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ వెల్దండ గోపాలరావు,ప్రధానార్చకులు గవ్వమఠం విశ్వనాథ శాస్త్రి తెలిపారు. ప్రధాన అర్చకులు మాట్లాడుతూ జన్మరీత్యా, గోచార రీత్యా ఏలినాటి శని, అర్ధాష్టమశని,అష్టమ శని, శని గ్రహ దోష పరిహారం పొందుటకు అన్నిరాశుల వారు శనీశ్వర స్వామి వారిని స్వయంగా దర్శించుకుని తిలతైల అభిషేక పూజలు చేయాలని ఆయన తెలిపారు. భక్తులకు స్నానాలకు నీటి వసతి, త్రాగుటకు మంచినీటి వసతి, ఉదయం నుండి 4 గంటల వరకు అల్పాహారవసతి కల్పిస్తున్నట్లు వారు తెలిపారు.ఈ ప్రాంత భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపా కటాక్షాలకు పాత్రులు కాగలరని కోరారు.

## మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీకి అఖండ మెజారిటీ ఇవ్వాలి...

### ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి పిలుపు...



నాగర్‌కర్నూల్//**జనవరి 30 ఆకాంక్ష :** నాగర్‌కర్నూల్ పట్టణ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో బీజేపీ అభ్యర్థుల నామినేషన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. రామాలయం దేవాలయం నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు సాగిన ఈ నామినేషన్ ర్యాలీ ఉత్సాహంగా కొనసాగింది.ఈ కార్యక్రమానికి మహబూబ్‌నగర్ రంగారెడ్డి హైదరాబాద్ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గౌరవనీయులు శ్రీ ఏవీఎన్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షులు శ్రీ వేముల నరేందర్ రావు ఆధ్వర్యంలో ఈ ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి మాట్లాడుతూ, ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం పట్టణాల సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా



‘అమృత్ భారత్’ పథకం ద్వారా కోట్లాది రూపాయల నిధులను కేటాయిస్తున్నదని తెలిపారు. మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు దేశంలోని ప్రతి ఇంటికీ చేరుతున్నాయని పేర్కొన్నారు. నాగర్‌కర్నూల్ పట్టణ ప్రజలు కేంద్ర ప్రభుత్వ అభివృద్ధిని గుర్తించి మున్సిపల్ ఎన్నికల్లో కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి బీజేపీ అభ్యర్థులను అఖండ మెజారిటీతో గెలిపించాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ ఇంచార్జి దిలీప్ నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేందర్ గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు తిరుపతయ్య ఆంజనేయులు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సుధాకర్ రెడ్డి, నారాయణ చారి, శ్రీశైలం, టౌన్ అధ్యక్షుడు ప్రమోద్ కుమార్, జిల్లా ఆఫీస్ సెక్రటరీ సి.చందు, జిల్లా కోశాధికారి రాజా రామేశ్వరరావు, జిల్లా కార్యదర్శి చంద్రకళ, తిమ్మాయిపేట మాజీ ఎంపీపీ జెట్టి వెంకటేష్, మాజీ జిల్లా అధ్యక్షులు సుబ్బారెడ్డి, మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజా వర్ధన్ రెడ్డి, మండలాధ్యక్షులు చిన్నారెడ్డి యశ్వంతు, శ్రీరాములు, ప్రధాన కార్యదర్శులు జగదీశ్వర్ రెడ్డి, బొట్టు శ్రీను, సత్యనారాయణ, వెంకటేష్ పాల్గొన్నారు.అలాగే కౌన్సిలర్ అభ్యర్థులు తెప్ప విష్ణు, యాదగిరిరావు, రాధారెడ్డి, శ్రీనాథ్ గౌడ్, పోతుల మమత, నెష రుద్రమ్మ, సౌజన్య, రాము తదితర బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# కాంగ్రెస్‌కు బిగ్ షాక్...

### హరీష్ రావు సమక్షంలో బీఆర్ఎస్‌లో భారీ చేరికలు

మెదక్//**జనవరి 30 ఆకాంక్ష :** మెదక్ జిల్లాలో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది.మున్సిపల్ ఎన్నికలు సమీపిస్తున్న వేళ కాంగ్రెస్ పార్టీకి భారీ ఎదురుదెబ్బ తగిలింది. రామాయంపేటకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సుప్రభాత్ రావు ఆ పార్టీకి గుడ్‌బై చెప్పి భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్)లో చేరారు. మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు సమక్షంలో ఈ చేరిక కార్యక్రమం ఘనంగా జరిగింది. శుక్రవారం హైదరాబాద్‌లోని హరీష్ రావు నివాసంలో నిర్వహించిన కార్యక్రమంలో సుప్రభాత్ రావుకు గులాబీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. గత 25 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీలో కొనసాగిన సుప్రభాత్ రావు, ఎన్ఎస్‌యూఐ నుంచి పీసీసీ సెక్రటరీ వరకు వివిధ హోదాల్లో పనిచేశారు. ఆయన బీఆర్ఎస్‌లో చేరడం మెదక్ జిల్లా రాజకీయాల్లో ప్రాధాన్యత సంతరించుకుంది.ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనపై ప్రజల్లోనే కాకుండా ఆ పార్టీ సొంత నాయకుల్లోనూ తీవ్ర అసంతృప్తి నెలకొందని వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రెండేళ్ల పాలనలో ప్రజలకు చేసింది శూన్యమని, ఇచ్చిన హామీలను నెరవేర్చలేక చేతులెత్తేశారని విమర్శించారు. అభివృద్ధిని కాంక్షించే సీనియర్ నాయకులు ఒక్కొక్కరుగా కాంగ్రెస్‌ను వీడి బీఆర్ఎస్ వైపు చూస్తున్నారని తెలిపారు.



రామాయంపేటలో సుప్రభాత్ రావు చేరికతో పార్టీ మరింత బలోపేతమైందని, రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో రామాయంపేటలో గులాబీ జెండానే ఎగురుతుందని హరీష్ రావు ధీమా వ్యక్తం చేశారు. పార్టీని నమ్ముకుని వచ్చిన ప్రతి నాయకుడికి, కార్యకర్తకు సముచిత స్థానం, గౌరవం ఉంటుందని హామీ ఇచ్చారు.కేసీఆర్ హయాంలో పట్టణ ప్రగతితో పట్టణాలు, మున్సిపాలిటీలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని గుర్తు చేసిన హరీష్ రావు, కాంగ్రెస్ పాలనలో నిధుల లేమి, నిర్వహణ లోపంతో పట్టణాలు నిర్వీర్యమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. మళ్లీ మంచినీటి సమస్యలు, పారిశుధ్య సమస్యలు మొదలయ్యాయని విమర్శించారు.ఆరు గ్యారెంటీలు, 420 హామీల పేరుతో అన్ని వర్గాలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని ఆరోపించారు. కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజలు గమనిస్తున్నారని, ఉమ్మడి మెదక్ జిల్లాలో జరగబోయే అన్ని మున్సిపాలిటీ ఎన్నికల్లో బీఆర్ఎస్ క్లీన్‌స్వీప్ చేస్తుందని, విజయ ఢంకా మోగిస్తుందని హరీష్ రావు విశ్వాసం వ్యక్తం చేశారు.సుప్రభాత్ రావు మాట్లాడుతూ అభివృద్ధి, ప్రజాసేవ లక్ష్యంగా బీఆర్ఎస్‌లో చేరినట్లు తెలిపారు. రామాయంపేటలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కార్యకర్తలతో కలిసి పనిచేస్తానని చెప్పారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సల్కర్‌పేటలో క్షయ వ్యాధి గుర్తింపు శిబిరం..

### సమిష్టి కృషితోనే నిర్మూలన సాధ్యం...



నాగర్‌కర్నూల్ టౌన్//**జనవరి 30 ఆకాంక్ష :** సమిష్టిగా ముందుకు సాగితేనే క్షయ వ్యాధిని పూర్తిగా అంతం చేయగలమని సల్కర్‌పేట గ్రామ సర్పంచ్ అబ్బ రాములు అన్నారు. బిజినేపల్లి మండలం సల్కర్‌పేట గ్రామంలో శుక్రవారం జిల్లా క్షయ వ్యాధి నివారణ కార్యక్రమం, భవిష్య భారత్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ సమీపంలో క్షయ వ్యాధి గుర్తింపు శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరానికి పెద్ద సంఖ్యలో గ్రామస్తులు హాజరై పరీక్షలు చేయించుకున్నారు.ఈ సందర్భంగా గ్రామస్తులను ఉద్దేశించి సర్పంచ్ అబ్బ రాములు మాట్లాడుతూ, క్షయ వ్యాధి నిర్మూలన అవగాహన, చైతన్యం ఉన్నప్పుడే సాధ్యమవుతుందన్నారు. ఒక్కరి ప్రయత్నంతో వ్యాధి అంతం కాదని, గ్రామమంతా చేయి చేయి కలిపి ముందడుగు వేస్తేనే క్షయాన్ని అరికట్టవచ్చని చెప్పారు. వ్యాధి నిరోధక శక్తి పెంపొందించుకుంటే అన్ని రకాల వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చని ఆయన సూచించారు.శిబిరం సందర్భంగా సల్కర్‌పేట, అల్లిపూర్ గ్రామాలకు చెందిన 101 మందికి ఛాతీ ఎక్స్‌రే పరీక్షలు నిర్వహించారు. పరీక్షల్లో వ్యాధి లక్షణాలు ఉన్నవారి నుంచి కఫం నమూనాలను సేకరించి తదుపరి చికిత్సకు పంపించారు. అలాగే కుష్టు వ్యాధి నిర్మూలనపై అవగాహన కల్పిస్తూ ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్‌తో పాటు ఉపసర్పంచ్ రాజేశ్వరి, గ్రామ కార్యదర్శి సత్యం, డాక్టర్ ప్రియాంక, ఎం.పీ.హెచ్.ఈ.ఓ రాజేశ్వర్, టీవీ సూపర్వైజర్ శ్రీనివాసులు, వార్డు సభ్యులు నీలమ్మ, కొండగారి లక్ష్మి, పాలెపు రాములు, బుచ్చన్న, శివ, ఏఎన్ఎం కళావతి, హెల్త్ అసిస్టెంట్ గోవిందు, టెక్నీషియన్లు అమన్, చందు, నాగేంద్రమ్మ, శివలీల తదితరులు పాల్గొన్నారు.

## విజయవంతంగా కంటి చికిత్స శిబిరం..



నాగర్ కర్నూల్//**జనవరి 30 ఆకాంక్ష :** నాగర్ కర్నూల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం పాత కలెక్టరేట్ భవనంలోని 102వ గదిలో నిర్వహించిన కంటి చికిత్స శిబిరం విజయవంతంగా ముగిసినట్లు జిల్లా ఆప్తాలమిక్ అధికారి కొట్ర బాలాజీ తెలిపారు.ఈ శిబిరానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. మొత్తం 86 మందికి సమగ్ర కంటి పరీక్షలు నిర్వహించగా, అందులో అర్హులైన 38 మంది క్యాటరాక్ట్ బాధితులను గుర్తించారు. వీరిని ప్రత్యేక అంబులెన్స్ ద్వారా హైదరాబాద్‌లోని లయన్ రాంరెడ్డి కంటి ఆసుపత్రికి పంపినట్లు ఆయన వెల్లడించారు.ప్రజలకు నాణ్యమైన కంటి వైద్యం అందించాలనే లక్ష్యంతో ఇలాంటి శిబిరాలను నిరంతరం నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా సమయానికి వైద్య పరీక్షలు చేయించుకోవాలని ప్రజలకు సూచించారు.ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య సిబ్బంది వై. శ్రీనివాసులు, సుకుమార్ రెడ్డి, నరసింహ, చెన్నకేశవులు, ప్రకాష్, సురేష్, డీఎల్ చారి, సురేష్ చారి తదితరులు పాల్గొని సేవలందించారు.

## ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ...

### నాగర్ కర్నూల్ జిల్లా శాఖ ఎన్నికలు పూర్తి...

నాగర్ కర్నూల్//**జనవరి 30 ఆకాంక్ష :** నాగర్ కర్నూల్ జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా మేనేజింగ్ కమిటీ ఎన్నికలు ముగిశాయి. జిల్లా మేనేజింగ్ కమిటీ సభ్యులుగా 15 మంది ఎన్నికయ్యారు. కమిటీ సభ్యులు నూతన ఛైర్మన్ గా ఆకుతోట సాయి బాబును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఛైర్మన్‌గా సూరంపల్లి రాధాకృష్ణ, కోశాధికారిగా బోయినపల్లి కృష్ణారావు, రాష్ట్ర మేనేజింగ్ కమిటీ సభ్యుడిగా చీమర్ల రమేష్ రెడ్డి, మేనేజింగ్ కమిటీ సభ్యులుగా సోమిశెట్టి శ్రీధర్ జిల్లా డాక్టర్ మాణిక్యాల చెన్నయ్య, జె. రాజ్ కుమార్, కొల్లం రవి కుమార్, మాణిక్యాల వెంకట్ దాస్, పోల బాలకృష్ణ, హకీం రాజేష్ , వుండ్యాల రాజమహేందర్ రెడ్డి, ముచ్చర్ల దినకర్ రావు, దామగట్ల కుమార్ జిల్లా మేనేజింగ్ కమిటీ, భూపతి రావు ఎన్నికయ్యారు. ఈ కమిటీ 2029, జనవరి వరకు కొనసాగుతుంది.

## లింగ నిర్ధారణ పై కఠిన చర్యల హెచ్చరిక...



నాగర్ కర్నూల్/**జనవరి 30 ఆకాంక్ష :** జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె. రవికుమార్ లింగ నిర్ధారణపై కఠిన చర్యలు చేపట్టనున్నారు అని హెచ్చరికలు జారీ చేశారు. గర్భవతుల స్కానింగ్ ద్వారా లింగాన్ని బయట చెప్పిన నిర్వాహకులు, వైద్యులపై కఠిన శిక్షలు విధించనున్నట్లు డాక్టర్ రవికుమార్ స్పష్టం చేశారు.డీఎంహెచ్ఓ ప్రకారం, కల్వకుర్తి పట్టణంలోని ప్రైవేట్ స్కానింగ్ సెంటర్లు, హాస్పిటల్స్‌లలో ఆకస్మిక తనిఖీలు చేపట్టబడ్డాయి. జిల్లాలో లింగ నిష్పత్తి చాలా కలత కలిగించే స్థాయికి చేరినట్లు వెల్లడైంది. గణాంకాల ప్రకారం, నగర్ కర్నూలు జిల్లాలో 1000 మంది అబ్బాయిలకు 894 మంది అమ్మాయిలే జన్మించారు, దీని కారణంగా లింగ నిష్పత్తిలో తీవ్ర వ్యత్యాసం ఏర్పడిందని డీఎంహెచ్ఓ ఆందోళన వ్యక్తం చేశారు.డాక్టర్ రవికుమార్ మహిళలపై వివక్ష తగదని స్పష్టంగా తెలిపారు. ప్రైవేట్ స్కానింగ్ సెంటర్లలో అన్ని రికార్డులు, ఫామ్ ఎఫ్‌ల పరిశీలన జరగడం తప్పనిసరి అని, లింగ నిర్ధారణ నిషేధ చట్టం బోర్డులు తప్పనిసరిగా ప్రదర్శించాలని ఆదేశాలు జారీ చేశారు.లింగ నిర్ధారణ చేసే వారికి 3 సంవత్సరాల జైలు మరియు రూ.50,000 జరిమానా విధించబడతుందని కూడా డీఎంహెచ్ఓ హెచ్చరించారు. అంతేకాకుండా, స్కానింగ్ సెంటర్లు నిబంధనల ప్రకారం నిర్వహించాలని, రేట్ల పట్టికను సెంటర్ల బయట స్పష్టంగా ప్రదర్శించాలన్న సూచనలు కూడా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ లక్ష్మణ్ మరియు మాస్ మీడియా అధికారి రాజగోపాల్ చారి పాల్గొన్నారు.

## చిలకనగర్‌లో దోమల విపరీతం...

### ఫాగింగ్ వాహనం ప్రారంభం...



ఉప్పల్//**జనవరి 30 ఆకాంక్ష :** చిలకనగర్ డివిజన్లో దోమల సమస్య బారంగా పెరుగుతూ ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న నేపథ్యంలో, ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ నేత పరమేశ్వర్ రెడ్డి శుక్రవారం ఫాగింగ్ వాహనాన్ని ప్రారంభించారు. ఈ ఫాగింగ్ మిషన్ ద్వారా డివిజన్‌లోని ప్రతి బస్తీ, కాలనీ ప్రాంతాలలో దోమల నివారణ చేపట్టాలని లక్ష్యం అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజలు దోమల నుండి పడే ఇబ్బందులు తీవ్రమవుతున్నాయని, అందుకే డివిజన్ లెవల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. ప్రత్యేకంగా ఫాగింగ్ మిషన్ ద్వారా సమగ్ర అవగాహనతో ప్రతి ప్రాంతంలో దోమలను నియంత్రించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.ఈ కార్యక్రమంలో చిలకనగర్ డివిజన్ ఇంచార్జ్ ఆకిటి ఆగం రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు రాజేష్ ముదిరాజ్, అమరేశ్వరి, మచ్చల రఘు, మహేందర్ ముదిరాజ్, సత్యం, ఎస్. కె. మొయినుద్దీన్, జంగయ్య, గండికోట గణేష్, కిరణ్, ఫహీమ్ తదితర డివిజన్ నాయకులు పాల్గొన్నారు.కాంగ్రెస్ పార్టీ నేతలు ప్రజల సంక్షేమానికి మద్దతుగా చేపడుతున్న ఈ ప్రయత్నం స్థానికుల నుంచి ప్రశంసలు పొందింది. ప్రజలు ఆరోగ్యకరమైన వాతావరణంలో జీవించేందుకు ప్రభుత్వం, పార్టీ నాయకులు సక్రమంగా చర్యలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు.

## గోదావరి పుష్కరాల ఏర్పాట్లకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి...



మంథని//**జనవరి 30 ఆకాంక్ష :** 2027 గోదావరి నది పుష్కరాల ఏర్పాట్ల పై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష శుక్రవారం మంథని ఆర్డిఓ కార్యాలయంలో రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ 2027 జూన్ 26 నుంచి 2027 జూలై 7 వరకు గోదావరి నదికి 12 సంవత్సరాలకు ఒకసారి వచ్చే మహా పుష్కరాలు జరుగుతాయని, దీనికి సంబంధించి మన జిల్లాలో భక్తులు పుణ్యస్నానాలు చేసేందుకు అవసరమైన ఘాట్ నిర్మాణం, రోడ్డు విస్తరణ, లైటింగ్, ఇతర ఏర్పాట్లు, ఆలయాల అభివృద్ధి కు ప్రతిపాదనలు తయారు చేసి వీలైనంత త్వరగా సమర్పించాలని కలెక్టర్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో మంథని రెవెన్యూ డివిజన్ అధికారి సురేష్, ఈఈ ఆర్ అండ్ బి భావ్ సింగ్, ఈఈ మిషన్ భగీరథ ఇంట్రా శ్రీనివాస్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలి.. కాసం వెంకటేశ్వర్లు



గోదావరిఖని//**జనవరి 30 ఆకాంక్ష :** రామగుండం కార్పొరేషన్ ఎన్నికల్లో నీతి, నిజాయితీ కలిగిన బీజేపీ అభ్యర్థులను గెలిపించాల్సిందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కాసం వెంకటేశ్వర్లు బీజేపీ కార్యాలయంలో శుక్రవారం వెల్లడించారు. గోదావరిఖని మార్కండేయ కాలనీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రామగుండం కార్పొరేషన్ ఎన్నికల ఇంచార్జిగా బీజేపీ వర్గాలు వ్యవహరిస్తున్నాయని చెప్పారు.సమావేశంలో ఆయన తెలిపారు, “మున్సిపల్ ఎన్నికలను కాంగ్రెస్ ప్రభుత్వం హడావిడిగా నిర్వహించడానికి ప్రయత్నిస్తుందన్నది నిజం. అయినప్పటికీ, బీజేపీ పార్టీ ప్రతి స్థాయిలో దీన్ని ఎదుర్కొనేందుకు సిద్ధపడింది. ఈ ఎన్నికల్లో ప్రధాన లక్ష్యం కాంగ్రెస్ పార్టీలను ఓడించడం,“ అని అన్నారు.కాసం వెంకటేశ్వర్లు 10 సంవత్సరాల ౹=ా పాలన, రెండు సంవత్సరాల కాంగ్రెస్ పాలనలో గ్రామాలు, నగరాలు అభివృద్ధిలో వెనుకడిపోయాయని, రాష్ట్రంలోని కాంట్రాక్టర్లకు ప్రభుత్వం 46,700 కోట్ల రూపాయలు చెల్లించలేకపోయిందని ఆరోపించారు. అలాగే, రాష్ట్రంలోని మున్సిపాలిటీలకు, కార్పొరేషన్‌లకు కేంద్రప్రభుత్వం నిధులు వస్తే తప్ప, అవి మనుగడ సాగించలేవని పేర్కొన్నారు. అందువల్ల, రామగుండం కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించడం ద్వారా కేంద్రం నుండి మరింత నిధులను పొంది అభివృద్ధి చేపట్టవచ్చని కాసం వెంకటేశ్వర్లు వక్త అన్నారు.ఈ విలేకరుల సమావేశంలో జిల్లా అధ్యక్షులు కర్ర సంజీవ్ రెడ్డి, నాగపూరి రాజమౌళి గౌడ్, కందుల సంధ్యారాణి, రావుల రాజేంద్ర, మెరుగు హనుమంత్ గౌడ్, కోమల్ల మహేష్, సోమారావు లావణ్య, కాసిపేట శివాజీ తదితరులు పాల్గొన్నారు.

### మండల కేంద్రంలో ఘనంగా

## జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి....



నాగర్ కర్నూల్ టౌన్//**జనవరి 30 ఆకాంక్ష :** జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి ఈ సంవత్సరం మండల కేంద్రంలో పరిసర గ్రామాల్లో ఘనంగా నిర్వహించబడింది. మండల కేంద్రంలోని గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించడం ద్వారా కార్యక్రమానికి ప్రారంభం అయ్యింది.ఈ సందర్భంగా మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు గంధం వెంకటేష్ ప్రసంగిస్తూ, “అహింస, సత్యం అనే ఆయుధాలతో బ్రిటిష్ సామ్రాజ్యాన్ని ఎదుర్కొని దేశానికి స్వాతంత్ర్యం సాధించిన మహానుభావుడు గాంధీజీ. ఉన్నత ఆలోచనలు అనే సిద్ధాంతాన్ని తన జీవితాంతం ఆచరించిన ఆదర్శ పురుషుడు. దేశంలోని బలహీన వర్గాల హక్కుల కోసం నిరంతరం పోరాడిన సమాజ సంస్కర్త గాంధీజీ, స్వదేశీ ఉద్యమం ద్వారా ప్రజలకు స్వావలంబన తెలిపిన వ్యక్తి” అని అన్నారు.అతను ప్రపంచానికి అహింస మార్గాన్ని చూపిన శాంతిదూతగా నిలిచారని, ఆయన జీవితం ప్రతి భారతీయుడికి మార్గదర్శకంగా ఉన్నదని గంధం వెంకటేష్ గుర్తుచేశారు. నేటి తరానికి గాంధీజీ బోధనలు మరింత ప్రాముఖ్యతను సంతరించుకుని, మార్గదర్శకంగా అవసరమని కూడా ఆయన అభిప్రాయపడ్డారు.ఈ వర్ధంతి సందర్భాన్ని పురస్కరించుకుని, గాంధీజీ ఆలోచనలను ఆచరణలో పెట్టి దేశాభివృద్ధికి ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రిటైర్డ్ డిఎంహెచ్వో డాక్టర్ పి. గోపాల్, గణేష్, రవి బుశెట్టి, నరసింహ, గంధం శేఖర్ తదితరులు పాల్గొన్నారు.ం

### మాజీ మంత్రి సి. లక్ష్మారెడ్డి జన్మదినం

## సందర్భంగా రక్తదాన శిబిరం...



జడ్చర్ల//**జనవరి 30 ఆకాంక్ష :** రాష్ట్ర మాజీ మంత్రి డాక్టర్ సి. లక్ష్మారెడ్డి జన్మదినం సందర్భంగా ఫిబ్రవరి 3న జడ్చర్ల పట్టణ కేంద్రంలోని ప్రేమ్ రంగా గార్డెన్స్ లో 22వ రక్తదాన శిబిరం నిర్వహించనుంది.మాజీ జడ్పీ వైస్ చైర్మన్ కోడుగల్ యాదయ్య ఈ శిబిరాన్ని విజయవంతం చేసేందుకు బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, లక్ష్మారెడ్డి అభిమానులను పెద్ద ఎత్తున పాల్గొనమని పిలుపునిచ్చారు. కార్యక్రమం ఉదయం 9:00 గంటలకు ప్రారంభమవుతుందని, ప్రారంభానికి ముందే కావేరమ్మపేట మున్సిపాలిటీ కార్యాలయం వద్ద 8:00 గంటలకు ర్యాలీకి స్థానం చేరాలని ఆయన చెప్పారు.గత 22 సంవత్సరాలుగా రక్తదాన శిబిరంలో పెద్ద ఎత్తున కార్యకర్తలు, అభిమానులు పాల్గొని లక్ష్మారెడ్డి పై తమ ప్రేమను ప్రదర్శించినట్లు గుర్తు చేశారు. కార్యక్రమం అనంతరం ప్రేమ్ రంగా గార్డెన్ లో కార్యకర్తలకు, అభిమానులకు అన్నదానం కూడా ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ పిట్టల మురళి, మండల పార్టీ అధ్యక్షుడు రఘుపతి రెడ్డి, సీనియర్ నాయకులు శ్రీశైలం యాదవ్, ఇంతియాజ్ అహ్మద్ ఖాన్, కౌన్సిలర్లు సతీష్, నందకిషోర్ గౌడ్, చైతన్య, డి. కృష్ణయ్య, రెడ్ క్రాస్ సభ్యులు నటరాజ్, యూత్ వింగ్ అధ్యక్షుడు విరేష్ తదితరులు పాల్గొననున్నారు.

Printed, Published and Owned by PENAGONDA SATHISH,Printed at BUILDING NO: 1-17-18, SVN COLONY, SUNDAY PRINTING PRESS,Editor: PENAGONDA SATHISH,: H NO : 8-4-458, RAM NAGAR, GODAVARIKHANI, PEDDAPALLI, TELANGANA - 505209. RNI.No.TGTEL/25/A1964,Cell : 8333818121,Email: akankshanewsdaily@gmail.com